ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 22, ఏప్రిల్ 2025





మార్కాపురంలో భారీ భక్త జనసందోహం మధ్య సాగుతున్న చెన్నకేశవస్వామి రథోత్సవం (ఇన్‌సెట్‌లో) రథంపై శ్రీదేవి, భూదేవిలతో స్వామివారు



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న చెన్నకేశవస్వామి ఆలయం

రమణీయం.. చెన్నయ్య రథోత్సవం

మార్కాపురంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. జై చెన్నకేశవ.. జైజై చెన్నకేశవ నామస్మరణతో పట్టణం మార్మోగింది. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది. జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉభయ దేవేరులతో ఉన్న స్వామి దివ్యమంగళ రూపాన్ని తిలకించి తరించారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఉదయం స్వామివారు గజ వాహనంపై సార్వభౌముని అలంకారంలో నాలుగు మాడవీధుల్లో విహరించారు.

వివరాలు 7వ పేజీలో...

ధరల కోత.. అక్రమ కొనుగోళ్లు

ఒడిదొడుకుల్లో పొగాకు మార్కెట్

పొగాకు మార్కెట్లో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. వేలం కేంద్రాలలో కూటమి కట్టి గరిష్ఠ ధరలపై సీలింగ్ పెట్టుకుంటున్నారు. అధికారులు సూచించిన రేటుకు కూడా బేళ్లను కొనుగోలు చేయకుండా భారీగా నోబిడ్లకు కారణమవుతున్నారు. అదేసమయంలో తమకు అవసరమైన మేర వేలం కేంద్రాల వెలుపల అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్ తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. దీంతో సాధారణ రైతులు నష్టపోతున్నారు. తక్షణం ఆర్థిక సమస్యలు లేని వారు మేలురకం బేళ్లను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకొని ఒక మోస్తరు నాణ్యత ఉన్న వాటినే అమ్మకాలకు తెస్తున్నారు. దీంతో మార్కెట్ మరింత గందరగోళంలో పడుతోంది. ఈనేపథ్యంలో మొత్తం వ్యవహారాన్ని సమన్వయం చేసి సజావుగా నడిపించాల్సిన పొగాకు బోర్డు అధికారులు ఆ విషయంలో విఫలమవుతున్నారు. ఫలితంగా ధరల సమస్య ఏర్పడింది.

- వ్యాపారుల సిండికేట్
- పలు వేలం కేంద్రాల్లో భారీగా నోబిడ్లు
- నియంత్రించడంలో బోర్డు విఫలం
- మేలు రకాన్ని నిల్వ చేస్తున్న రైతులు
- రైతు ప్రతినిధులతో నేడు గుంటూరులో బోర్డు ఈడీ సమావేశం



ఒంగోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో ప్రస్తుత సీజన్ (2024-25)లో 105 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. సుమారు 161 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అయినట్లు అంచనా. పొగాకు కొనుగోళ్లు గతనెల 11న ప్రారంభమయ్యాయి. తొలిరోజు గరిష్ఠ ధర కిలో ఏకంగా రూ.280 పలికింది. గతేడాది కన్నా కిలోకు రూ.50 పెంచి ప్రారంభ ధరను వ్యాపారులు ఇవ్వడంతో ఈ ఏడాది కూడా గతంలో వలే మార్కెట్ హాట్‌హాట్‌గా ఉంటుందని రైతులు భావించారు. అయితే వారం, పది రోజులు గడిచేసరికే ఆ వాతావరణం పోయింది. వ్యాపారులంతా కూటమి కట్టి గరిష్ఠ ధరను కిలో రూ.280కి నియంత్రించారు. ఇక ఆ ధరకు కూడా తక్కువ బేళ్లకు ఇస్తున్నారు. మెజారిటీ బేళ్లను కిలో రూ.240 నుంచి రూ.260లోపుగా కొనుగోలు చేస్తున్నారు. మీడియం, లోగ్రేడ్‌లలో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్‌రకం బేళ్లను మరింత తగ్గించి

25శాతం వరకు నోబిడ్లు

ఎస్‌బీఎస్ రీజియన్‌లోని వెల్లంపల్లి, ఒంగోలు-2 వంటి కేంద్రాలలో నోబిడ్‌లు 25శాతం వరకూ ఉంటున్నాయి. ఇతర కేంద్రాల్లో 15శాతం వరకూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు వేలం కేంద్రాల్లో ధరలు పెరగకుండా కూటమి కట్టి వ్యవహారాలు నడుపుతున్న వ్యాపారులు తమకు అవసరమైన బేళ్లను బయట అక్రమంగా కొంటున్నారు. టంగుటూరు, ముక్తినూతలపాడు ప్రాంతాలకు చెందిన వేస్తున్నారు. వాటికి బోర్డు అధికారులు బిడ్డింగ్ పెట్టిన ధరలు కూడా ఇవ్వడం లేదు. రైతులు కూడా ఈ ధరలు చూసి నాణ్యమైన రకం బేళ్లను భవిష్యత్‌లో మంచి ధరలు వచ్చినప్పుడు అమ్ముకునే ఆలోచనతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి ఒక మోస్తరుగా ఉన్నవి మాత్రమే తెస్తున్నారు. అలా అటు వ్యాపారులు, ఇటు రైతుల తీరుతో నిత్యం పలు కేంద్రాల్లో భారీగా బేళ్లు నోబిడ్ అవుతున్నాయి.

మిగతా 6వ పేజీలో


అవిశ్వాసాల కాలం

- మార్కాపురం, చీరాలలో సిద్ధమైన టీడీపీ
- రెండు మునిసిపల్ చైర్మన్ పదవుల కైవసానికి ప్రయత్నం
- కిందిస్థాయిలోనూ పలుచోట్ల మార్పులకు అవకాశం

7లో



వాగును ఆక్రమించి రియల్టర్లు కట్టిన గోడ



వెంచర్‌లోకి వెళ్లేందుకు వాగుపై నిర్మించిన చప్టా

వాగు భూమి హాంఫట్

కనిగిరి ప్రాంతంలో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు రియల్టర్లు చెలరేగిపోయారు. ఖాళీ జాగా నుంచి ప్రభుత్వ, అసైన్డ్ భూముల వరకూ వదలకుండా ఆక్రమించి వెంచర్లు వేశారు. వాటిని అమ్ముకొని పెద్దమొత్తంలో సొమ్ము చేసుకున్నారు. వాగులు, వంకలు, పోరంబోకు, పశువుల బీడులను కబ్జా చేసి పోడు మట్టితో మెరకలు పోసి సొంతం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి భూ అక్రమాలకు బ్రేక్ పడింది. దీంతో ఇప్పుడు కొత్త పంథాకు తెరలేపారు. వెనకుండి చక్రం తిప్పుతూ అధికారపార్టీ అండదండలున్న నేతలను ముందుంచి కథ నడిపిస్తున్నారు.

9 ఎకరాలు ఆక్రమించి వెంచర్లు

- పట్టించుకోని అధికారులు
- పెద్దమొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు
- తెర వెనుక చక్రం తిప్పుతున్న వైసీపీ నేతలు

కనిగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో వేలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. పామూరు, కనిగిరి మండలాల్లో భూబకాసురుల పని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అప్పట్లో కనిగిరిలో జరుగుతున్న భూఅక్రమాలను రాష్ట్రస్థాయికి తీసుకెళ్లారు. ఈమేరకు వైసీపీ పాలనలో ప్రభుత్వ, పశువుల బీడు, పోరంబోకు భూముల ఆక్రమణ, కబ్జాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. మరోవైపు ప్రజల్ని అప్రమత్తం చేశారు. అదేసమయంలో జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ భూమేత బయటపడింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో భూ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేశారు. ఎన్నికలు రావడంతో దర్యాప్తు కొనసాగలేదు. కనిగిరి ప్రాంతంలో భూ అక్రమాలు మాత్రం సాగుతూనే ఉన్నాయి.పట్టణంలోని కొత్తూరు అంజనేయస్వామి

మిగతా 6వ పేజీలో

గత వైసీపీ ప్రభుత్వంలో భూ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేసేందుకు అప్పట్లో డాక్టర్ ఉగ్ర పోరాడారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ఆయన అలాంటి అక్రమాలకు తావులేకుండా హెచ్చరికలు చేస్తున్నారు. ఇది భూ కబ్జారాయుళ్లకు ఇబ్బందిగా మారింది.

టీడీపీలోని కొందరి సహకారం

తాజాగా 388/2లోని భూమిని డాటెడ్ ల్యాండ్ నుంచి తొలగించడంతో వైసీపీ నేతలు తిరిగి అక్రమాలకు తెరలేపారు. వాగును ఆక్రమించి పోడు మట్టిని పోసి వెంచర్ వేశారు. ప్లాట్లుగా హద్దురాళ్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. టీడీపీలో ఎన్నికలకు ముందు చేరిన కొంత మంది వైసీపీకి చెందిన ఆక్రమణదారులకు సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

వేగంగా ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి

- ఇప్పటికే రూ.20.80లక్షలతో లెవలింగ్, ట్రాక్ పనులు
- రూ.4లక్షల విలువైన పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు
- కీలకమైన దక్షిణం వైపు రూ.9.60 లక్షలతో డ్రైన్లు
- రూ.10లక్షలతో సోలార్ లైట్లకు టెండర్లు ఖరారు
- మొత్తం రూ.1.18 కోట్లతో 39వ డివిజన్‌లో పనులు
- 'ఆంధ్రజ్యోతి' చర్చావేదికలో వచ్చిన సమస్యలపై చొరవచూపిన ఎమ్మెల్యే దామచర్ల

6లో



పార్కులో ట్రాక్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రింగ్ రోడ్డుకు రంగం సిద్ధం

- ఒంగోలులో పశ్చిమ బైపాస్‌కు మూడు ప్రతిపాదనలు
- కన్సల్టెన్సీ ప్రతినిధులతో చర్చించిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్
- త్వరలో కేంద్ర బృందం పరిశీలన
- తర్వాత పూర్తిస్థాయిలో డీపీఆర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు పశ్చిమ వైపున మరో బైపాస్ ఏర్పాటుకు మూడు ప్రతిపాదనలను కన్సల్టెన్సీ ప్రతినిధులు రూపొందించారు. వాటిపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్‌లు సంబంధిత అధికారులతో చర్చించారు. ఒంగోలుకు పశ్చిమ వైపున బైపాస్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధంచేసినట్లు కన్సల్టెన్సీ ప్రతినిధి సురేష్ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను కూడా ఎంపీ, ఎమ్మెల్యేలకు వివరించారు. త్రోవగుంట సమీపంలోని చీరాల రోడ్డు నుంచి భగీరథ ఫ్యాక్టరీ మీదుగా జాతీయ రహదారి వరకు రింగ్‌రోడ్డు మాదిరిగా ఒక ప్రతిపాదన ఉన్నట్లు చెప్పారు. మద్దిపాడు మండలం కొష్టాల నుంచి వల్లూరు సమీపంలో జాతీయ రహదారి వరకు మరొకటి, వెల్లంపల్లి నుంచి ఎండ్లూరు డొంక వద్ద ఉన్న ఎస్ఎస్ఎన్ కళాశాల మీదుగా తూర్పునాయుడుపాలెం వరకూ మూడో ప్రతిపాదన ఉన్నట్లు తెలిపారు. వీటిపై జాతీయ రహదారులకు సంబంధించిన బృందం పరిశీలించిన తర్వాత డీపీఆర్‌ను రూపొందిస్తామని ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. వాటిపై ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్‌లు చర్చించారు. ఆయా ప్రతిపాదనలను కేంద్రానికి పంపించాలని వారు సూచించారు. ఒంగోలులో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు తీసుకోవాల్సిన అంశాలను దృష్టిలో ఉంచుకొని సమగ్రంగా ప్రాజెక్టు నివేదికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, మేయర్ గంగాడ సుజాత, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానంద్ పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను చూస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

ఆర్టీసీ ఆర్ఎంగా సత్యనారాయణ | తిరుపతికి వెంకట్రావు బదిలీ 6లో

ఆర్టీసీ ఆర్ఎంగా సత్యనారాయణ

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రకాశం జిల్లా రీజనల్ మేనేజరుగా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటివరకు విజయవాడ వర్క్‌షాప్ మేనేజరుగా ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వెంకట్రావును తిరుపతి ఆర్ఎంగా బదిలీ చేశారు. అలాగే విజయవాడ ఆర్టీసీ విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఘట్టమనేని శ్రీనివాసరావును ఒంగోలు కార్గో కొరియర్ సర్వీసెస్ కమర్షియల్ మేనేజరుగా నియమించారు. ఈమేరకు జిల్లాకు నియమితులైన వారిద్దరూ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) 2023-25 బ్యాచ్ నాల్గవ సెమిస్టర్ విద్యార్థులు మంగళవారం వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రూ. 250 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ. 50 అపరాధరుసుంతో ఈనెల 27 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు నాలుగు సబ్జెక్టుల వరకు రూ. 250, రెండు సబ్జెక్టులకు రూ. 150, ఒక సబ్జెక్టుకు రూ. 125 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన స్మార్ట్ విద్యుత్‌మీటర్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఉప్పుగుండూరు గ్రామంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు జె.జయంతి బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులను దోపిడీ చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి స్మార్ట్ విద్యుత్ మీటర్లను తొలగించి పాత మీటర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూబాటి శ్రీకాంత్,మాదాసు నాగేశ్వరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, నలతోటి రామారావు, యు. వెంకటేశ్వర్లు, కమలాకర్, పిన్నింటి నాగేశ్వరరావు, జి.బసవ పున్నయ్య పాల్గొన్నారు.

బెట్టింగ్‌తో అప్పుల పాలయిన భర్త

తాళలేక భార్య సుమియా భాను బలవన్మరణం

వివాదాల్లో కూరుకుపోయిన కుటుంబం

ఈపూరుపాలెం (చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల పాప, మూడు నెలల బాబు. ఎంతో అన్యోన్యమైన కుటుంబంలో బెట్టింగ్ యాప్ విషాదాన్ని నింపింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరుపాలెం పీర్ల చావిడి సమీపానికి చెందిన మొగల్ బాజీ లియాస్ బబ్లు, చినగంజాంకు చెందిన సుమియా భాను(21) దంపతులు.వీరికి మూడేళ్ల పాప, మూడు నెలల బాబు సంతానం. బాజీ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ బెట్టింగ్ యాప్‌కు బానిసగా మారాడు. ఈనేపథ్యంలో అప్పుల్లో కూరుకుపోవడంతో అనుకోని రీతిలో ఉన్న ఇంటిని అమ్మకం చేసి బాకీలు తేర్చే ప్రయత్నం జరిగింది. ఈక్రమంలో భార్యాభర్తల మధ్య వివాదం నెలకొంది. అవి కాస్త తారస్థాయికి చేరడంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరికి పాల్పడింది. వెంటనే భర్త స్థానికుల సహకారంతో చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమియాభాను తల్లి పఠాన్ ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

దొంగతనాలకు పాల్పడుతూ గంజాయి విక్రయించే ముఠా అరెస్ట్

నాలుగున్నర కేజీల సరకు..

రూ.10 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం

వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య



స్వాధీనం చేసుకొన్న పంచలోహ విగ్రహం

సింగరాయకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడుతూ, ఆ సొత్తుతో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి విక్రయించే ముగ్గురు సభ్యుల ముఠాను సింగరాయకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నాలుగున్నర కిలోల గంజాయి, రూ.10లక్షల విలువ చేసే వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గుజ్జుల యల్లమందారెడ్డి నగర్‌కు చెందిన కుంచాల గురవమ్మ శనక్కాయలు అమ్ముకుంటూ జీవనం సాగించేది. దానిద్వారా వచ్చే నగదు సరిపోవడంలేదని అడ్డదారిలో సంపాదించాలనే అత్యాశతో గంజాయి రవాణా చేయడం ప్రారంభించింది. రైలులో రాజమండ్రి వెళ్లి అక్కడ గంజాయిని కిలో రూ.1,500 చొప్పు కొనుగోలు చేసి దాన్ని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి కేజీ రూ.10వేలకు విక్రయిస్తోంది. ఈక్రమంలో దొంగతనాలకు పాల్పడుతూ అక్రమంగా నగదు సంపాదిస్తున్న ఒంగోలు మండలం పేర్నమిట్టకు చెందిన చిడితోటి మధుబాబు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేని వారిపాలేనికి చెందిన రాకూరి దుర్గారావు, తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లెకు చెందిన కళ్లెం రవికుమార్‌లకు గురవమ్మతో పరిచయం ఏర్పడింది. దొంగతనాలతో పాటు గంజాయి అమ్మకాల ద్వారా అధిక నగదు సంపాదించాలన్న దురాశతో వారు తరచూ గురవమ్మ దగ్గర గంజాయిని కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ముగ్గురు నిందితులు మధుబాబు, దుర్గారావు, రవికుమార్ గంజాయి ప్యాకెట్ల కోసం గుజ్జుల యలమందారెడ్డి నగర్‌లోని గురవమ్మ దగ్గరకు వచ్చారు. ఒక్కొక్కరు కిలో గంజాయి కావాలని ఆమెను అడిగారు. ఆమె వెంటనే గోతం సంచిలో నుంచి గంజాయి ప్యాకెట్లు తీసి ఇస్తుండగా సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించి పరారవుతున్న నలుగురినీ అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా అందులో మధుబాబు, దుర్గారావు, రవికుమార్‌లు రాష్ట్రంలోని పలు జిల్లాలలో దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. వారిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం నిందితుల నుంచి రూ.10 లక్షల విలువచేసే 3 సవర్ల బంగార ఆభరణాలు, పావు కిలో వెండి, ఇత్తడి, రాగి వస్తువులు, అమ్మవారి పంచలోహ విగ్రహం, శిలాతోరణం, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పలు జిల్లాలలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను,గంజాయి సరఫరా చేసే నిందితులను చాకచక్యంగా పట్టుకొన్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, సిబ్బందిని ఎస్పీ దామోదర్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అభినందించారు.

వేగంగా ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి

మొత్తం రూ.1.18 కోట్లతో 39వ డివిజన్‌లో పనులు

'ఆంధ్రజ్యోతి' చర్చావేదికలో వచ్చిన సమస్యలపై చొరవ చూపిన ఎమ్మెల్యే దామచర్ల



పార్కులో కొత్తగా తెచ్చిన పిల్లలక్రీడా సామగ్రిని అమర్చుతున్న కూలీలు

ఒంగోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 37వ డివిజన్‌లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలకు 'ఆంధ్రజ్యోతి' చర్చా వేదిక అనంతరం పరిష్కారం లభిస్తోంది. ప్రత్యేకించి నిత్యం వందలాది మంది వచ్చే ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. 'అక్షరమే అండగా... పరిష్కారమే అజెండాగా' పేరుతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు ఆ సందర్భంగా ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చొరవ చూపారు. డివిజన్‌లో రూ.1.18కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. అందులో ఒక్క ఎన్టీఆర్ పార్కుకు ఉపకరించే పనులకు రూ.52.40 లక్షలు వ్యయం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పనులు జరుగుతుండగా, మరికొన్నింటికి టెండర్లు పూర్తిచేసి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా గత జనవరి 28న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి పలు పట్టణాల్లో చర్చావేదికలను నిర్వహించింది. అందులో భాగంగా ఒంగోలు నగరంలోని అతి పెద్దదైన, అభివృద్ధి చెందుతూ మౌలిక సౌకర్యాల ఏర్పాటు అవసరం అధికంగా ఉన్న 37వ డివిజన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. అక్కడి ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన చర్చావేదికకు వందల సంఖ్యలో స్థానికులు రాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ హాజరయ్యారు. 70మంది వరకు మాట్లాడి ఆ ప్రాంత సమస్యలు వివరించారు.

పార్కు అభివృద్ధే ప్రధాన అంశం

ప్రధానంగా అందరికీ అవసరమైన పార్కు అభివృద్ధి గురించి, అలాగే అసంపూర్తిగా ఉన్న డ్రైన్లు, సిమెంట్ రోడ్లు, విద్యుత్, పారిశుధ్య సమస్యలను ప్రస్తావించారు. ఆయా అంశాలపై చర్చావేదికలో ఎమ్మెల్యే జనార్దన్ నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. దశలవారీగా రూ.10కోట్లతో 37వ డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిన ఆయన తక్షణం పార్కు అభివృద్ధి, ఇతర అత్యవసరమైన డ్రైన్లు, రోడ్ల పనులు చేసేందుకు హామీ ఇచ్చారు. తదనుగుణమైన చర్యలకు అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లో నిధులు కొరత తీవ్రంగా ఉన్నా కమిషనర్ వెంకటేశ్వరరావు చొరవ చూపి పలు పనులపై దృష్టి పెట్టారు. దాదాపు రూ.1.18 కోట్లతో డివిజన్‌లో అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచారు. అందులో ఒక్క పార్కుకు సంబంధించే రూ.52.40లక్షల వెచ్చిస్తున్నారు. అందులో రూ.10లక్షలతో పార్కు లోపల లెవలింగ్, మరో రూ.10.80 లక్షలతో రెండువైపులా ట్రాక్ అభివృద్ధి పనులు చేపట్టారు. లెవలింగ్ కోసం ఎర్రమట్టి తోలి చదును చేయగా ట్రాక్ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి.

కొత్త ఆట వస్తువులు, రంగులు

పార్కులో పిల్లలు ఆడుకునే పలు ఆట వస్తువులు దెబ్బతిన్నాయి. వాటిని గుర్తించి రూ.4లక్షలతో కొత్త వస్తువులు తెప్పించి ఏర్పాటు చేస్తున్నారు. కొన్నింటికి మరమ్మతులు చేయిస్తున్నారు. పార్కులో ప్రస్తుతం ఉన్న విద్యుత్ బల్బుల స్థానంలో రూ.10లక్షలతో సోలార్ లైట్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. త్వరలో ఆ పనులు ప్రారంభం కానుండగా మరో రూ.7.15 లక్షలతో పార్కు గోడలపై రెయిన్‌బో రంగులతో బొమ్మలు వేసేలా నిర్ణయించారు. ఇక పార్కులో డ్రైనేజీకి తీవ్ర ప్రతిబంధకంగా ఉన్న దక్షిణం వైపు కాలువ నిర్మాణానికి రూ.9.60లక్షలతో టెండర్లు పిలువగా కాంట్రాక్టు ఏజెన్సీ ఖరారైంది. ఈ వారంలో ఆ పని కూడా ప్రారంభించనున్నట్లు కార్పొరేషన్ అధికారుల సమాచారం. ఇదిలా ఉండగా డివిజన్‌లోని వివిధ కాలనీల్లో మరో రూ.56లక్షలతో పలు రోడ్లు, డ్రైన్లు ఇతర పనులకు టెండర్లు ఖరారు చేశారు. కొన్ని మొదలవగా, మరికొన్నింటిని త్వరలో ప్రారంభించనున్నారు. మొత్తం మీద ఈ వేసవిలో ఆయా పనులు పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు. పార్కులో అభివృద్ధి పనులను స్థానిక వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

పాల్గొన్న ఎంపీ మాగుంట



ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్లను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రలో సోమవారం జరిగిన ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా గేరా అజయ్‌కుమార్, కార్యదర్శిగా శివకోటిరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జనార్దన్ మాట్లాడుతూ ఒకప్పుడు స్కూలు గుర్తింపు కాలపరిమితి పదేళ్లు ఉంటే గత ప్రభుత్వం ఎనిమిదేళ్లు చేసిందన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ సమస్యను గుర్తించి పాఠశాల గుర్తింపు కాలపరిమితి పదేళ్లకు పొడిగిస్తామని చెప్పారన్నారు. అదేవిధంగా పాఠశాలలు ఎదుర్కొంటున్న విద్యుత్ టారిఫ్, ఫైర్ సర్టిఫికెట్ వంటి సమస్యలన్నీ పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలే కాకుండా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరిస్తుందని జనార్దన్ తెలిపారు. మరొక ముఖ్యఅతిథి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తోందని, ఈ రంగాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు సుందరరామ్, రాష్ట్ర నాయకులు పి.ప్రకాష్ బాబు, ఒంగోలు పట్టణ అధ్యక్షురాలు ఈవీఎస్ లక్ష్మి, ఐపీపీ జాలిరెడ్డి, బొమ్మల శ్రీనివాసరావు, ఆత్మకూరి బ్రహ్మయ్య, శివప్రసాద్, విజేత రమణ, వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అనంతరం వారు ఎమ్మెల్యే, ఎంపీలను సత్కరించారు.

వాగు భూమి హాంఫట్

(5వ పేజీ తరువాయి)

దేవాలయం వెనుకవైపు అరకిలోమీటర్ దూరంలోని సర్వే నంబరు 388/1లో 9.85 ఎకరాల అలుగు వాగు భూమి ఉంది. రెవిన్యూ రికార్డులోనే అదే విధంగా నమోదై ఉంది. ఈ వాగు వెంబడే ఉన్న 388/2లో 2.05 ఎకరాలు చుక్కల భూమి (22ఏ)గా ఉంది. ఈ చుక్కల భూమిని కొనుగోలు చేసిన రియల్టర్‌లు గత వైసీపీ ప్రభుత్వంలో వాగు ఆక్రమించి వెంచర్ వేసేందుకు సిద్ధపడ్డారు. ఆ సమయంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలతో అప్పటి మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్ అప్రమత్తమై అడ్డుకున్నారు. ఈలోపు ఎన్నికలు రావడంతో వ్యవహారం నడవలేదు. దీంతో అప్పుడు స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు మళ్లీ వెంచర్ ఏర్పాటుకు సిద్ధపడ్డారు. అందుకోసం ప్రత్యేకంగా ఎలాంటి అనుమతులు లేకుండా వాగుపై చప్టా కూడా నిర్మించి వెంచర్ వేసి ప్లాట్ల విక్రయానికి తెగబడ్డారు. ఆయా వెంచర్‌కు విద్యుత్ స్తంభాలు కూడా మంజూరు చేయడం విస్మయానికి గురిచేస్తోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించలేదు. దీని వెనుక డివిజన్ స్థాయి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు పెద్దఎత్తున తాయిలాలు ముట్టాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



వాగు భూమిలో పోడు మట్టిని మెరకగా పోసి వేసిన ప్లాట్లు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రవిశంకర్, తహసీల్దార్, కనిగిరి



వాగు భూమిని ఆక్రమించడం నేరం. అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం చట్ట విరుద్ధం. విచారించి తగు చర్యలు తీసుకుంటాం. వాగు ఆక్రమణ అని తేలితే వెంచర్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అనుమతులు లేకుండా వేసిన వెంచర్లను తొలగిస్తాం.

వైద్యశాఖకు ఐదు అంబులెన్స్‌లను అప్పగించిన కలెక్టర్

అవీఇవీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌రైజ్ సంస్థ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన ఐదు బీఎల్ఎస్ అంబులెన్స్‌లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం జిల్లావైద్యఆరోగ్యశాఖకు అప్పగించారు. ఈ అంబులెన్స్‌లను సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్, టంగుటూరు టోల్‌ప్లాజా, జాతీయరహదారి-16వారి సీఎస్ఆర్ మద్దతుతో అందించారు. ఈకార్యక్రమంలో ఎస్‌హెచ్ఏ1 ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. విద్యాసాగర్, డీఎంహెచ్‌వో డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డీసీఎస్‌హెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, ఎస్ఈఎల్ ప్రాజెక్టు హెడ్ శివకుమార్, టీమ్ లీడర్ సురేష్‌బాబు, సింహపురి సీఎస్ఆర్ కో ఆర్డినేటర్ డండా కోటేశ్వరరావు ఉన్నారు.

ఏరువాక కేంద్రం మళ్లీ ఏర్పాటయ్యేలా చూడాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రాన్ని(ఏరువాక) పునఃస్థాపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రతినిధులు కోరారు. సోమవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కేంద్రాన్ని ఒంగోలులో 1998-99 మధ్య కాలంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. ఆ కేంద్రంలోని శాస్త్రవేత్తలు సమర్థవంతంగా పనిచేసి జిల్లాలోని తూర్పు ప్రాంతంలోని 30 మండలాల్లోని రైతాంగానికి అవసరమైన సాంకేతిక సలహాలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించి మంచి సేవలు అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. ఈ కేంద్రాన్ని 2023లో గత ప్రభుత్వం ఒంగోలు నుంచి తరలించడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని అనేకసార్లు కలిసి వివరించినా ఇంతవరకు తిరిగి ఏర్పాటు చేయలేదన్నారు. అందువల్ల వ్యవసాయ సాంకేతిక సలహా(ఏరువాకకేంద్రం) తిరిగి ఒంగోలులో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాగుంటను కోరారు. మాగుంటను కలిసిన వారిలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆళ్ల వెంకటేశ్వరరావు, చుంచు శేషయ్య, మండవ శ్రీనివాసరావు, జి. కోటేశ్వరరావు ఉన్నారు.

ధరల కోత.. అక్రమ కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

మధ్యస్థాయి డీలర్లు, వ్యాపారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జోరుగా అక్రమ కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. పొగాకు రంగంలో ఎగుమతిదారులుగా పేరున్న రెండు, మూడు కంపెనీల వారు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా బయట కొనుగోళ్లను ప్రోత్సహిస్తుండగా బోర్డు నిఘా విభాగం వాటిని నియంత్రించడంలో విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. వెలుపల బేళ్ల విక్రయాలకు రైతులు అయిష్టంగా ఉన్నప్పటికీ ఇంచుమించు నెలరోజులుగా మార్కెట్లో ధరలు పెరగకపోవడమే కాక నోబిడ్లు పెరుగుతుండటంతో అటువైపు మొగ్గుచూపుతున్నారు. కర్నాటకలో వేలం పూర్తయినా ఇక్కడ వేగం అందుకోకపోవడం వంటి కారణాలతో ప్రస్తుతం బయటకొనే వ్యాపారులకు తమ ఆర్థిక అవసరాల రీత్యా పొగాకును అమ్మేస్తున్నారు.

బయట కిలో రూ.240!

బయట కొనుగోలు చేస్తున్న కిలో పొగాకుకు వ్యాపారులు రూ.240 మాత్రమే రైతులకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక వెసులుబాటు ఉన్న వారు ఈ తరహా అమ్మకాలకు దూరంగా ఉన్నప్పటికీ డబ్బు అవసరమైన వారు అనధికారిక బ్యారన్లు వేసిన వారు ఇలా అమ్ముతున్నారు. మార్కెట్‌లో ఉన్న పరిస్థితులతో దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలలో 40రోజుల క్రితం వేలం ప్రారంభించినా ఇప్పటి వరకు కేవలం 12 మిలియన్ కిలోల పంటను మాత్రమే కొనుగోలు చేశారు. ఇలా అయితే మొత్తం పంట 161 మిలియన్ కిలోల విక్రయాలకు ఆరేడు మాసాలకుపైన పట్టే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని గుర్తించిన కొందరు రైతు ప్రతినిధులు, బోర్డు సభ్యుల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి ఈ గందరగోళ పరిస్థితిని తీసుకెళ్లారు. దీంతో పొగాకు బోర్డు ఈడీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన విశ్వశ్రీ ఈ అంశంపై దృష్టి పెట్టారు. పొగాకు రైతు ప్రతినిధులు, బోర్డు కీలక అధికారులతో మంగళవారం గుంటూరులోని బోర్డు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాపారులతోనూ భేటీ కానున్నట్లు సమాచారం. కాగా సమావేశంలో స్థానికంగా వేలంకేంద్రాలలో ధరల కోత, అక్రమ కొనుగోళ్లు తదితర అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రైతు ప్రతినిధులు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

మాతా శిశు సంరక్షణ సేవలను మెరుగ్గా అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మాత శిశు సంరక్షణ సేవలు అందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్రపోషించి మాతృ, శిశు మరణాలు సంభవించకుండా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆశా నోడల్‌ఆఫీసర్లు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆశాలపై ఉందన్నారు. వడదెబ్బ మరణాలను నివారించేందుకు ప్రజలు పాటించాల్సిన అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీపీఎంవో డాక్టర్ పద్మజ, ఉప జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ వాణిశ్రీ, డీపీహెచ్ఎన్‌వో సుగుణమ్మ, డీసీఎం రాజేశ్వరి, జిల్లామాస్ మీడియా అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్, శక్తియాప్‌లను పటిష్టంగా అమలు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర పేరుతో అమలుచేస్తున్న వాట్సాప్ గవర్నెన్స్ శక్తి యాప్‌లపై క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మునిసిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. వాట్సాప్ గవర్నెన్స్ శక్తియాప్‌లను ఈనెల 15వతేదీ నుంచి సచివాలయ పరిధిలో జరుగుతుందన్నారు. ఈ అవగాహన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయడం, ప్రభుత్వం రూపొందించిన బ్రోచర్లను ప్రజలకు అందజేయడంతో పాటు వారి మొబైల్ ఫోన్‌లో సంబంధిత యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం జరగాలన్నారు. వాట్సప్ గవర్నెన్స్ వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈనెల 25 నాటికి అవగాహన కార్యక్రమాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదివారం జిల్లాలో పిడుగుపాటు వల్ల ఇద్దరు విద్యార్థులు మరణించడం బాధకరమని, వర్షాకాలంలో ముఖ్యంగా మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉన్న సమయంలో ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి మండల స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, జోసఫ్‌కుమార్, వెంకటనాయుడు, బాలశంకరరావు తదితరులు ఉన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


మాడవీధుల్లో చెన్నయ్య రథోత్సవం


ఉదయం జరిగిన వాహన సేవను తిలకిస్తున్న భక్తులు


రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, దామచర్ల జనార్దన్

రమణీయం.. చెన్నకేశవుని రథోత్సవం

● భక్తజనసందోహంతో పులకించిన మార్కాపురం ● వెల్లివెరిసిన ఆధ్యాత్మిక శోభ


పాత్రికేయుల ఆధ్వర్యంలో అన్నదానం


కళాకారుల నృత్యం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రథంలో ఉభయ దేవేర్లతో స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించిన భక్తజనకోటి పులకరించింది. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని ఉత్సవమూర్తులు రథంపై ఆశీనమైన వేళ 'జై చెన్నకేశవ, జైజై చెన్నకేశవ' నినాదాలతో భక్తులు తన్మయం చెందారు. ఉభయ దాతలు మోదాల వెంకటరామయ్య, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు బలిహరణ తరువాత రథం కింద గుమ్మడికాయలు పెట్టి, కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. నాలుగు మాడవీధులలో రథంపై విహరించిన చెన్నుడు తిరిగి ఆలయానికి చేరుకున్నాడు. చెన్నకేశవుని దర్శించుకోవడానికి భక్తులు మిద్దెలు, మేడలు బహుళ అంతస్తుల భవనాలు ఎక్కి సందడి చేశారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, జంకె వెంకటరెడ్డి, సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్ యక్కలి కాశీ విశ్వనాథం, సభ్యులు, ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అవిశ్వాసాల కాలం

స్థానిక సంస్థలలో అవిశ్వాస తీర్మానం ద్వారా పాలకమండళ్లు కైవసం చేసుకునే ప్రక్రియకు అధికార తెలుగుదేశం పార్టీ శ్రీకారం పలకబోతోంది. అందుకు అనుగుణంగా మార్కాపురం, చీరాల మున్సిపాలిటీల్లో పావులు కదుపుతోంది. ఆ రెండు మున్సిపాలిటీల్లో మున్సిపల్ చైర్మన్లను దింపేందుకు టీడీపీ రంగం సిద్ధం చేసుకుంటుండగా మిగిలిన ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ రకమైన రాజకీయ కదలిక కనిపిస్తుండటం విశేషం.

- మార్కాపురం, చీరాలలో సిద్ధమైన టీడీపీ
- రెండు మున్సిపల్ చైర్మన్ల కైవసానికి ప్రయత్నం
- కిందిస్థాయిలోనూ పలుచోట్ల మార్పులకు అవకాశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రస్తుతం స్థానిక సంస్థలైన జిల్లా పరిషత్, కార్పొరేషన్, నగర పంచాయతీలు, మండల పరిషత్ చైర్మన్లు, మండల పరిషత్‌ల పాలక మండళ్లు ఏర్పడి ఇటీవలే నాలుగు సంవత్సరాలు ముగిసింది. దీంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నిబంధనలు అనుకూలించాయి. నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి అధికార వైసీపీకి అనుకూలంగా అధికార వైసీపీ జిల్లాలోని అన్ని స్థానిక సంస్థలను హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. గత ఏడాది వైసీపీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆ తరువాత స్థానిక సంస్థలపై టీడీపీ దృష్టి సారించింది. వైసీపీలోని పలువురు టీడీపీలో చేరడం ద్వారా ఇప్పటికే కొన్ని సంస్థలపై వైసీపీ పట్టు కోల్పోయింది. ఒంగోలు కార్పొరేషన్, గిద్దలూరు మున్సిపాలిటీలోని మేయరు, చైర్మన్‌ల అత్యధిక మంది సభ్యులు టీడీపీ, జనసేనలో చేరిపోయారు. కొన్ని మండలాల్లో ఎంపీపీలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరికొన్నిచోట్ల ఎంపీపీలు పార్టీ మారకపోయినా టీడీపీ ఎమ్మెల్యేలతో చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. కొన్ని నగర పంచాయతీల్లోనూ అలాంటి పరిస్థితి నెలకొంది.

మార్కాపురం, చీరాల మున్సిపాలిటీలపై దృష్టి

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాజకీయ ప్రాధాన్యత కలిగిన మార్కాపురం, చీరాల, మున్సిపాలిటీల్లో వైసీపీ చైర్మన్లే కొనసాగుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ ఇతర పాలనా వ్యవహారాల విషయంలో ఆ రెండు చోట్లా వైసీపీ ఎమ్మెల్యేలకు మున్సిపల్ కౌన్సిల్ నుంచి సమస్యలు ఎదురు అయ్యాయి. దీంతో రెండు మున్సిపాలిటీల చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం పెట్టి వారిని తొలగించాలనే నిర్ణయానికి ఎమ్మెల్యేలు వచ్చినట్లు తెలిసింది. తదనుగుణంగా వారు పావులు కదపడంతో రెండు మున్సిపాలిటీలకు చెందిన పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



మార్కాపురంలో అవిశ్వాసానికి వ్యూహం

మార్కాపురం మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులు ఉండగా గతంలో జరిగిన ఎన్నికల్లో 30 వార్డులు వైసీపీ గెలుపొందింది. కేవలం 5 వార్డులు టీడీపీ గెలుచుకుంది. ఒక వైసీపీ కౌన్సిలరు మృతి చెందడంతో కౌన్సిలర్ల సంఖ్య 34కు చేరింది. గెలుపొందిన ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు టీడీపీతోనే ఉండగా వైసీపీ కౌన్సిలర్లను 12 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి సైకిలెక్కారు. అందులో ఒకరిద్దరు ఎన్నికలకు ముందే టీడీపీకి చేరువ కాగా మిగిలినవారు ఇటీవల ఎమ్మెల్యే నారాయణ రెడ్డి సూచనలతో టీడీపీలో చేరారు. ప్రస్తుతం వైసీపీకి 17 మంది ఉండగా టీడీపీకి 17 మంది ఉన్నారు. ఎమ్మెల్యే నారాయణ రెడ్డికు ఉన్న ఓటు హక్కుతో టీడీపీ బలం 18కు చేరింది.

● ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో చైర్మన్ బాల మురళీక్రిష్ణపై ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. వైసీపీ కౌన్సిలర్లు కూడా చైర్మన్‌పై అసృంతృప్తితో ఉన్నవారు నారాయణ రెడ్డితో చేతులు కలిపారు. ఇంకా వైసీపీతో ఉన్న 17 మంది కౌన్సిలర్లలో నలుగురు అయిదుగురు వైసీపీలోనే ఉంటూ మురళీ క్రిష్ణను దించేందుకు సహకరిస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎమ్మెల్యే నారయణ రెడ్డి సిద్ధమైనట్లు సమాచారం. అయితే కొత్త చైర్మన్‌గా టీడీపీవైపున ఉన్నవారిలో ఎవరికి అవకాశం ఇవ్వాలన్న విషయమై ఎమ్మెల్యే తేల్చుకోలేక మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలిసింది.

చీరాలలో చైర్మన్ దించే ఎత్తుగడ

చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులు ఉండగా గత ఎన్నికలలో వైసీపీ పక్షాన 22 మంది, ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు ఆమంచి క్రిష్ణమోహన్ మద్దతుదారులు 11 మంది గెలుపొందారు. టీడీపీ పక్షాన ఒకేఒక్కరు గెలుపొందారు. ఎన్నికలకు ముందు ఆ తరువాత వైసీపీ నుంచి, ఆమంచి గ్రూప్ నుంచి 13 మంది ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 14కు చేరింది. మరో 14 మంది వైసీపీ పక్షాన ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి మద్దతుదారులు ఐదుగురు ఉన్నారు. టీడీపీకి ఎమ్మెల్యే, ఎంపీ ఓటు కూడా ఉన్నప్పటికీ ఆమంచి మద్దతుదారుల సహాయం తీసుకునే విషయం కీలకంగా కనబడుతోంది. అయితే ఇటీవల అవిశ్వాస తీర్మానం ద్వారా వైసీపీని తొలగించేందుకు సిద్ధమైతే తాము మద్దతు ఇస్తామని మరికొందరు కౌన్సిలర్లు ఎమ్మెల్యే కొండయ్యకు సంకేతం పంపినట్లు తెలిసింది. ఆమంచి వర్గీయులు కూడా వైసీపీ చైర్మన్‌ను దింపేందుకు తాము సహకరిస్తామనే సంకేతాన్ని ఎమ్మెల్యే కొండయ్యకు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుత చైర్మన్ శ్రీనివాసరావు కూడా తనను కొనసాగిస్తే తానే టీడీపీ తీర్థం పుచ్చుకుంటానని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. నిజానికి చైర్మన్ శ్రీనివాసరావు 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాత కూడా టీడీపీలోనే ఉంటూ బలరాంతో పాటు వైసీపీలో చేరారు. అక్కడ అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం కాగా చైర్మన్ శ్రీనివాసరావును పార్టీలో చేర్చుకుని కొనసాగించాలా లేక కొత్తవారికి అవకాశం ఇవ్వాలా అనే సందిగ్ధంలో ఎమ్మెల్యే కొండయ్య ఉన్నట్లు సమాచారం. రానున్న వారం పది రోజుల్లో ఈ రెండు మున్సిపాలిటీల అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. దీంతో మిగిలిన పలుచోట్ల అవిశ్వాస తీర్మానాల వ్యవహారం ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ సోమవారం ప్రారంభమైంది. ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించి పాఠశాలల్లోని విద్యార్థులను పై తరగతుల్లోకి ప్రమోట్ చేయాలని పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు వందశాతం పై తరగతులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేసి వారిని ఆయా తరగతుల్లో కూర్చోబెట్టే బాధ్యతలను సంబంధిత క్లాస్ టీచర్లకు అప్పగించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులను అందుబాటులోని ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో చేర్పించాలి. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు కూడా 1వ తరగతిలో ప్రవేశం కల్పించాలి. ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులను పైతరగతులకు ప్రమోట్ చేయాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులను కూడా ప్రమోట్ చేసి తరగతి గదుల్లో కూర్చబెట్టాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పేస్‌లో ఈ-వ్యర్థాలపై అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగా హన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి ఎలక్ట్రానిక్ వ్యర్థాల గుర్తింపు, వాటిని ఎలా నిర్వీర్యం చేయాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, డీన్‌లు వీరాంజనేయులు, సుబ్బారావు ఉన్నారు.

ఒంగోలులో పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ పూర్తి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్‌మండల పరిధిలో పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ పూర్తయింది. 117 జీవో రద్దు అనంతరం పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు ఒంగోలు మండల విద్యాధికారి టి.కిషోర్‌బాబు తెలిపారు. ఒంగోలు నగరం, రూరల్ మండలాల్లో 19 మోడల్ ప్రైమరీ స్కూళ్లు, 30 బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, ఫౌండేషన్ పాఠశాలలు రెండు, హైస్కూళ్లు 13 ఏర్పాటు చేశారు. ఒంగోలు రూరల్ మండలంలోని నాలుగు యూపీ స్కూళ్లలో రెండు యరజర్ల, వెంగముక్కలపాలెం యూపీ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ కాగా సర్వేరెడ్డిపాలెం, పెళ్లూరు యూపీ స్కూళ్లు ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ అయ్యాయి.

హైస్కూళ్లలో 3,4,5 తరగతులు ప్రాథమిక పాఠశాలలకు పంపిస్తే ఆ పాఠశాల మోడల్ ప్రాథమిక పాఠశాలగా మారితే సరి. అలా కాకుండా మోడల్ ప్రైమరీ స్కూలుకు తగినంత మంది విద్యార్థులు లేకపోతే హైస్కూళ్లలోనే 3,4,5 తరగతులను కొనసాగిస్తూ 1,2 తరగతులకు కూడా అదనంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు చేపడతారు. ఈ విధంగా ఒంగోలు మండలం త్రోవగుంట, ఉలిచి జడ్పీ హైస్కూళ్లలో 1 నుంచి 10 తరగతులు కొనసాగిస్తున్నారు. గుండాయపాలెం, ఒంగోలులోని బాలాజీనగర్ హైస్కూళ్ల నుంచి ప్రాథమిక తరగతులను వేరుచేసి మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు కిషోర్‌కుమార్ తెలిపారు.

అవీ..ఇవీ


స్థానికులకు మందులు పంపిణీ చేస్తున్న మేయర్ సుజాత

రిమ్స్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 18వ డివిజన్‌లో రిమ్స్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. మెడికల్ కాలేజీ విద్యార్థులు వెంకగముక్కలపాలెంను దత్తత తీసుకుని ఏటా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం అయిన మందులు అందజేయడం అభినందనీయం అన్నారు. జీజీహెచ్‌లో ఆధునిక వైద్య పరికరాలు, గుండె పరీక్షల కోసం క్యాథ్ లాబ్, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, నిపుణులైన వైద్యులు ఉన్నారని, అత్యవసర వైద్యం కోసం జీజీహెచ్‌లో వైద్య సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పర్యవేక్షించగా, హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, రిమ్స్, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వమేధావి అంబేడ్కర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికే కాదని విశ్వానికే మార్గదర్శిగా, దిక్సూచిగా ఉన్నారని పలువురు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో జాతీయ ఎస్సీ మోర్చా కార్యదర్శి ఎస్.కుమార్ , రాష్ట్ర అధ్యక్షుడు జి. దేవానంద్ , మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్, ఎస్సీ మోర్చా నాయకుడు మోజీ, పి. లక్ష్మణ్, డి. శివాజీ, పిచ్చయ్య, అమరసింహం, ఆర్. అజయ్, నాగేశ్వరరావు, వీరభద్రాచారి, బలకోటయ్య, విజయలక్ష్మి, పొద అపర్ణ, రమాదేవి, ఆశారావు తదితరులు ఉన్నారు.

'ఉల్లాస్'తో అక్షరాస్యతను పెంచాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను అక్షరాస్యులుగా చేసేందుకు చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం ఉల్లాస్ జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 39,763 మంది డ్వాక్రా సభ్యులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం

కొండపి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకోవడం వలన గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని కొండపి సెక్టార్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. సోమవారం వెన్నూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె చిన్నారుల బరువు, ఎత్తు, ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార, వైద్యానికి సంబంధించిన సలహాలు అందించారు.

ప్రకృతి సాగుతో పండించిన కూరగాయల అమ్మకం

కొండపి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకు కూరలను సిబ్బంది సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద విక్రయించారు. ఈ సందర్భంగా వారు కొనుగోలుదారులతో మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

పొన్నలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావులకొల్లు గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.21,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు. ముగ్గురినీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి బి. పద్మ, జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. మోహన్, ఎస్. భారతి, వై. జానకి, మంజుల, పద్మ, సీతారామమ్మ, సుబ్బులమ్మ, శ్రావణి, కొంగర నరసింహం, చంద్రశేఖర్, జాలయ్య, తిరుమలరావు, నారాయణ ఉన్నారు.

దళితుడి భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం చెర్వుకొమ్ముపాలెంలో దళితుడి భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్‌చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ భూఆక్రమణలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై ఎస్సీఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చావలి సుధాకర్, ధరణికోట లక్ష్మీనారాయణ, పేరం సత్యం, అజీజ్, దాసరి సుందరం, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):స్థానిక హెడ్ పోస్టాఫీసు దగ్గర ఉన్న మహిళా, పిల్లల గ్రంథాలయంలో గురువారం డీఆర్ఎంఎం పాఠశాల విద్యార్థులు 30 మందికి విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య సభ్యత్వాన్ని ఇప్పించారు. గ్రంథపాలకురాలు టి.గోవిందమ్మ, హెచ్ఎం వెంకటేశ్వరు పాల్గొన్నారు

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం


మీకోసంలో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మీకోసం కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చినప్రజలు పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీలకు అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడు స్పష్టం చేయాలన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, వరకుమార్, డిప్యూటీ కలెక్టర్లు పార్థసారథి తదితరులు ఉన్నారు. కాగా ఎండ తీవ్రతతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. మీకోసం వద్ద టెంట్లు వేసినా ఉక్కపోతతో చెమటలు కారుకుంటూ క్యూలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సర్వేరెడ్డిపాలెం పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలి

ఒంగోలు(రూరల్): సర్వేరెడ్డిపాలెం గ్రామపంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని ఆ గ్రామస్థులు సోమవారం కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు గ్రీవెన్స్‌లో అర్జీ సమర్పించారు. ఈసందర్భంగా గ్రామ నాయకుడు పుచ్చకాయల సుబ్బారావు మాట్లాడుతూ 2013 లో సర్వేరెడ్డిపాలెంను ఒంగోలు మునిసిపాలిటీలో విలీనం చేశారని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామని అన్నారు. న్యాయ స్థానం గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిపించాలని తీర్పుకూడా ఇచ్చిందన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఎన్నికలు నిర్వహించలేదని, ఫలితంగా అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. వెంటనే కలెక్టర్ ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఆర్థిక మోసాలపై మీకోసంలో ఎస్పీకి ఫిర్యాదు

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలు.. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నగదు తీసుకోవడం, చిట్‌ఫండ్స్ పేరుతో దోపిడీ వంటి వాటి వల్ల తాము ఆర్థికంగా నష్టపోయామని పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 73 మంది తమ సమస్యలపై వినతులు అందజేశారు. వీటిలో ఎక్కువ భాగం ఆర్థిక మోసాలకు సంబంధించినవి కావడం గమనార్హం.

- ఒంగోలులో ఓ చిట్‌ఫండ్ కంపెనీలో తాను నెలకు రూ. 10 వేలు చొప్పున ఆన్‌లైన్ ద్వారా 48 నెలల పాటు చెల్లించానని, తరువాత తన నగదును చిట్‌ఫండ్ కంపెనీ ఇవ్వడం లేదని బేస్తవారిపేటకు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశాడు.
- ఉద్యోగం పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డరు ఇప్పించి రూ. 3.60 లక్షల నగదును విజయవాడకు చెందిన ఓ వ్యక్తి తీసుకున్నాడు. అయితే తాను ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు గురిచేస్తున్నాడని చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం నకు చెందిన నిరుద్యోగి ఫిర్యాదు చేశాడు.
- తమ వద్ద ఉన్న గొర్రెలు, గొర్రెపిల్లలను రూ. 4.50 లక్షలకు నెల్లూరు జిల్లా బోగోలు బిట్రగుంటకు చెందిన వ్యక్తి తీసుకొని నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని ఒంగోలు రూరల్ మండలం దేవరంపాడుకు చెందిన వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

నగరంలో శుద్ధి జలం సరఫరాకు చర్యలు

- కమిషనర్ వెంకటేశ్వరరావు


కొళాయి ద్వారా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు శుద్ధి చేసిన మంచినీరు అందించేందుకు కార్పొరేషన్ చర్యలు తీసుకుంటుందని కమిషనర్ డాక్టర్ కే. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం 37వ డివిజన్‌లోని పలు గృహాలకు వెళ్లిన కమిషనర్ నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఇటీవల కాలంలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, అలాగే కలుషిత నీరు సరఫరా జరుగుతుందని ఫిర్యాదులు రావడంతో కమిషనర్ నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. ముందుగాపలు ఫిల్టర్ బెడ్‌లను తనిఖీ చేసిన కమిషనర్ అక్కడ మోటార్ల పనితీరును పరిశీలించారు. పదే పదే మరమ్మతులకు గురవుతున్న మోటార్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయించారు. అనంతరం 37వ డివిజన్‌లో పర్యటించిన కమిషనరు ఇంటి యజమానులతో మాట్లాడారు. నీటి సరఫరా వేళలను తెలుసుకున్నారు. శుద్ధమైన నీరు విడుదలపై నేరుగా తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగర ప్రజలకు నాణ్యమైన శుద్ధి నీరు అందించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రతి రోజూ నీటి పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ఎక్కడా లీకులు లేకుండా చూడాలని, అలాగే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ చంద్రయ్య, డీఈ అనిల్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కే. నరసింహారావు, పలువురు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

సూర్యనారాయణ ఉద్యోగ విరమణ సభలో హరిబాబు


సూర్యనారాయణ, ప్రమీల దంపతులను సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ హరిబాబు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు అన్నారు. వినోదరాయునిపాలెం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండ్లాపల్లి సూర్యనారాయణ (సూరి) ఉద్యోగ విరమణ సభ సోమవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేసిన సూర్యనారాయణ రావు చక్కని విద్యాబోధన అందించి ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. తన సర్వీసు 39 సంవత్సరాల కాలంలో అనేక సైన్స్ ప్రాజెక్టులను నిర్వహించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ సూర్యనారాయణ టంగుటూరి ప్రకాశం పంతులు జన్మించిన వినోదరాయునిపాలెం గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఉద్యోగికి పదవీ విరమణ సహజం అని, కానీ సూర్యనారాయణ వంటి ఉపాధ్యాయుడు సర్వీసు నుంచి రిటైర్ అయినా స్కూలు విద్యార్థులకు, అభివృద్ధికి తన సేవలు అందించాలని సూచించారు. అనంతరం సూర్యనారాయణరావు, ప్రమీల దంపతులను హరిబాబు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం, లింగంగుంట, నాగులుప్పలపాడు, బినిడమానూరు, అమ్మనబ్రోలు తదితర పాఠశాలల్లో పని చేసున్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని సూర్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. సూర్యనారాయణపై అభిమానంతో సొంత గ్రామమైన పాత చీర్వానుప్పలపాడు, ఆయన పనిచేస్తున్న వినోదరాయునిపాలెం నుంచి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మాజీ రీజనల్ మేనేజర్ గుండ్లాపల్లి రాజేంద్రప్రసాద్, సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ కిరణ్, సూర్యనారాయణ బంధువులతో పాటు ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ రమణయ్య, గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రౌడీషీటర్ల హల్‌చల్

- రాత్రి వేళల్లో మద్యం సేవించి ఘర్షణలు

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం సేవించి యువకులు ఘర్షణలకు దిగడం, అర్ధరాత్రులు గంజాయి తాగి హల్‌చల్ చేయడం పరిపాటిగా మారింది. ఆకతాయిలలో రౌడీషీటర్లు , పాతనేరస్థులు ఉండటం గమనార్హం. ఆదివారం రాత్రి నగరంలో రెండు ముఠాల మధ్య ఘర్షణలు జరిగాయి. ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. గొడవకు కారణం రౌడీషీటర్ అని చెబుతున్నారు.

పాతమార్కెట్ సెంటర్ పద్మాలయ బేకరీ వద్ద రాత్రి 11.30 తరువాత గోపాల్ నగరం ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న రౌడీషీటర్ అద్దేటి గోపి మరో ఎనిమిది మంది యువకులు మద్యం సేవించి ఉన్నారు. అటు వైపుగా కబాడీపాలెంలో నివాసం ఉండే ముగ్గురు యువకులు మోటార్ సైకిల్ పై వెళుతూ కామెంట్ చేశారని రౌడీషీటర్ ముఠా వారి వెంట పడింది. కొత్తపట్నం బస్టాండ్ శివాలయం వద్దకు వెళ్లే సరికి మోటార్ సైకిల్‌పై వెళుతున్న ప్రేమ్‌చంద్,చైతన్య, నరేష్‌లను ఆపి రౌడీషీటర్ గోపి ముఠా దాడిచేసింది. దీంతో వారికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. అనంతరం వారు కబాడీపాలెంలోకి వెళ్లి పదిమంది యువకులను తీసుకొని పాతమార్కెట్ వద్దకు వెళ్లారు. వీరిని చూసి అక్కడ టీ తాగుతున్న గోపి, స్నేహితులు పరారయ్యారు. వారిలో రాకేష్ అనే యువకుడని కబాడీపాలెం తీసుకొచ్చి కొట్టారు. ఇలా రెండు ముఠాలుగా ఏర్పడి రాత్రి అంతా స్ట్రీట్ ఫైట్ చేశారు. రాకేష్ రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశాడు. అదే విధంగా కబాడీపాలెం నకు చెందిన ప్రేమ్‌చంద్, చైతన్యలకు స్వల్పంగా గాయాలు కాగా వారూ రిమ్స్ నుంచి ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఇరువర్గాలను పిలిచి విచారించి కేసు నమోదు చేశారు.

టీచర్ల హేతుబద్ధీకరణ సక్రమంగా నిర్వహించాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణను పారదర్శకంగా అన్ని ప్రాథమిక పాఠశాలలకు ఒకే విధంగా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ప్రకారం కేటాయించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. జనార్దన్‌రెడ్డి, డి. శ్రీనివాసులు ఒ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియాలను కొనసాగించాలని కోరారు.

రెండు ఆలయాల్లో చోరీ

- హుండీలు పగులకొట్టి నగదు అపహరణ
- దొంగ ఆచూకీ లభ్యం

చీమకుర్తి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి నాయుడుపాలెం గ్రామంలోని శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో హుండీలు చోరీకి గురయ్యాయి. సోమవారం గుడిలోకి వెళ్లిన అర్చకులు హుండీలు చోరీ అయిన విషయాన్ని గుర్తించి గ్రామస్థులకు తెలియజేశారు.విషయం తెలుసుకున్న సీఐ సుబ్బారావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది.హుండీని ఎత్తుకెళ్లిన ఆగంతుకుడు దానిలోని డబ్బులు తీసుకొని ఖాళీ అయిన రెండు హుండీలను పొలాల్లో విసిరివేసి వెళ్లిపోయాడు. గత రెండేళ్లనుంచి హుండీలో డబ్బులు బయటకు తీయకపోవటంతో ఎక్కువ మొత్తంలోనే నగదు హుండీలో ఉంటాయని భావిస్తున్నారు.

కాగా చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.గుంటూరు జిల్లాకు చెందిన శివారెడ్డి అనే పాత నేరస్థుడు బద్వేల్ వెళ్తూ మార్గమధ్యమంలో చోరీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో సాంకేతిక నైపుణ్యంతో గుర్తించారు.పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని దర్యాప్తు పూర్తి అయితే నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ వివరాలు తెలియచేస్తామని సీఐ సుబ్బారావు తెలిపారు.


హజ్ యాత్రికులకు బ్యాగులు అందజేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత తదితరులు

హజ్ యాత్ర విజయవంతం కావాలి

- ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట
- యాత్రికులకు వ్యాక్సినేషన్

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ (మక్కా) యాత్ర విజయవతంగా జరగాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని 44 మంది ముస్లింలు మక్కా యాత్రకు వెళుతున్న సందర్భంగా వాక్సినేషన్ కార్యక్రమం సోమవారం మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని షాదీఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్లలు మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. అలాగే మక్కా మసీదు సందర్శన, యాత్ర ముస్లింలకు ఒక గొప్ప అవకాశం అన్నారు. అలాంటి యాత్ర మరింత విజయంతంగా జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంత నిధులతో మక్కా వెళ్లేవారికి ప్రయాణ బ్యాగ్‌లు, ఆరోగ్య అవసరాలకు అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు కపిల్ బాషా, పఠాన్ హనీఫ్ ఖాన్, షేక్ అమ్మల్లా, షేక్ అజీమున్, ఆబిద్ మౌలానా, షేక్ రషీద్, అజీస్, పఠాన్ నాయబ్, షేక్ ఆరీఫా, రసూల్ పలువురు పాల్గొన్నారు.

డైట్ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

ఒంగోలు(విద్య)ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్‌లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ అన్ని విద్యార్హతల సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కిరణ్‌కుమార్‌కోరారు.

ఇద్దరు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ఒంగోలు(రూరల్),ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): స్థానిక రైజ్‌కృష్ణ కళాశాలల నుంచి ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు సోమవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఒక్కోవిద్యార్థికి ఏడాదికి రూ. 4లక్షల వేతనం లభించనున్నది. ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల సెక్రటరి శిద్దా హనుమంతరావు, కళాశాల గౌరవ ఛైర్మన్ ఇస్కాల రంగనాథ్, ట్రెజరర్ శిద్దా భరత్ తదితరులు అభినందించారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ రమణయ్య కోరారు. మండల పరిధిలోని మద్దిరాలపాడు ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో గుండ్లాపల్లి విద్యార్థి ప్రతిభ

మద్దిపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 సంవత్సరంలో 10వ తరగతి చదివి పాఠశాలలో అత్యధికంగా 565 మార్కులు సాధించిన సన్నపురెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 104వ ర్యాంకు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హర్షవర్ధన్ రెడ్డిని అభినందించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లు పంపిణీ

మద్దిపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ఉపాధి హామీ కూలీల కోసం మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్ బాబు మెడికల్ కిట్‌లు, షేడ్‌లు పంపిణీ చేశారు. మందులను స్థానిక పీహెచ్‌సీ పంపిణీ చేయగా వారికి కిట్లు, షేడ్‌లను తన సొంత నిధులతో పంపిణీ చేయడం పట్ల ఎంపీడీవో వరప్రసాద్ జయంత్ బాబును అభినందించారు.

తిరుపతికి సైకిల్‌పై టీడీపీ అభిమాని

సంతనూతలపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయదుందుభి మోగించిన అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున రుద్రవరం గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని మానంశ్రీను సోమవారం తిరుపతికి సైకిల్ యాత్రను ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ కూకట్లశరత్‌బాబు ఈ యాత్రను ప్రారంభించారు.

అర్హతల్లో కనీస మార్కుల శాతం తొలగించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్సీఎస్టీ అభ్యర్థుల అర్హతల్లో కనీస మార్కుల శాతం తొలగించి పరీక్షలకు 90 రోజుల సమయం ఇవ్వాలని జై జనం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ కోరారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ సిలబస్‌ను తగ్గించాలని కోరారు. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న డీఎస్సీ కావడంతో వయో పరిమితిని 44 ఏళ్లనుంచి 47 ఏళ్లకు పెంచాలని ఆయన కోరారు.

ఒంగోలు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజిబాబు

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కల్లూరి అంజిబాబు ఏకగ్రీవంగా ఎంపిక అయ్యాడు. అయితే ప్రధాన కార్యదర్శి , కోశాధికారి పదవుల కోసం పోటీ జరిగింది. అందుకు సంబంధించి సోమవారం స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా కొమ్మూరి ప్రసాద్, అళహరి రాము పోటీ చేయగా కొమ్మూరి ప్రసాద్ గెలుపొందారు. అదేవిధంగా కోశాధికారిగా వేమూరి శ్రీనివాసులు, ఎస్‌కె యాసిన్ పోటీ పడగా వేమూరి శ్రీనివాసులు గెలుపొందారు. సభ్యులుగా పలువురిని ఎంపిక చేశారు.

అవీ.. ఇవీ

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

● విద్యార్థుల మృతదేహాలకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నివాళి



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని పెద్దఓబినేనిపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు ఇద్దరు విద్యార్థులు గోచిపాతుల ఆకాశ్, పులిగుజ్జు సన్నిలు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం పెద్ద ఓబినేనిపల్లె గ్రామానికి అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లారు. మృతులకు నివాళులు అర్పించారు. అనంతరం మృతుల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేయడం అమానుషం

● గిద్దలూరులో విధులను బహిష్కరించిన న్యాయవాదులు



విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల హక్కుల కోసం న్యాయవాదులు కేసులు వేస్తుంటే వారిపైన దాడి చేయడం అమానుషమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శేషశైనారెడ్డి(బాబు) అన్నారు. సోమవారం గిద్దలూరు న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శేషశైనారెడ్డి మాట్లాడుతూ గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న దోన్వాన్ కృష్ణ అనే న్యాయవాదిని గిద్దలూరుకు చెందిన గుర్రాల సుధాకర్ అనే వ్యక్తి భరణం కేసులో తన తరఫున నియమించుకున్నాడు. 17వ తేదీ గురువారం గిద్దలూరు కోర్టులో పనిచేసుకుని బయటకు వెళుతుండగా గుర్రాల వసంతకుమార్, జోసఫ్ ప్రభాకర్, జయమ్మ, శ్యామ్‌కుమార్, మరో ముగ్గురు వ్యక్తులు అటకాయించి లాయర్ కృష్ణపై దాడి చేశారు. లాయర్ కృష్ణ వారి నుంచి తప్పించుకుని కోర్టులోకి పరుగెత్తుకుంటూ వెళ్లాడు. ఈవిషయం బార్ అసోసియేషన్‌కు తెలియడంతో గిద్దలూరు పోలీసుస్టేషన్‌లో ఆమేరకు ఫిర్యాదు చేసినట్లు శేషశైనారెడ్డి తెలిపారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను పటిష్ఠంగా అమలు చేసినప్పుడే న్యాయవాదులకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై దాడి జరిగితే స్థానిక సీఐ కనీసం ఎఫ్ఐఆర్ చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఉస్మాన్‌షరీఫ్, జాయింట్ సెక్రటరీ చల్లగాలి పోలయ్య, సీనియర్ న్యాయవాదులు తురగ అంజనీకుమార్, మొగల్ హజరాంబీ, ఎస్.వి.చలపతిరావు, ఆనంద్, కటారు పోలిరెడ్డి, ముత్తుముల రంగారెడ్డి, తిరుమల ప్రసాద్, గిరి, బొడ్డు ప్రకాశ్, దూదేకుల సిద్ధయ్య ఉన్నారు.

టైర్ల షోరూంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదం చోటుచేసుకున్న భవనం

మార్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళాశాల రోడ్డులోని ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూంలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూమ్ కింద అండర్‌గ్రౌండ్‌లో ఉదయం 11.00 గంటల ప్రాంతంలో పొగలు వచ్చాయి. దీంతో ఆ భవనంలో ఉన్న ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూమ్, యాక్సిస్ బ్యాంక్, హాస్టల్‌లోంచి బయటకు పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆ భవనంలోని అండర్‌గ్రౌండ్‌లో ఉన్న జనరేటర్, పలు బైకులు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాక ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూంలో కూడా కొన్ని టైర్లు పాక్షికంగా కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు చెబుతున్నారు. విద్యుత్ వైర్లలో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్ వలనే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపకశాఖ సిబ్బంది తెలిపారు. సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



కంభంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కంభం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహరించు కోవాలని కోరుతూ సోమవారం కంభం మండల ముస్లింలు శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ ఆరిఫ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా చీకటి బిల్లును (వక్ఫ్ సవరణ- 2024) చట్టాన్ని పార్లమెంటు సాక్షిగా ఆమోదించడాన్ని నిరసిస్తూ తాము శాంతి ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఈ ర్యాలీ కంభం జామియా మసీదు నుంచి మెయిన్ బజారు, ప్రభుత్వ కళాశాల మీదుగా కందులాపురం కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ముఫ్తీయాసిన్, సయ్యద్ జాకీర్, సీపీఐ నాయకులు అన్వర్, పలు ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు. కంభం సీఐ మల్లికార్జున్, ఎస్సైలు నరసింహారావు, సుదర్శన్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎర్రగొండపాలెంలో శాంతి ర్యాలీ

ఎర్రగొండపాలెం : వక్ఫ్ సవరణ చట్టం బిల్లును కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎర్రగొండపాలెంలో ముస్లింల ఆధ్వర్యంలో సోమవారం పెద్దలు, యువకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. జామియా మసీదు మౌలానా హిదయతుల్లా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ చట్టాని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ శాంతి ర్యాలీలో జమాతే ఇస్లామీ హింద్, జమాతే ఉలేమా హింద్, ఎస్ఐఓ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ప్రధాన కూడళ్లలోని నూరాని మసీదు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగికి ముస్లిం పెద్దలు వినతిపత్రం అందజేశారు.

పొట్టి శ్రీరాములకు భారతరత్న ఇవ్వాలి

గిద్దలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని బిజెపి జిల్లాశాఖ ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలుగు వారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఉంటే బాగుంటుందన్న భావనతో 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను తెజించిన పొట్టిశ్రీరాములుకు అమరావతిలో కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, ప్రతినెలా ఒక జిల్లాలో జయంతి ఉత్సవాలను చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించడం హర్షదాయకమన్నారు. పొట్టిశ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇచ్చేందుకు వీలుగా కేంద్రానికి సిఫారసు చేయాలని, ఇందుకోసం ఆర్యవైశ్యులు రాజకీయ పార్టీలకు అతీతంగా చొరవ తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

● 153 మందికి విధుల్లో 92 మంది ● పన్నుల వసూలులో నగర పంచాయతీ ● సేవల్లో మాత్రం మేజర్ పంచాయతీనే..



పొదిలి నగర పంచాయతీ కార్యాలయం

పొదిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పొదిలి నగర పంచాయతీ పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సుమారుగా 153 మంది ఉండాల్సి ఉండగా, కేవలం 92 మంది సిబ్బందితోనే నగరపంచాయతీని నెట్టుకొస్తున్నారు. దీంతో పారిశుధ్య కార్యక్రమాలు నత్తనడకన సాగుతున్నాయి.

ఒక వీధిలో మురుగుకాలువల శుభ్రతకు సుమారు 10 రోజులకు పైగా సమయం పడుతోంది. ఉన్న సిబ్బందితో ప్రతిరోజు ప్రధాన వీధులు మినహా ఏ వీధులు శుభ్రం చేయలేకపోతున్నారు. ఈ క్రమంలో స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి గత అసెంబ్లీలో సైతం సిబ్బంది కొరతపై మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా సిబ్బంది కూడా పెరగాల్సి ఉన్నా పెంచకపోవడంతో పారిశుధ్య పనులు కుంటుపడుతున్నాయి. ఉన్న సిబ్బందితో పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందించడం కష్టతరంగా మారింది.

ప్రస్తుత జనాభా ప్రాతిపదికన కార్యాలయంలో ఒక మేనేజర్ ఉండాలి కాని లేరు. అకౌంట్ సెక్షన్‌లో ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉండగా, చీరాల నుంచి డిప్టేషన్‌పై వారానికి రెండురోజులు వచ్చే విధంగా ఒకరిని నియమించారు. పారిశుధ్య విభాగంలో సుమారుగా 100మంది ఉండాల్సి ఉండగా, 70 మంది మాత్రమే ఉన్నారు. 70 మందిలోనే ట్రాక్టర్ డ్రైవర్, అటెండర్, మేస్త్రీలను వినియోగిస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం బిల్డింగ్ ప్లానింగ్ అధికారులు అసలే లేరు. వీరితో పాటు సచివాలయ ప్లానింగ్ అధికారి కూడా ఉండాల్సి ఉన్నా, ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఈ స్థానంలో ఒంగోలు ఉడా కార్యాలయం నుండి ఒకరిని డిప్యూటేషన్‌పై నియమించారు. అదేవిధంగా నీటిసరఫరాకు సంబంధించి 12 మంది ఉండాల్సి ఉండగా, కేవలం 8 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో నలుగురు అధికారులు ఉండాలి. కాని ఒక్కరు మాత్రమే ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్‌లు ఆరుగురుకి ముగ్గురు మాత్రమే ఉన్నారు. అటెండర్స్ నలుగురికి ఒకరు కూడా లేకపోవడం విశేషం.

ఇక పన్నుల వసూళ్ల మాత్రం నగర పంచాయతీ స్థాయిలోనే జరుగుతున్నాయి. నిధులు, సిబ్బంది, అభివృద్ధి పనులకు సంబంధించి మేజర్ పంచాయతీ స్థాయిలో ఉండడం గమనార్హం. ఈ లెక్కన పొదిలి పంచాయతీ అభివృద్ధికి ఆస్కారమే లేదనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పొదిలి నగరపంచాయతీలో మొత్తం 20వార్డులు ఉన్నాయి. ఎక్కడో ఒకటి, రెండు వార్డుల్లో మాత్రమే చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల ఏ రోజుకు ఆరోజు చెత్త తీసుకెళ్లాలి. అందుకు సరిపడా సిబ్బంది సిబ్బంది లేకపోవడంతో మూడురోజులకు ఒకసారి పారిశుధ్య సిబ్బంది వస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. అదేవిధంగా మురుగు కాలువల వారానికి ఒకసారి కూడా పూడికతీయకపోవడంతో కాలువలు నిండి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేసేందుకు సుమారుగా పదిరోజుల పైన పడుతోంది. అత్యవసరమైతే అధికారులకు ఫిర్యాదు చేస్తే కొంతమందిని పంపి పనులు చేయిస్తారు. పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడం అదేవిధంగా ఎక్కువ మందిని నియమించుకోవడానికి నిధుల లభ్యత లేకపోవడంతో అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. ఆవిధంగా పట్టణంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. నీటిసమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటినితోలి చేతులు దులుపుకుంటున్నారు.

రెండుకోట్లతో ప్రతిపాదనలు పంపాం

రోడ్లు, తాగునీటి పైపులైన్లు కోసం రెండు కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో నిధులు సమకూరుస్తామని జిల్లా అధికారులు చెప్పారు. కనుక రూ.2 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నగర పంచాయతీలో అవసరమైన పనులు చేయిస్తాం.

కమిషనర్ శ్రీనివాసరావు

బొప్పాయి రైతులను ఆదుకునే చర్యలు తీసుకోండి



బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే మండలంలోని వెల్లుపల్లె గ్రామానికి వెళ్లి నేలమట్టమైన బొప్పాయి పంటను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు గ్రామంలో కొర్రా రామయ్య 2 ఎకరాల బొప్పాయి సాగు చేశాడు. అకాల ఈదురు గాలులకు బొప్పాయి పంట నేలమట్టమై సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పంటను పరిశీలించి రైతుకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. నష్టపరిహారం అదేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులు నష్టపోయిన బొప్పాయి పంట వివరాలను సేకరించి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, ఉద్యానవన శాఖా ధికారిణి విష్ణుప్రియ, వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో రమణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, దుత్తా బాలీశ్వరయ్య, బద్రి గోపాల్‌రెడ్డి, కంకర వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొర్రా నాగయ్య, అల్లం రంగస్వామి, రామయ్య, తిరుపతయ్య, సుగాలి వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కొమరోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని హెచ్ఎం గర్రె చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని రాజుపాలెం, ద్వారకచర్ల, వెంకటాపురం గ్రామాల్లో బడిబాట కార్యాక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన విద్యను అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధిస్తున్నట్లు తెలిపారు. మీ పిల్లలకు చదువుచెప్పకపోతే ఉపాధ్యాయులను ప్రశ్నించండి అని గ్రామస్థులతో కలసి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 'అందరికీ విద్య' అనే నినాదంతో చదువుమానేసిన పిల్లలను గుర్తించి దగ్గరలోని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీగలేరును చిన్న కండ్లేరుతో అనుసంధానించాలి

● ఏపీ రైతు సంఘం నాయకుల డిమాండ్
● సీఎంకు పోస్టు కార్డు పంపిన రైతులు



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరు-5ను పుల్లలచెరువు చిన్నకండ్లేరుకు కాలువ ద్వారా అనుసంధానం చేయాలని మాజీ ఎంపీపీ మోర్తాల సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పుల్లలచెరువు మండలంలోని ఆర్.ఉమ్మడివరంలో ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాలు సేకరించారు. పోస్టుకార్డులపై వెలిగొండ పూర్తి చేయాలని రాసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో శాశ్వతంగా కరువు నివారించాలంటే పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోనే వెనుకబడిన పుల్లలచెరువు మండలంలో కనీసం తాగునీటి కోసం 1000 అడుగులు బోర్లు తవ్వించిన నీరుపడడం లేదన్నారు. శాశ్వతంగా కరువు పోవాలంటే వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు-5 కాలువను పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు రిజర్వాయరు వరకు పొడిగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియరు నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ మండల కార్యదర్శి జీవీ.గురునాథం, వైసీపీ నాయకులు జానకీ రఘు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాల అందజేత



రైతుకు గొర్రు అందజేస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

పొదిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రీకరణపై పెద్దపీట వేస్తుంది. రైతులకు అవసరమైన పనిముట్లను అందించడంలో ముందుంటుందని దర్శి ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని వ్యవసాయ యాంత్రీకరణ క్రింద రోటోవేటర్స్ 3, తొమ్మిది చెక్కల గొర్రులు 23, తైవాన్‌స్ప్రేయర్లు 13, ట్రాక్టర్ మౌంటెండ్ స్ప్రేయర్లు 5 పరికరాలు 37 మంది రైతులకు సోమవారం ఏడీఏ బాలాజీనాయక్ అందజేశారు. రైతులకు కావలసిన పరికరాలు అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉందన్నారు. రైతులు అందరు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ జైన్‌లాబ్దీన్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అక్రమంగా మూసివేసిన

కూరగాయల దుకాణాలను తెరిపించాలి

సబ్‌కలెక్టర్‌కు వామపక్ష నేతల వినతి



వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నేతలు

మార్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేలంపాటలు నిర్వహించి కూరగాయల ధరలు పెంచుతూ అక్రమంగా మూసివేసిన దుకాణాలను వెంటనే తెరిపించాలని వామపక్షాల నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల పేరుతో వేలంపాటలు నిర్వహించి అన్ని దుకాణాలను మూసి వేస్తున్నారన్నారు. వేలంపాటను దక్కించుకున్న కొన్ని దుకాణాలను తెరచి అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారన్నారు. దీంతో పట్టణ ప్రజలపై వ్యాపారులు అధిక భారం మోపుతున్నారని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.సోమయ్య, డీకేఎం రఫీ, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే కాశీం, పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి). పట్టణంలోని సర్వజన వైద్యశాలలో అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ అశోక్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ బుజ్జి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలలో సాధారణంగా ఉండాల్సిన బరువు, ఎత్తు కంటే తక్కువ ఉన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికను తయారు చేస్తోందన్నారు. 22 మంది చిన్నారులకు ఈ వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది కె.రవికుమారి, కే.రమాదేవి, పి.అరుణకుమారి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వన్యప్రాణి చట్టాలపై మెకానిక్‌లకు అవగాహన

వన్యప్రాణుల వేటకు ఉపయోగించే క్లచ్‌లను అమ్మరాదు : రేంజర్



బైక్ మెకానిక్‌లతో మాట్లాడుతున్న రేంజర్

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో ఉండే వన్యప్రాణుల సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వన్యపాణుల చట్టలపై అవగాహన కలిగి ఉండాలని ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి ఫారెస్టు రేంజర్ సుబ్బారావు అన్నారు. సోమవారం మండలంలోని మిల్లంపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో బైక్‌మెకానిక్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వన్యప్రాణుల వేటగాళ్ల ద్విచక్ర వాహనంలో ఉండే క్లచ్‌లను (ఉచ్చులకు) ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెకానిక్‌లతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పిస్తు న్నట్లు తెలిపారు. వేటగాళ్లకు తక్కువ ఖర్చుతో దొరికే క్లచ్ వయర్లను తీసుకెళ్లి ఉచ్చులుగా ఏర్పాటు చేస్తు వన్యప్రాణులను వేటాడుతున్నారని పేర్కొన్నారు. కావున ప్రతి బైక్ మెకానిక్ వాటిని దృష్టిలో ఉంచుకోని క్లచ్‌లను ఏవరికి అమ్మరాదన్నారు. అలా అమ్మితే వారి వివరాలను కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. ముందుగా ఫారెస్టు, వన్యప్రాణుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు డిప్యూటీ రేంజర్లు, బోయలపల్లి, వీరభద్రాపురం బీట్ అధికారులు, సిబ్బంది బైక్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే ప్రభుత్వం ధ్యేయం



రుణపత్రాలను మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే

తర్లుపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ రుణ మంజూరు పత్రాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడుతూ.. బీసీలు అభివృద్ధి చెందేందుకు రుణాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్పొరేషన్ ద్వారా బీసీలకు రుణాలు అందజేస్తుందని, ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బడుగు, బలహీన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లో పారం పండ్స్ తొవ్వుకోవాలని దీంతో భూగర్భ జలాలు అడుగంటినప్పుడు బోర్లకు పుష్కలంగా నీరు వస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను శ్రేణులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీరు తోలాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, మాజీ జెడ్పీటీసీ రావి బాసపతిరెడ్డి, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఈఓపీఆర్‌డీ శివకుమార్, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

● ఉప్పొంగిన ఉత్సాహం



ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు

మార్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రథోత్సవానికి ముందు రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి మార్కాపురం పట్టణంలోని ప్రధాన వీధులు జనసంద్రమయ్యాయి. టీడీపీ, జనసేన, వైసీపీలకు చెందిన ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాయి. స్థానిక నాయుడు వీధిలో టీడీపీ, మెయిన్ బజార్‌లో వైసీపీ, కంభం రోడ్డులోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ వద్ద జనసేన పార్టీలు ఆర్కెస్ట్రాలను ఏర్పాటు చేశాయి. ముందుగా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు ప్రసంగించారు. అనంతరం డ్యాన్సర్ల నృత్యాలతో యువత కేరింతలు కొట్టారు. ఇవేకాక రథం బజార్, రీడింగ్ రూమ్, మున్సిపాలిటీ కార్యాలయం, నీల కంఠయ్య వీధుల్లో పౌరాణిక డ్రామాలు వృద్ధులను, పాతతరం వారిని అలరించాయి. సుమారు అర్ధరాత్రి 1.00 గంట వరకు ప్రధాన వీధులు ప్రజలతో కిక్కిరిసాయి.

వైభవంగా గ్రామోత్సవం

గిద్దలూరు : మండలంలోని కే.ఎస్.పల్లెలో పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు సోమవారం ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం కోలాట ప్రదర్శనల నడుమ అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. దేవస్థాన ధర్మకర్త అంబటి బాలిరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

మార్కాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్య విద్యార్థి విద్య నిమిత్తం సోమవారం వాసవీ విజన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. పట్టణానికి చెందిన జక్కా వెంకటసత్యసాయి ఓజస్విత్ చదువు నిమిత్తం డాక్టర్ గోళ్ల విద్యావైష్ణవి రూ.15 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వి207ఎ జిల్లా గవర్నర్ గోల్డెన్‌స్టార్, కేసీజీఎఫ్ గంగిశెట్టి కిరణ్‌కుమార్, ఐఈసీ ఆఫీసర్ గోళ్ల వరలక్ష్మి, రీజియన్ ఛైర్మన్ నారాయణం వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షులు లింగం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మళ్లీ ఘర్షణ... చెదరగొట్టిన పోలీసులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో రెండువర్గాలు ఘర్షణపడి కత్తిపోట్లకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా సోమవారం మళ్లీ ఘర్షణ చోటుచేసుకొంది. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ధనరాజ్, రాముడు వర్గాలు పాతకక్షల నేపథ్యంలో జరుగుతున్న ఘర్షణను నివారించేందుకు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసిన విషయం తెలిసిందే. పంచాయతీ జరుగుతున్న సందర్భంగా కత్తులతో దాడి చేసుకోగా 10 మంది గాయపడ్డారు. వీరందరినీ చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అయితే సోమవారం మరోసారి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోనే ఇరువర్గాలకు చెందిన వారు మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని లాఠీలకు పనిచెప్పారు. దీంతో ఘర్షణ సద్దుమణగడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ముఖాముఖి

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జె.వెంకటేశ్వరరెడ్డి, వైద్యాధికారి, ముండ్లమూరు



ప్రశ్న: వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఏం చర్యలు తీసుకోవాలి?

జవాబు: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ప్రతిరోజు ఉదయం 11 గంటలలోపే పనులు ముగించుకోవాలి. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఇళ్ల వద్దే ఉండాలి. అత్యవసర పని మీద బయటకు వెళ్ళాల్సి వస్తే టోపీ ధరించటంతో పాటు నూలు వస్త్రాలు ధరించాలి.

ప్ర: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

జ: 63 వైద్య పరీక్షలతో పాటు 175 రకాల మందులు ఉన్నాయి. ఆస్పత్రి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేదు.

ప్ర: ఇటీవల ఎక్కువ మంది కుక్క కాటుకు గురై ఆస్పత్రికి వస్తున్న సమాచారం ఉంది. నిజమేనా?

జ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుక్క కాటుకు గురై ఎక్కువ మంది వస్తున్నారు. గాయపడిన వారికి మొత్తం నాలుగు ఇంజక్షన్లు ఇస్తున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం.

ప్ర: గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

జ: ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి సర్వేను ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నాం. ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్ళి సర్వేలు చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.3 లక్షల 42వేలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.3,42,786లు వచ్చినట్లు ఈవో కె.నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.67,670, లడ్డూ ప్రసాదం అమ్మకంద్వారా రూ.22,915, పంచామృత అభిషేకాల ద్వారా రూ.60,679, మహాప్రాకార నిర్మాణానికి విరాళాలద్వారా రూ.25,116, ఇతర విరాళాల ద్వారా రూ.3 వేలు వచ్చినట్లు తెలిపారు. అన్నదానానికి తిరుపతి జిల్లా గూడూరు పట్టణానికి చెందిన పాబోలు నారాయణ, విజయలక్ష్మి దంపతులు రూ.లక్షా 16లు అందజేసినట్లు ఈవో తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పామూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులకు రావలసిన 14 వారాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీవో మాల్యాద్రికి వినతిపత్రం అందజేశారు. రోజువారీ కూలీ రూ. 3 వందలు కూడా రావడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.మాల్యాద్రి, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీవో పి.వెంకటరావు అన్నారు. సోమవారం మండలంలోని నూజెండ్లపల్లి, సుంకర వారిపాలెంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో షామియానా, మంచి నీరు, వైద్య కిట్టు ఉండాలన్నారు. జాబ్ కార్డు ఉన్న కూలీలు మాత్రమే పనికి వచ్చే విధంగా చూడాలన్నారు. గతంలో జరిగిన గ్రామ సభల్లో ఆమోదించిన పనులు మాత్రమే చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రామలక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

యూపీ పాఠశాలలను కొనసాగించాలి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో యూపీ పాఠశాలలను కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా సీఎస్‌పురంలో మాత్రమే యూపీ పాఠశాలలను డ్రీగేడ్ చేశారన్నారు. మూడు కిలోమీటర్ల దూరంలో హైస్కూల్ అందుబాటులోలేని యూపీ స్కూల్ కొనసాగించే అవకాశం ఉన్నా అలాచేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.మాలకొండయ్య, డి.సుబ్బరాయుడు, జి .రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారుల సమావేశం

కురిచేడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సతీష్‌బాబు తెలిపారు. సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హాజరు అవుతున్నారన్నారు. మండలంలోని లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

దిగజారుతున్న ధాన్యం ధరలు

» నెలలో బస్తాకు రూ.300 తగ్గిన వైనం

» ఆందోళనలో రైతులు

ముండ్లమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ధరలు రోజురోజుకు దిగజారుతున్నాయి. దళారుల చెప్పిన ధరకే గత్యంతరంలేక అమ్ముకోవల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రబీలో 1010, 15048, కేఎన్‌ఎం 1638 సన్నాల రకాల వరి పంటను సాగుచేశారు. ప్రస్తుతం నెల రోజుల నుంచి ముమ్మరంగా వరి కోతలు, పంట నూర్పిళ్ళు జరుగుతున్నాయి. 1010 రకం 75 కేజీల బస్తా రూ.1200లకు కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో 1500 పలికిన ధర కాస్త నెల రోజుల వ్యవధిలోనే మూడు వందల రూపాయలకు తగ్గటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. 1010 రకమే కాకుండా సన్నాలు రేటు కూడా తగ్గించారు. మొదట్లో రూ.1600 పలికిన ధర నేడు రూ.1400లకు దిగజారింది.

రజానగరం మేజరు కాలువ పరిధిలోని బసవాపురం, కెల్లంపల్లి, కొక్కిరకొండాయపాలెం, రెడ్డినగర్, శ్రీనివాసనగర్ గ్రామాల్లో కాలువలు, వ్యవసాయ బోర్ల కింద వరి సాగుచేశారు. మండలంలో రబీలో 2,650 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చేతికొచ్చేసరికి ధరలు దిగజారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి దాదాపు రూ.35 వేల నుంచి రూ. 40వేల వరకు పెట్టుబడి అయింది. పంట కోసేందుకు, నూర్పిడి చేసేందుకు అదనంగా మరో రూ .10వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఏడాది 1010 రకం దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర దగ్గరకు వచ్చే సరికి రైతులు డీలాపడ్డారు. దీంతో తమకు నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి, సింగనపాలెం, వేములబండ, పెద ఉల్లగల్లు, చిన ఉల్లగల్లు గ్రామాలకు చెందిన రైతులు పొలాల్లోనే పంట నూర్పిడి చేసి అమ్మకాలు చేస్తున్నారు. పంట కోసం తెచ్చిన అప్పులు సైతం తీరక పోగా రైతు ఆరుగాలం పడ్డ కష్టానికి ఏ మాత్రం ఫలితం దక్కటం లేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పెదఉల్లగల్లులో ధాన్యాన్ని కాటా వేస్తున్న కూలీలు

నెల రోజుల్లోనే బస్తాకు రూ.300 తగ్గింది

- ఏలూరి ఆదిశేషయ్య, రైతు, బసవాపురం



ఈ ఏడాది రబీలో 1010 రకాన్ని ఎనిమిది ఎకరాల్లో సాగు చేశాను. పది రోజుల నుంచి నూర్పిళ్లు చేస్తున్నాం. బస్తా రూ.1200లకు గ్రామంలో నే వ్యాపారస్తులకు గత్యంతరంలేక విక్రయిస్తున్నాం. నెల రోజుల్లో రూ.300 తగ్గింది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఇండ్ల నాగేశ్వరరావు, రైతు, పసుపుగల్లు



వరి సాగుచేసిన రైతులను దళారులు నట్టేట ముంచుతున్నారు. ఇష్టారీతిగా ధరలు తగ్గిస్తున్నారు. విధిలేక విక్రయించుకోవల్సి వస్తుంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి గిట్టుబాటు ధరకు కొనుగోలుచేయాలి. లేదంటే రైతుల పరిస్థితి దారుణంగా ఉంటుంది.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

» వైసీపీ హయాంలో పలుచోట్ల మెటీరియల్ అపహరణ

» కూటమి ప్రభుత్వం రాకతో గాడిలో పెడుతున్న అధికారులు



బొట్లపాలెంలో రేకులు అపహరించిన చెత్తసంపద కేంద్రం

దర్శి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏర్పాటుచేసిన చెత్తనుంచి సంపద తయారు కేంద్రాలు వైసీపీ పాలకులు నిర్లక్ష్యంతో నిరుపయోగంగా ఉన్నాయి. పలుచోట్ల కేంద్రాల్లోని మెటీరియల్‌ను అపహరించుకెళ్లారు. ఎంతో ప్రయోజనాత్మకమైన ఈ పథకాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చారు. మండలంలోని బొట్లపాలెం, బండివెలిగండ్ల గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలకు ఏర్పాటుచేసిన రేకులను తస్కరించారు. మరికొన్నిచోట్ల ఇనుప మెటీరియల్ కూడా తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్తనుంచి సంపద కేంద్రాలను అధికారులు గాడిలో పెడుతున్నారు. గత ఐదేళ్లుగా మూలనపడ్డ కేంద్రాలను పునఃప్రారంభించారు. ఈ కేంద్రాల పనితీరుపై ఈవోఆర్డీ ఆవుల సుధాకర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గతంలో నిరుపయోగంగా ఉన్న అధికశాతం కేంద్రాలను వినియోగంలోకి తెచ్చామన్నారు. బొట్లపాలెం, బండివెలిగండ్ల కేంద్రాలకు మెటీరియల్ లేకపోవటంతో ఆ కేంద్రాలు వినియోగంలోకి రాలేదన్నారు. ఆ కేంద్రాల పునర్నిర్మాణానికి స్వచ్ఛాంధ్ర ద్వారా నిధులు విడుదల అయ్యాయన్నారు. త్వరలో పనులు పూర్తిచేసి అన్ని కేంద్రాలను వినియోగంలోకి తెస్తామని వివరించారు.

దర్శిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

దర్శి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రధాన కూడలిలో గతంలో నిర్మించిన గడియారస్తంభం ఒక వైపునకు ఉండటంతో వాహనాలు మళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. వాహనాల రద్దీ విపరీతంగా పెరగటంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలకు ఉపక్రమించారు. అడ్డుగా ఉన్న గడియారస్తంభాన్ని తొలగించి రోడ్లు వెడల్పు చేయాలని భావిస్తున్నారు. ఈక్రమంలో కొంతమంది ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన గడియార స్తంభాన్ని తొలగించకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గడియారస్తంభం తొలగించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.



గడియారస్తంభం సెంటర్‌లో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొలతలు తీస్తున్న సర్వే అధికారులు

వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని రద్దుచేయాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

కనిగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జమియత్ ఇస్లామియా, అంజుమన్ కమిటీ నాయకులు అహ్మద్ హుస్సేని, యాసిన్‌లు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని ఆరోపించారు. అందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చిందన్నారు. ప్రతి ముస్లిం ఈ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం తక్షణమే బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిల్లు రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పామూరు బస్టాండు వద్ద మానవహారం నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, రోషన్ సందాని, గుడిపాటి ఖాదర్, ఫిరోజ్, ముస్లింలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి జాతర

ముండ్లమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో 30వ జాతర మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో జాతర జరుగుతుంది. జాతర సందర్భంగా మొక్కుబడులు ఉన్న భక్తులు ఆలయానికి వచ్చి పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. వేముల గ్రామస్థులతో పాటు కమ్మవారిపాలెం, రమణారెడ్డిపాలెం, వేములబండ, అయోధ్యనగర్ గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. విజయవాడ, గుంటూరు, వినుకొండ, ఒంగోలు, దర్శి, అద్దంకి, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్‌ఐ బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల



ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీలోని శివరాజ్‌నగర్‌లో సోమవారం శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఇతర ప్రాంతాల్లో మేస్త్రీలుగా పనులు చేసుకునే కుటుంబాలు సైతం ఇక్కడకు వచ్చి స్వామివారికి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్‌ప్రభ ఏర్పాటుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

పామూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. రాచూరివారి వీధికి చెందిన బచ్చు లీలాకుమార్ కుమారుడు బాలభవేష్ పట్టణంలోని ఓ ప్రయివేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవర్మణం చెందాడు. ఇంట్లో ఉన్న రూ.25వేలు కనిపించకపోవడంతో కుమారుడిని అడుగుగా తానే తీశానని, అందులో రూ.11 వేలు ఉన్నాయని చెప్పడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వవైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఏకైక కుమారుడు అర్ధంతరంగా తనువు చాలించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

భానుడు భగ భగ

» కర్ఫ్యూను తలపిస్తున్న ప్రధాన రహదారులు

దొనకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాత్రిపూట చల్లటి గాలులు.. తెల్లారిందంటే భానుడు భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సోమవారం దొనకొండలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇటీవల కాలంలో వేసవి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ 40 నుంచి 41 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటలు అయిందంటే చాలు భానుడు ఉగ్రరూపం దాల్చుతుండటంతో అత్యవసర పనులుంటే తప్ప బయటకు వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండ దెబ్బకు మధ్యాహ్నంకు రోడ్లపై జనం సందడి తగ్గి ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తుంది.



దొనకొండలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జరీనా

వీసీపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు షేక్ జరీనా అన్నారు. మండలంలోని చిరుకూరివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషకవిలువలు అధికంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు క్రిష్ణవేణి, అబ్బూరి మల్లేశ్వరి, హబీబున్నీసా, నిర్మల, విజయ, నిరోష, శిరీష, బాలకొండమ్మ, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలి

వీసీపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రతిఒక్కరికి పనులు కల్పించాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలను అనుసరించి పనులు చేయించాలన్నారు. ప్రతి గ్రామంలోను పనులు చేయించాలన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జహంగీర్‌బాషా, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు డీప్‌బోర్లు ఏర్పాటు

దొనకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో డీప్‌బోర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. సోమవారం స్థానిక అడ్డరోడ్డులో ఏర్పాటు చేస్తున్న డీప్‌బోరుకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి, గ్రామ కార్యదర్శి పోట్ల కృష్ణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, కామేపల్లి చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

పామూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారించ వచ్చునని సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండంలోని రావిగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోషకాహారలోగోను కేంద్రంలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షేక్ నాగూర్‌బి, షేక్ కరీష్మా, సజీమాబేగం, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు న్యాయం చేస్తాం!

పామూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపు మహిళలకు అన్యాయం జరగకుండా అన్నిరకాలుగా చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని ఏరియా కోఆర్డినేటర్ ఆర్‌ఆర్‌ఎల్ అంబేడ్కర్ అన్నారు. పామూరు కస్టర్ పరిధిలోని వీవోఏ పల్లాపు బేబి బ్యాంకులో జమ చేయకుండా నగదు స్వాహా చేయడంతో సోమవారం స్థానిక వెలుగు కార్యాలయాన్ని ముట్టడించారు. వీవోఏపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ ఏపీఎం జీవి ద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. తేజస్వి గ్రూపునకు సంబంధించి రూ.4 లక్షలు, భారతి గ్రూపునకు చెందిన రూ.3 లక్షలు, మదర్‌థెరిస్సాకు చెందిన రూ.5.50 లక్షలు, శ్రీవెంగమాంబకు చెందిన రూ.2,50 లక్షలు, శ్రీకామాక్షీతాయి గ్రూపునకు చెందిన రూ.3,30 లక్షలు, ఖాజానాయబ్‌రసూల్‌కు చెందిన రూ.లక్ష, రాఘవేంద్రకు చెందిన రూ.4,20లక్షలు, మాలకొండస్వామి గ్రూపునకు చెందిన రూ.2 లక్షల 20వేలు, మమత గ్రూపునకు చెందిన రూ. 2 లక్షల నిధులు గోల్‌మాల్ అయినట్లు పొదుపు మహిళలు వినతి పత్రం అందజేశారు. పొదుపు నిధుల అన్యాకాంతంపై నిజనిర్ధారణ కోసం వెలుగు కార్యాలయానికి విచ్చేసిన ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్‌ను వివరణ కోరగా పొదుపు గ్రూపుల రుణాల్లో అవకతవకలు జరిగినట్లు తెలిసిందని పేర్కొన్నారు. అవకతవకలపై విచారించి పొదుపు మహిళలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీజీఎం షేక్ జిలాని, ఏపీవో జీ.విద్యాసాగర్, మండల సమాఖ్య కార్యదర్శి ఉమ్మడి పద్మ, సీసీలు సుబ్రమణ్యం, సరళ పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న గఫార్

కనిగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ వద్ద ఉన్న కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ హౌసింగ్ డీఈకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గఫార్ మాట్లాడుతూ కాలనీలో దాదాపు 1300 మందికి ఇళ్లస్థలాలు కేటాయించారన్నారు. ఇప్పటికే 300 మంది గృహాలు నిర్మించుకున్నారన్నారు. మరో 300 గృహాల నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని చెప్పారు. మోడల్‌స్కూల్ వద్ద నుంచి కాలనీ వరకు రోడ్డు మరమ్మతు చేయించి వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కారు బోల్తా... ఇద్దరికి స్వల్పగాయాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు వద్ద కోళ్ళఫారం సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం డ్రైవర్ నిద్రమత్తుతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్‌కు, పక్కన కూర్చున్న మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. విజయవాడ నుంచి కర్నూలు వెళ్తున్న కారు ఉల్లగల్లు సమీపంలోకి వచ్చేసరికే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

బడి ఈడుపిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

తాళ్లూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య తెలిపారు. తాళ్లూరు మండలంలోని మూడు కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు గ్రామాల్లో బడిమానిన విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇప్పటివరకు 35 మంది విద్యార్థులను నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, కాంప్లెక్స్ చైర్మన్, హెచ్‌ఎం శేషగిరి, శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీవోగా వెంకటరావు బాధ్యతల స్వీకరణ


ముండ్లమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా పి.వెంకటరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పొదిలిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇప్పటివరకు ఏపీవోగా పనిచేసిన కె.నాగరాజు మార్కాపురం మండలానికి బదిలీపై వెళ్ళారు.

ఉష్ణోగ్రత (అంచనా)

22-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	26
తెనాలి	39	26
నరసరావుపేట	40	25
బాపట్ల	37	27
రెంటచింతల	42	25

కొలిక్కి వస్తున్న రీ సర్వే



- తప్పులు సరిచేస్తూ...సమగ్రంగా
- పైలట్ ప్రాజెక్టుగా గతంలోనే మండలానికో గ్రామం
- రెండో విడత కూడా ప్రారంభం
- ఇప్పటికే గ్రామ సభలు పూర్తి.. హద్దులు గుర్తింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం రీ సర్వే పేరిట చేసిన ప్రహసనం భూములకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టిందే తప్ప రైతాంగానికి ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ప్రణాళికలు లేకుండా చేపట్టిన రీ సర్వే తంతుతో ప్రభుత్వం మారగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్జీలు ప్రభుత్వానికి అందాయి. వీటిలో అధికశాతం భూ సంబంధమైనవే కావడం గమనార్హం. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో పక్కా ప్రణాళికతో మండలానికి ఓ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే నిర్వహించింది. ఈ గ్రామాలన్నీ కూడా గత ప్రభుత్వంలో రీ సర్వే చేయనివే కావడంతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీ సర్వేని యంత్రాంగం చేపట్టింది. కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలు మినహా రీ సర్వే ఓ కొలిక్కి వచ్చే సరికి ఆయా గ్రామాల్లోని రికార్డుల్లో ఎలాంటి తకరారు లేకుండా పక్కాగా ఆర్‌వోఆర్ ఉండాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. దీనికి అనుగుణంగానే ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటికే జీటీ పూర్తి చేసిన యంత్రాంగం 9(2) కింద గ్రామాల్లో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు జారీ చేసి అభ్యంతరాలను స్వీకరించింది. వాటిని డిస్పోజ్ కూడా చేసింది. డీఎల్ఆర్ అంకాన్ని కూడా ముగించిన యంత్రాంగం చివరిగా ఆర్‌వోఆర్ సిద్ధం చేసి గ్రామాల్లో జాబితా ప్రద ర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా కూడా దాదాపుగా ముగింపుకొచ్చింది. ఆ తర్వాత రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ వివాదం అనే మాటే వినిపించకూడదనేది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగా రీ సర్వేని పక్కాగా చేపట్టడానికి ఆ విధుల్లో ఉన్న సిబ్బందికి వేరే డ్యూటీలు వేయకుండా అన్ని వసతులు సమకూర్చి పూర్తి పారదర్శకంగా రీ సర్వే జరిగేలా ప్రభుత్వం తోడ్పాటునందించింది

రెండో విడత రీ సర్వే ఇప్పటికే ప్రారంభం

ప్రభుత్వం దశల వారీగా అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది. దీనిలో భాగంగానే పైలట్ గ్రామాల్లో రీసర్వే కొలిక్కి వస్తుండగానే గుంటూరు జిల్లాలో 18, పల్నాడులో 28, బాపట్ల జిల్లా పరిధిలోని 25 గ్రామాల్లో ఈ నెల 2 నుంచి మలివిడత రీసర్వే ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే గ్రామ


రెండో విడత రీ సర్వేలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్వహిస్తున్న గ్రామ సభ (పాత చిత్రం)

సభలను పూర్తి చేసిన యంత్రాంగం హద్దులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేస్తోంది. తొలుత మండలానికి రెండు గ్రామాల చొప్పున రెండో విడత రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం తలంచింది. దీనికి అనుగుణంగానే తొలుత ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ఇటీవల మండలానికో గ్రామంలోనే రీ సర్వే చేపట్టే విధంగా ఆదేశాలను సవరించారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పాటు కచ్చితత్వంతో కూడిన ఫలితాలను రాబట్టాలనే ఉద్దేశంతో రెండో విడత రీ సర్వే గ్రామాలను కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పైలట్ గ్రామాల్లో ప్రభుత్వం ఎంచుకున్న నమూనా సత్ఫలితాలు ఇవ్వడంతో అదే ప్రక్రియలో మొత్తం భూములకు రీ సర్వే చేపట్టి భూ యజమానులకు భరోసా అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇదిలా ఉంటే రెండో విడతలో మూడు జిల్లాలో ఎంచుకున్న 71 గ్రామాల్లో వైసీపీ హయాంలో రీ సర్వేని ప్రారంభించి సగంలో కాడి వదిలేసిన 35 గ్రామాలను కూడా జాబితాలో సర్వే విభాగం చేర్చింది. ఇప్పటికే పైలట్ గ్రామాల్లో రీ సర్వే విజయవంతం కావడంతో పాటు ప్రభుత్వం ఎంచుకున్న నమూనా, యాప్ వినియోగంపై సిబ్బందికి ఓ అవగాహన వచ్చింది. దీంతో రెండో విడత కింద ఎంచుకున్న గ్రామాల్లో రీ సర్వే ఘట్టాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చి ఫలితాలు చూపెట్టాలని ఆదేశించింది. గడువులోపల రీ సర్వే పూర్తి చేయాలనే పట్టుదలతో యంత్రాంగం అడుగులేస్తోంది

అభ్యంతరాల విషయంలో ఏకాభిప్రాయంతోనే..

రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో వచ్చే అభ్యంతరాలకు సంబంధించి ఇరు పార్టీల అంగీకారంతోనే ఓ నిర్ణయానికి వస్తున్నామని సర్వేతో పాటు రెవెన్యూ విభాగం చెబుతోంది. అప్పటికీ ఒప్పుకోని పక్షంలో సహేతుకతలేని వినతులని తిరస్కరించి ముందుకు వెళుతున్నామని అధికారులు చెబుతున్నారు. మరింత సంక్లిష్టంగా ఉన్నవాటి విషయంలో రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. వైసీపీ హ యాంలో రీ సర్వే జరిగిన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 11,000 అర్జీలు

(మిగతా 6వ పేజీలో)

తెల్లబోతున్న జొన్న

ధర లేదు... కొనే దిక్కూలేదు


మొన్నటి వర్షాలకు తడిచిన తెల్ల జొన్నలు

- మొక్కజొన్న కూడా చేలల్లోనే అమ్మకాలు
- కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని మార్కెటింగ్ శాఖ
- వర్షాలకూ దెబ్బతిని బోరుమంటున్న జొన్నరైతులు
- రంగు మారటంతో రేటు విషయంలో కోతకోస్తున్న వ్యాపారులు
- జొన్న మద్దతు ధర రూ. 3460... మార్కెట్ రేటు రూ. 1700లే
- అంతా దగానే... ఆదుకోకుంటే రైతన్నకు నష్టమే

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ సాగుకింద పండిన మొక్కజొన్న, జొన్న పంటలు చేతికొచ్చాయి. పంట అందుతున్న తరుణంలోనే వర్షాలూ వెంట వచ్చాయి. తడిచిపోవటం, పంట దెబ్బతినటం వంటివన్నీ ఒకెత్తయితే, పంట చేతికొచ్చినా అమ్ముకోలేని స్థితిలో రబీ రైతన్న ఉన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే పండించిన పంట కొనే దిక్కులేక అల్లాడుతున్నాడు. జొన్నకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ఆకాశంలో ఉంటే, మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధర పాతాళంలో ఉంది. అంటే... మార్కెట్ ధరకు, వ్యాపారులు కోతకోసి మరీ కొంటున్న ధరకు అంత వ్యత్యాసం ఉందన్నమాట. మొక్కజొన్నకు కొంత వరకు పర్వాలేదనిపిస్తున్నా, జొన్నరైతే దిగాలు పడుతున్నాడు. పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు తాము జొన్నలు, మొక్కజొన్న కొనబోమని ఆలస్యంగా కబురు చెప్పటంతో జొన్నరైతన్నది దిక్కుతోచని స్థితి. పండించిన పాపానికి ఎంతోకొంత దక్కితే చాలని వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తే వర్షాల సాకుచూపి, తేమ ఉందని, రంగు మారిపోయాయంటూ మద్దతు ధరలో సగమే ఉన్న రేటు మరింత కోత కోసి రైతన్నను దగా చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా దక్కక రైతన్న దిగాలు పడుతుంటే, కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.


తెల్ల జొన్నలను గోతాలకెత్తుతున్న కూలీలు

తెనాలి, వేమూరు, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, వాటిలో రబీ కింద మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర పంటలు సాగయ్యాయి. వీటిలో మొక్కజొన్న, జొన్న పంటల సాగే ఎక్కువగా ఉంది. జొన్న 3.9 లక్షల ఎకరాల్లో సాగయితే, జొన్న 1.3 లక్షల ఎకరాల్లో సాగయిందనేది అధికారుల మాట. మిగిలిన విస్తీర్ణంలో మినుము, పెసర పంటలు వేశారు. అయితే వీటన్నిటికీ రేటు కొంత వరకు పర్వాలేదనిపించినా, తెల్లజొన్నకు మాత్రం దారుణంగా ఉంది.



దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే మొక్కజొన్నకు మాత్రం మార్కెట్ రేటుకూడా మద్దతు ధరకు దగ్గరగా ఉండటంతో రైతులకు పెద్దగా నష్టం జరిగేదిలేదు. క్వింటా మొక్కజొన్నలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2,225గా ఉంది. అయితే మార్కెట్‌లో క్వింటాకు రూ. 2,100 నుంచి రూ. 2,200 వరకు వ్యాపారులే చెల్లిస్తుండటంతో రైతులు పెద్దగా కొనుగోలు కేంద్రాలకోసం ఎదురు చూడటంలేదు. శనివారం బాపట్ల జిల్లాలో క్వింటాకు ఖర్చులతో రైతులకు పనిలేకుండా రూ. 2120 రేటు చెల్లిస్తే, ఖర్చులతో రూ. 2,200 చెల్లించారని, దీనివల్ల పెద్దగా ఇబ్బందిలేదని, చేలల్లోనే వ్యాపారులు మద్దతు ధరకు దగ్గరగా ఇచ్చి కొంటున్నారని చెబుతున్నారు.

మద్దతు ధర రూ. 3,460... కొనేది రూ. 1700లకే

జొన్న డెల్టాలో 1.3 లక్షల ఎకరాల్లో సాగయితే దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వచ్చింది. ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడులు రైతులకు దక్కాయి. కొన్ని చోట్లయితే 30 క్వింటాళ్లు కూడా వచ్చాయి. అయితే జొన్న మద్దతు ధర క్వింటాకు భారీగానే కేంద్రం నిర్ణయించింది. దీనిలో తెల్లజొన్న హైబ్రిడ్‌వయితే క్వింటాకు రూ. 3,371, మాల్దండి రకం జొన్నకయితే రూ. 3,421గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మద్దతు ధర కేవలం కాగితాలకే పరిమితమయింది.ప్రస్తుతం అంతా బాగున్న జొన్నలయితే క్వింటాకు వ్యాపారులు రూ. 2100 వరకు చెల్లిస్తున్నారు. అయితే ఎక్కువ శాతం సాకులుచూపి ధరలో కోత కోసేస్తున్నారు. తడవకుండా, మంచుకు రంగు మారినా, వర్షాలకు తడిచాయన్న సాకులు

(మిగతా 6వ పేజీలో)

అమరావతి ఓఆర్ఆర్ నుంచి.. నిజాంపట్నానికి నాలుగు లైన్ల రోడ్డు

- రూ.317కోట్లతో ఆరు ఆర్వోబీలు
- హైవే అధికారుల సమీక్షలో ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ రాష్ట్రానికి వరమని, అందరం సమష్టిగా పనిచేసి అభివృద్ధికి దోహదపడదామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. సోమవారం బాపట్ల జిల్లా చీరాల ఆర్డీవో కార్యాలయంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్ల నిర్మాణానికి చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ వేగం పెంచి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి కృషితో రాబోవు రెండు, మూడేళ్లల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నానికి నాలుగు వరుసల రహదారి మంజూరయిందని వివరించారు. అంతేకాకుండా ఇటీవల రూ.317కోట్ల నిధులతో 6 ఆర్వోబీ వంతెనలు మంజూరు కాగా, వాటిని తెనాలి నుంచి నిడుబ్రోలు, పెద అవుటుపల్లి ప్రాంతాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 62 ఆర్వోబీలకు వినతులు చేయగా, నాలుగు మంజూరైనట్లు తెలిపారు. 58 ఆర్వోబీలపై కసరత్తు జరుగుతుందన్నారు. అంతేకాకుండా బాపట్ల జిల్లా పరిధిలోని చినగంజాం, చీరాల, సూర్యలంక బీచ్‌లు దేశంలోనే గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తామని, టూరిజం అభివృద్ధితో ఉపాధి, ఆదాయం ఉంటుందని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం జాతీయ రహదారి నిర్మాణాలను పరిశీలించారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాణాలకే.. ప్రాధాన్యం



- ఇంటర్ విద్యలో నూతన మార్పులకు శ్రీకారం
- జాతీయస్థాయి ప్రమాణాలే లక్ష్యంగా సిలబస్, బోధన
- ఏపీ ఈ ఏపీ సెట్‌కు ఉపయోగం అధ్యాపకులకు త్వరలో శిక్షణ

గుంటూరు(విద్య) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు, ప్రమాణాలే లక్ష్యంగా ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దీంతోపాటు రాష్ట్ర స్థాయిలో ఏపీ ఈఏపీసెట్(ఎంసెట్) ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు ఈ మార్పులు ఉపయోగపడనున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని సబ్జెక్టులను కుదించి ఒకే సబ్జెక్టుగా మార్చడం. సిలబస్, పరీక్షల విధానం, మార్కుల కేటాయింపు తదితర అంశాల్లో కొత్త విద్యా సంవత్సరం నుంచి నూతన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు రానున్నాయని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ ఆధ్వర్యంలో 35 పైగా జూనియర్ కళాశాలలు, వృత్తి విద్య కళాశాలలు ఉన్నాయి. ఇంకా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్, గురుకుల జూనియర్ కళాశాలలో మరో 50 వరకు ఉన్నాయి. అదేవిధంగా, ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో 100కు పైగా జూ నియర్ కళాశాలలో ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారు . ఇంటర్‌లో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ ప్రధాన గ్రూపులు ఉన్నాయి .వీటితో పాటు ఎంబైపీసీ గ్రూపును కూడా ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టడానికి ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తున్నది. మరో వైపు వృత్తి విద్యా కళాశాలల్లో కూడా నూతన కోర్సులు సిలబస్‌లో మార్పులపై అధ్యయనం చేస్తున్నారు.

ముందస్తు తరగతులు.. పుస్తకాల పంపిణీ

ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం ఇప్పటికే అనేక కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. గత నెల 24 నుంచి దాదాపు నెల రోజుల పాటు తరగతులు నిర్వహించారు .ప్రధాన సబ్జెక్టుల్లో రెండు మూడు యూనిట్లు కూడా పూర్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కూడా ప్రారంభించారు.

అధ్యాపకులకు శిక్షణ కోసం కసరత్తు

ఇంటర్ బోధించే అధ్యాపకులకు మారిన సిలబస్ నూతన విధానాల ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. జాతీయస్థాయి పరీక్షలకు అనుగుణంగా మారిన సిలబస్‌లో బోధన ఎలా చేయాలి.. , విద్యార్థుల్ని పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలి .. వంటి అంశాలపై పునశ్చరణ తరగతులు నిర్వహించడానికి ప్రణాళిక లు సిద్ధం చేశారు. ఈ వేసవి సెలవుల్లోనే పునశ్చరణ తరగతులు పూర్తిచేసి జూనియర్ కళా శాలల ప్రారంభం నాటికి అధ్యాపకులను బోధనకు సన్నద్ధం చేయాలని యోచిస్తున్నారు.

ఇంటర్ సిలబస్‌లో మార్పులు ఇలా ..

ఇంటర్ ఇప్పటివరకు మాథ్స్ ఏ, బి సబ్జెక్టులు ఉన్నాయి. వీటిని ఒకే సబ్జెక్టుగా చేయనున్నారు. బోటనీ జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా (మిగతా 6వ పేజీలో)

బావుడాకు మరింత బలం



- భవన, లే అవుట్ల నిర్మాణాల అనుమతులు అథారిటీకి
- ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇకపై క్రమం తప్పకుండా సమీక్షలు, పట్టణ ప్రణాళికలపై కసరత్తు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కొలువు దీర్చిన బావుడా(బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కేవలం అలంకారప్రాయంగానే మిగిలింది. పట్టణాభివృద్ధిలో దాని పాత్రే లేకుండా వైసీపీ చేసింది. రాజకీయంగా నామినేటెడ్ పదవుల కల్పనకు పట్టణాభివృద్ధి సంస్థలను ఉపయోగించుకుందే కానీ, పట్టణాభివృద్ధిలో బావుడా పాత్ర ఏంటనేదానికి స్పష్టమైన నిర్వచనాన్ని వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. గత ఏలికలు నామమాత్రం చేసిన బావుడాను క్రియాశీలం చేసే చర్యలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా భవనాలకు, లే అవుట్లకు అనుమతులిచ్చే అధికారాలను బావుడాకు కట్టబెడుతూ ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు వీటికి సంబంధించిన అనుమతులను డీటీసీపీ పర్యవేక్షించేది. గత ప్రభుత్వంలో పుట్టగొడుగుల్లా అనుమతిలేని లే అవుట్లతో పాటు భవనాలు వెలిశాయి. ఇప్పటికే వాటి జాబితాను ప్రభుత్వం పారదర్శకంగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచిన సంగతి విదితమే. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వాటి అనుమతులను పునఃసమీక్షించే అధికారం కూడా బావుడాకు సంక్రమించింది. ఇకపై అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో జరిగే నిర్మాణాలపై క్రమం తప్పకుండా సమీక్షలు జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై జరిమానాల కొరడా ఝుళిపించనున్నారు.

సిబ్బంది కేటాయింపు.. సమీక్షలూ జరపాల్సిందే

బావుడా కార్యాలయంలో నిష్పత్తి ప్రకారం ఉండాల్సిన సిబ్బంది 9 మంది కాగా ప్రస్తుతం ముగ్గురితోనే నడుపుతున్నారు. ప్రభుత్వం బావుడా పరిధి పెంచడంతో పాటు నిర్మాణాల అనుమతులను పర్యవేక్షించాల్సి ఉన్నందున సిబ్బంది ఖాళీలను కూడా భర్తీ చేయనుంది. ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా నిబంధనల ప్రకారం బావుడా పరిధిలోని భవనాలు, లే అవుట్లు ఉండేలా చర్యలు తీసుకో నుంది. వీటికి సంబంధించి నెలవారీ సమీక్షలు జరపడం తో పాటు పురోగతిని కూడా బావుడా ప్రభుత్వానికి నివేదించనుంది.

బావుడాపై ప్రభుత్వం దృష్టి

బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా)ని 2022 డిసెంబరులో వైసీపీ ప్రభుత్వం కొలువుదీర్చింది. రెండేళ్ల వ్యవధిలో ఒక్క సమీక్ష జరిపిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక బావుడాపై కూడా దృష్టి పెట్టింది. గతేడాది డిసెంబరులో ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో బావుడా ఛైర్మన్ కిరీటం టీడీపీ నేత సలగల రాజశేఖర్‌బాబును వరించింది. అప్పటి నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై దృష్టి పెట్టిన ప్రభుత్వం అధికారాలు కట్టబెడుతూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

తాజా ఉత్తర్వుల ప్రకారం

బావుడా పరిధిలోకి వచ్చే మండలాల్లో భవనాలు, లే అవుట్లు నిర్మాణాలను ఇకపై సదరు విభాగమే పర్యవేక్షించనుంది. తాజా ఆదేశాల ప్రకారం 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరిగే భవన నిర్మాణాలు, 25 ఎకరాలలోపు వరకు లే అవుట్ల అనుమతులు ఇకపై బావుడానే ఇవ్వనుంది. గతంలో వీటిని పట్టణ ప్రణాళిక డైరెక్టరేట్ కార్యాలయం నుంచి తీసుకోవాల్సి వచ్చేది. ఈ మొత్తం ప్రక్రియలో జాప్యం తగ్గించడంతో పాటు పారదర్శకతకు పెద్ద పీట వేసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఉపకరించనున్నాయి. ఈ క్రమంలో మున్సిపాలిటీల అధికారాల్లో బావుడా జోక్యం చేసుకోకుండా స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం నిర్వచించింది.

మరిన్ని నిర్ణయాలు వెలువడే అవకాశం

వేమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాలు గతంలో సీఆర్డీఏ పరిధిలో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వాటిని కూడా బావుడాలో చేరుస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ తప్పులను సరిచేసే దిశగా ఆ మండలాలను తిరిగి సీఆర్డీఏలో కలుపుతూ ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బావుడా పరిధి రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలకే పరిమితమైంది. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉన్న అద్దంకి, పర్చూరు, చీరాల ప్రాంతాలను కూడా బావుడాలో కలిపే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇదిలా ఉంటే గతంలోనే బావుడా పరిధిలోకి వచ్చే మండలాల్లోని పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4లక్షల చొప్పున సాయం అందించే ఆదేశాలను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేసింది. వీటితో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకే కేంద్రం ప్రత్యేకంగా మంజూరు చేసే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టడంతో పాటు అందుకు సంబంధించిన కసరత్తును బావుడా పాలకవర్గం చేయాలని ఆదేశించింది.

వైసీపీ కీలక నేత అరెస్టుకు రంగం సిద్ధం?

పోక్సో కేసులో ప్రమేయం ఉన్నట్లు గుర్తింపు

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని ఓ వైసీపీ నేత అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. పోక్సో కేసులో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఓ మైనర్‌ను యువకుడు వేధించగా, అందులో ఆ నేత కీలకంగా వ్యవహరించి, యువకుడికి సహకారం అందించినట్లు తెలుస్తుంది. ఈమేరకు నమోదైన కేసులో యువకుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా, వైసీపీ నేత, అతని అనుచరులు ఇద్దరు ఫోన్‌లు ఆఫ్ చేసుకుని పరారీలో ఉన్నట్లు తెలిసింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బెట్టింగ్‌తో అప్పుల పాలయిన భర్త

తాళలేక భార్య సుమియా భాను బలవన్మరణం

వివాదాల్లో కూరుకుపోయిన కుటుంబం

ఈపూరుపాలెం (చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల పాప, మూడు నెలల బాబు. ఎంతో అన్యోన్యమైన కుటంబంలో బెట్టింగ్ యాప్ విషాదాన్ని నింపింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరుపాలెం పీర్ల చావిడి సమీపానికి చెందిన మొగల్ బాజీ లియాస్ బబ్లు. చినగంజాంకు చెందిన సుమియా భాను(21) దంపతులు. వీరికి మూడేళ్ల పాప, మూడు నెలల బాబు సంతానం. బాజీ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ బెట్టింగ్ యాప్‌కు బానిసగా మారాడు. ఈనేపథ్యంలో అప్పుల్లో కూరుకుపోవడంతో అనుకోని రీతిలో ఉన్న ఇంటిని అమ్మకం చేసి బాకీలు తేర్చే ప్రయత్నం జరిగింది. ఈక్రమంలో భార్యాభర్తల మధ్య వివాదం నెలకొంది. అవికాస్త తారస్థాయికి చేరడంతో ఆదివారంరాత్రి ఇంట్లో ఉరికి పాల్పడింది. వెంటనే భర్త స్థానికుల సహకారంతో చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అబిషేక్, సీఐ శేషగిరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమియాభాను తల్లి పఠాన్ ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఉద్యోగోన్నతి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న వంగపల్లి వెంకట సుబ్బారావును నెల్లూరు జిల్లా ఇంటర్ బోర్డ్ అధికారిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతతో పాటు రాష్ట్ర ఎగ్జామినేష్ కంట్రోల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు హనుమంతరావు



హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇంకొల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు చిలుకూరి హనుమంతరావు ఆదర్శవంతుడని పలువురు ప్రముఖులు అన్నారు. మండలంలోని పావులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలలో సైన్సు ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు సేవలందించిన పెదనక్కలపాలెం గ్రామానికి చెందిన చిలుకూరి హనుమంతరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాల అభివృద్ధికి ఆయన కృషిని కొనియాడారు. అనంతరం హనుమంతరావు దంపతులను ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు అజయ్‌బాబు, గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా సత్యనారాయణ

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రకాశం జిల్లా రీజనల్ మేనేజరుగా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటివరకు విజయవాడ వర్క్‌షాప్ మేనేజరుగా ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వెంకట్రావును తిరుపతి ఆర్‌ఎంగా బదిలీ చేశారు. అలాగే విజయవాడ ఆర్టీసీ విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఘట్టమనేని శ్రీనివాసరావును ఒంగోలు కార్గో కొరియర్ సర్వీసెస్ కమర్షియల్ మేనేజరుగా నియమించారు. ఈమేరకు జిల్లాకు నియమితులైన వారిద్దరూ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

చీరాల అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

'మీకోసం' అర్జీలపై కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష

రూ.14కోట్లు మంజూరుకు హామీ

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీకోసం)లో వచ్చిన అర్జీల పరిష్కారంపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే స్వీకరించిన అర్జీలతో పాటు ప్రధానంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మునిసిపల్ పరిధిలో డ్రెయిన్‌లు, అంతర్గత రహదారులు, విద్యుత్ సమస్యలు, ముఖ్యంగా 31వ వార్డులోని ఆక్రమణలపై ప్రస్తావించారు. అలాగే గ్రామాల్లోని లిఫ్టిరిగేషన్‌కు సంబంధించి మరమ్మతులకు గురైన యంత్రాలు గురించి మాట్లాడారు. తోటవారిపాలెం ఎత్తిపోతల పథకానికి రూ.20లక్షలు మంజూరు, మిగిలిన ఎత్తిపోతలు, నీటి అవసరాలపై చర్చించారు. ఫిషింగ్ హార్బర్ స్థలం పునఃపరిశీలన, హ్యాండ్‌లూమ్ పార్కు, ఇసుక కొరత గురించి మాట్లాడారు. జగనన్న కాలనీలు అధ్వానంగా ఉన్నట్లు చెప్పారు. కారంచేడు రైలు గేటువద్ద గేట సమస్యతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఒక్కో అంశంపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో చర్చ సాగించారు. తాగునీటికి సంబంధించి ఇప్పటికే మునిసిపాల్టీలో రూ.1.50కోట్ల నిధులు ఉన్నట్లు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే కొండయ్య, జేసీ ప్రకర్‌జైన్

కమిషనర్ ద్వారా తెలుసుకున్నారు. పన్ను వసూళ్లలో మరో రూ.కోటి వరకు అవకాశం ఉంటుందని చెప్పడంతో సమస్యకు పరిష్కారం చూడాలని సూచించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గతంలో బీచ్ అభివృద్ధితో పాటు పట్టణంలో పలు పనులకు మొత్తంగా రూ.14కోట్లు అందిస్తామని చెప్పారు. సత్వరమే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జేసీ ప్రకర్‌జైన్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

కర్లపాలెం ఎస్‌ఐ వేధిస్తున్నారు

ఇక్కుర్తి సుబ్బారావు, యాజలి



మాకు చెందిన 1.50 ఎకరం భూమిలో వేరు శనగ పప్పు చల్లా. నెల గడిచాక కొందరు వ్యక్తులు మా పొలాన్ని దున్నేశారు. కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాను. పట్టించుకోవడం లేదు. తిరిగి 5 క్వింటాళ్ల పప్పు కొని సాగుకు సిద్ధపడ్డాను. దాడులు చేస్తున్నారు. ఎస్సై వారితో కుమ్మక్కై మమ్మల్ని బెదురిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

కలుషిత నీటితో సాగుకు సమస్య

- రమణారెడ్డి, రైతు సంఘం నాయకుడు



మునిసిపాల్టీకి చెందిన మురుగు, వ్యర్థాలు దండుబాటలో నుంచి విజయగనర్ కాలనీ సమీపంలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో కలుస్తున్నాయి. తద్వారా గవినివారిపాలెం ఎత్తిపోతల పథకం పరిధిలోని పిట్టువారిపాలెం, విజయలక్ష్మీపురం, పచ్చమొగిలి, కొత్తవాడరేవు, బుర్లవారిపాలెం, కీర్తివారిపాలెం, పెర్లవారి పాలెం, కొత్తపేట, పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం ప్రాంతాలకు చెందిన సుమారు 5వేల ఎకరాల పంట పొలాలు దెబ్బతింటున్నాయి. వేల సంఖ్యలో మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

చీరాల మునిసిపల్ కార్యాలయంలో 'మీకోసం'

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రజా సమస్యల వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటమురళి పేర్కొన్నారు. సోమవారం చీరాల మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో జేసీ ప్రకర్ జైన్‌తో కలిసి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి అర్జీలను అందజేశారు. వీరిలో అధిక శాతం భూములకు, నివేశన స్థలాలు, హౌసింగ్, పెన్షన్‌ల సమస్యలు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గిరిజన, విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు సంబంధించి ప్రతి మూడవ శనివారం మీకోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, చీరాల పట్టణ అభివృద్ధి పనులపై మాట్లాడారు. అలాగే పట్టణంలో నివాసముంటున్న సంచారజాతులు (వేస్ట్ పిక్కర్స్) ప్రాంతాన్ని పరిశీలించి సమస్యలు తెలుసుకొని త్వరలో వారికి నివేశన స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, జిల్లా వైద్యాధికారి విజయమ్మ, జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, చీరాల వేటపాలెం తహసీల్దార్‌లు గోపీకృష్ణ, పార్వతి పాల్గొన్నారు.

వెలమవారిపాలెం తిరునాళ్లలో ఘర్షణ

మైలవరానికి చెందిన ఇరు వర్గీయుల మధ్య తోపులాట

అప్రమత్తమైన అద్దంకి పోలీసులు

ప్రస్తుతం సద్దుమణిగిన వివాదం

వైసీపీ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ నేతలపై ఎడాపెడా కేసులు

అద్దంకి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తిరునాళ్లలో మైలవరం గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో ఆ గ్రామంలో గొడవలు జరిగే అవకాశం ఉందన్న సమాచారం అందుకున్న అద్దంకి పోలీస్‌లు అప్రమత్తమయ్యారు. దీంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. వివరాలలోకి వెళితే.. బల్లికురవ మండలం వెలమవారిపాలెంలో ఆదివారం రాత్రి ఆంజనేయస్వామి తిరునాళ్ల జరిగింది. పక్క గ్రామమే కావడంతో అద్దంకి మండలం మైలవరానికి చెందిన టీడీపీ, వైసీపీ వర్గీయులు పెద్ద సంఖ్యలో తిరునాళ్లకు వెళ్లారు. అక్కడ భోజనాలు తినే సమయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం మొదలైంది. పోలీస్‌లు వారించడంతో వెనక్కి తగ్గారు. అనంతరం టీడీపీ వర్గీయులు కారులో వెళ్తూ హారన్ కొట్టారంటూ వైసీపీ వర్గీయులు ప్రశ్నించడంతో మళ్లీ వాగ్వివాదం రేగి తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. మైలవరంలో గతంలో జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి వైసీపీ వర్గీయులకు శిక్ష పడి ఉండడంతో తిరునాళ్ల ఘటనను బూచిగా చూపించి మరోసారి ఘర్షణ జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు వెంటనే మైలవరం చేరుకున్నారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఇరువర్గాలకు హెచ్చరికలు జారీ చేశారు.

పోలీసులు రాకముందే కవ్వింపు చర్యలకు సిద్ధమైన ఇరు వర్గాల వారు పోలీసుల రాకతో పరుగులుదీశారు. ఎవరికివారే ఆధిపత్యం కోసం ప్రయత్నం చేస్తుండడంతో ఏ సమయంలోనైనా గొడవలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రశాంతంగా ఉండే మైలవరం గ్రామంలో గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరించి టీడీపీ వర్గీయులపై ఎడాపెడా కేసులు నమోదు చేయించారు. ఈ క్రమంలో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీస్‌లు ప్రత్యేక దృష్టి సారించి ఇరువర్గీయులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సోమవరప్పాడులో ఇరువర్గీయుల మధ్య ఘర్షణ

సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకల సమయంలో దూషించిన వైసీపీ వర్గీయులు

బల్లికురవ మండలంలోని సోమవరప్పాడులో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. సీఎం చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ వర్గీయులు ఆదివారం సంబరాలు నిర్వహిస్తుండగా, వైసీపీ వర్గీయులు దూషించారు. ఈ విషయమై సోమవారం ఇరువర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రెండు వర్గాలకు చెందిన గోపి, నాగేశ్వరరావులు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు.

దొంగతనాలకు పాల్పడుతూ గంజాయి విక్రయించే ముఠా అరెస్ట్

నాలుగున్నర కేజీల సరకు..

రూ.10 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం

వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడుతూ, ఆ సొత్తుతో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి విక్రయించే ముగ్గురు సభ్యుల ముఠాను సింగరాయకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నాలుగున్నర కిలోల గంజాయి, రూ.10లక్షల విలువ చేసే వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గుజ్జల యల్లమందారెడ్డి నగర్‌కు చెందిన కుంచాల గురవమ్మ శనక్కాయలు అమ్ముకుంటూ జీవనం సాగించేది. దానిద్వారా వచ్చే నగదు సరిపోవడంలేదని అడ్డదారిలో సంపాదించాలనే అత్యాశతో గంజాయి రవాణా చేయడం ప్రారంభించింది. రైలులో రాజమండ్రి వెళ్లి అక్కడ గంజాయిని కిలో రూ.1,500 చొప్పు కొనుగోలు చేసి దాన్ని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి కేజీ రూ.10వేలకు విక్రయిస్తోంది. ఈక్రమంలో దొంగతనాలకు పాల్పడుతూ అక్రమంగా నగదు సంపాదిస్తున్న ఒంగోలు మండలం పేర్నమిట్టకు చెందిన చిడితోటి మధుబాబు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలేనికి చెందిన రాకూరి దుర్గారావు, తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లెకు చెందిన కళ్లెం రవికుమార్‌లకు గురవమ్మతో పరిచయం ఏర్పడింది. దొంగతనాలతో పాటు గంజాయి అమ్మకాల ద్వారా అధిక నగదు సంపాదించాలన్న దురాశతో వారు తరచూ గురవమ్మ దగ్గర గంజాయిని కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ముగ్గురు నిందితులు మధుబాబు, దుర్గారావు, రవికుమార్ గంజాయి ప్యాకెట్ల కోసం గుజ్జల యలమందారెడ్డి నగర్‌లోని గురవమ్మ దగ్గరకు వచ్చారు. ఒక్కొక్కరు కిలో గంజాయి కావాలని ఆమెను అడిగారు. ఆమె వెంటనే గోతం సంచిలో నుంచి గంజాయి ప్యాకెట్లు తీసి ఇస్తుండగా సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించి పరారవుతున్న నలుగురినీ అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా అందులో మధుబాబు, దుర్గారావు, రవికుమార్‌లు రాష్ట్రంలోని పలు జిల్లాలలో దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. వారిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం నిందితుల నుంచి రూ.10 లక్షల విలువచేసే 3 సవర్ల బంగారు ఆభరణాలు, పావు కిలో వెండి, ఇత్తడి, రాగి వస్తువులు, అమ్మవారి పంచలోహ విగ్రహం, శిలాతోరణం, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పలు జిల్లాలలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను,గంజాయి సరఫరా చేసే నిందితులను చాకచక్యంగా పట్టుకొన్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, సిబ్బందిని ఎస్పీ దామోదర్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య



స్వాధీనం చేసుకొన్న పంచలోహ విగ్రహం

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) 2023-25 బ్యాచ్ నాల్గవ సెమిస్టర్ విద్యార్థులు మంగళవారం వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రూ. 250 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ. 50 అపరాధరుసుంతో ఈనెల 27 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు నాలుగు సబ్జెక్టుల వరకు రూ. 250, రెండు సబ్జెక్టులకు రూ. 150, ఒక సబ్జెక్టుకు రూ. 125 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

ఐదు అంబులెన్స్‌లను అప్పగించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌రైజ్ సంస్థ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన ఐదు బీఎల్ఎస్ అంబులెన్స్‌లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం జిల్లావైద్యఆరోగ్యశాఖకు అప్పగించారు. ఈ అంబులెన్స్‌లను సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్, టంగుటూరు టోల్‌ప్లాజా, జాతీయరహదారి-16వారి సీఎస్ఆర్ మద్దతుతో అందించారు.

అవీఇవీ

పేలుడు పదార్థాల కేసులో చురుగ్గా దర్యాప్తు

మార్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నిషేధ పేలుడు పదార్థాల వ్యాపారం కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతోతోంది. మండలంలోని నాగరాజుపల్లికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావును ఆదివారం అరెస్ట్ చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ కేసులో మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి రెండు ప్రత్యేక పోలీసు బృందాలు వెళ్లగా, వారిలో ఒక పోలీసు బృందం ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి పోలీసులు ప్రత్యేకంగా నిఘాతో కేసులో పురోగతిని సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతేగాకుండా నాగరాజుపల్లి సమీపంలోని గొడౌన్‌లో ఉన్న అక్రమ పేలుడు పదార్థాల నిల్వలు, వాటి బిల్లులు, రశీదులు విషయంలో పలు వ్యత్యాసాలు ఉండడంతో ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అదనపు సమాచారం మరింత విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఎప్పటి నుంచి వ్యాపారం చేస్తున్నారు, ఎవరెవరు సహకరిస్తున్నారు, ఇంకెవరైనా ఇలాంటి వ్యాపారాలు చేస్తున్నారా.. పేలుడు పదార్థాలను స్వార్థానికి వినియోగిస్తున్నారా అనే అంశంపై లోతైన విచారణ చేస్తున్నట్లు తెలిసింది. రెండుమూడు రోజుల్లో పూర్తిసమాచారం సేకరించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

కొలిక్కి వస్తున్న.. రీ సర్వే

(5వ పేజీ తరువాయి)

రాగా, ఒక్క బాపట్ల జిల్లలోనే 4,115 వినతులు వచ్చాయి. వీటిలో దాదాపు 80 శాతం పరిష్కరించారు. మిగిలిన వాటి విషయంలో నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు రిఫర్ చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అదే విధంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9,500 అర్జీల్లో 75 శాతం ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిలో కసరత్తు జరుగుతుందనేది రెవెన్యూ విభాగం మాటగా ఉంది

క్లిష్టతరం.....వైసీపీ నిర్వాకమే...

గ్రామ సభలతో పాటు రెవెన్యూ సదస్సులు, ఇప్పుడు ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ఘట్టం ఇలా ప్రతి అంకంలోనూ గ్రామాల్లో సంక్లిష్టంగా ఉండే భూ వివాదాలు పదుల సంఖ్యలోనే వెలుగు చూస్తున్నాయి. వాటిపై ఓ నిర్ణయానికి రావడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే చేపట్టిన మూడు జిల్లాల గ్రామాల పరిధిలో దాదాపు 1050 సర్వే నెంబర్ల విషయంలో తుది నిర్ణయానికి రావడం అధికారులకు క్లిష్టంగా మారింది. వీటి పరిధిలో ఉన్న చిక్కులను పరిష్కరించడం యంత్రాంగానికి సవాల్‌గా మారిందది. దీనికి ప్రధాన కారణం వైసీపీ నేతలు అధికారం అండతో రికార్డులు తారుమారు చేసి మరీ భూములను చెరబట్టారు. అధికారికంగా లెక్కల్లో భూమి వారిపేరు మీద ఉంది కానీ బాధితులు మాత్రం పెద్ద సంఖ్యలో కనబడుతున్నారు. కొంతమంది రె వెన్యూ సిబ్బంది అండతో అక్రమాలను సైతం పక్కాగా రెగ్యులరైజ్ చేయించుకునే తంతు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా నడిచింది. వీటి విషయంలో తుది నిర్ణయానికి వస్తే తప్ప గ్రామాల్లో భూ రికార్డులకు గాను ఫైనల్ ఆర్‌వోఆర్ ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఇలాంటి వాటిపై కూడా ఓ విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రీ సర్వేని మమ అనిపించకుండా సదరు గ్రామాల్లో మళ్లీ భూ వివాదం అనే మాట వినపడడానికి వీల్లేదని, ఇదే సమయంలో బాధితుందరికీ న్యాయం జరగాల్సిందేనన్న పట్టుదలతో ప్రభుత్వం అడుగులేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది

ప్రమాణాలకే.. ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

మారుస్తున్నారు. దీనికి అనుగుణంగా మార్కుల కేటాయింపు చేస్తారు. పార్ట్ -1 లో ఆంగ్లం , పార్ట్ 2లో జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి తన అభిరుచి మేరకు ఏదైనా సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇంటర్ బోర్డు కల్పించనుంది.

పార్ట్ -3లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపును కూడా ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఇ టు ఇంజనీరింగ్ అటు మెడికల్ ప్రవేశ పరీక్షల్లో కూడా విద్యార్థులు పాల్గొనే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉంటే పార్ట్ 1, 2, 3లలో వచ్చిన మార్కులే పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం ప్రతి సబ్జెక్టులో 35 మార్కులు రావాల్సి ఉంటుంది. వృత్తి విద్యా కోర్సుల్లో పాస్ మార్కుల్లో వ్యత్యాసం ఉంది. ఇక ఇంటర్‌లో విద్యార్థి ఎంచుకున్న అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు అయితే మెడికల్, ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ, బయో ఇంఫర్మాటిక్స్ వంటి కోర్సులు అధ్యయనానికి ఉపయోగపడతాయని అధ్యాపకులు చెప్తున్నారు.

ప్రశ్నాపత్రంలో మార్పులు

ప్రశ్నాపత్రం విషయంలో కూడా మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ గ్రూపుల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ప్రకారం, ఆర్ట్స్ గ్రూపుల్లో హ్యూమానిటీస్ విధానాలను అనుసరించారు. సైన్స్ సబ్జెక్టుల్లో 85 మార్కులకు, ఇతర సబ్జెక్టుల్లో వంద మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రయోగ పరీక్షలకు 30 మార్కులు కేటాయిస్తారు.ఇంకా నూతన మార్పులకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీ పరీక్షలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు దోహదపడతాయని అధ్యాపకులు చెబుతున్నారు.

తెల్లబోతున్న.. జొన్న

(5వ పేజీ తరువాయి)

చూపించి కొద్దిగా రంగులో వ్యత్యాసం కనిపించినా రూ. 1700 నుంచి రూ. 1800 వరకుమాత్రమే కొంటామని, లేకుంటే తీసుకుపోవాలంటూ తిప్పి పంపతున్న పరిస్థితి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఉంటే, మరో ప్రత్యామ్నాయం రైతుల ముందుండేది. ఇప్పుడు ఏదీ లేకపోవటంతో వ్యాపారులు, దళారులు బెదిరిస్తున్నా చేసేదిలేక వారు చెప్పిన రేటుకే తెగనమ్ముతున్నారు. మరోపక్క నిల్వ ఉంచుకుందామన్నా, మొక్కజొన్నయితే పర్వాలేదు కానీ, తెల్లజొన్న ఏమాత్రం రంగు మారినా, బూజు పట్టినా రేటు విషయంలో అసలుకే నష్టం వస్తుందనే ఆలోచనతో రైతులు నిల్వ ఉంచటానికి ధైర్యం చేయటంలేదు.

జొన్నలు కొంటామని ఒకసారి.. కొనలేమని మరోసారి

జొన్నలు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తాం... రేటు లేదని ఆందోళన పడాల్సిన పనిలేదు... ఇదీ గతవారం క్రితం పౌరసరఫరాల శాఖ అధికారులు చేసిన ప్రకటన. లేదు.. లేదు.. మీ జొన్నలు మేం కొనలేం. మేమేపొరపాటు పడ్డాం. మనుషులు తినేవి కాదు కనుక మేము కొనటానికి వీలులేదంటూ రెండు రోజుల తర్వాత మరో ప్రకటన. మొదటి ప్రకటన వచ్చినప్పుడు రైతులంతా సంతోషించారు. తమ జొన్నలు రేటు లేనితరుణంలో ప్రభుత్వం కొంటుంది కనుక నష్టం ఉండదని ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. రెండు రోజుల్లోనే మరో ప్రకటన కూడా అధికారుల నుంచే విడుదలయిందని, కేంద్రం సూచించిన ప్రకారం మన ప్రాంతంలో పండించే జొన్నలు మనుషులు తినేందుకు పనికివచ్చేవి కాదని, వాటిని పరీక్షిస్తే హానికర క్రిమిసంహారకాలు పెద్ద మోతాదులో ఉన్నట్టు తేలిందని, అందువల్ల ఆ జొన్నలు కొనలేమంటూ మరో ప్రకటన చేశారని రైతులే చెబుతున్నారు. దీని ప్రకారం చూస్తే ఇకపై కొనుగోలు కేంద్రాలు రబీ పంటల కొనుగోలుకు ఉండవనేది తేలిపోయిందని, అర్ధంతరంగా ఇటువంటి నిర్ణయం తీసుకుంటే ఎట్లాగంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ. 3,460 అవసరం లేదని, కనీసం రూ. 2400 నుంచి రూ. 2600 వరకు జొన్నల నాణ్యతనుబట్టి రేటు నిర్ణయించినా చాలని వేడుకుంటున్నారు. కేంద్రాలు తెరవలేని పక్షంలో కనీస ధర అందేలా చూడాలని, ప్రభుత్వం దీనిపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోకుంటే జొన్న రైతులు అప్పులపాలు కావటమేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మినుములు, పెసలకూ మద్దతు ధర నిర్ణయిస్తే అంతటి రేటు అందుతున్న పరిస్థితిలేదు. మినుములు క్వింటాకు రూ. 7,400, పెసలు క్వింటాకు రూ. 8,682 చొప్పున మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాంతాలను బట్టి రేట్లలో వ్యత్యాసం ఉన్నా, మద్దతు ధరను అందుకున్న పరిస్థితిలేదు. వీటిపై కూడా దృష్టిపెట్టాలనేది రైతుల విన్నపం. ఏదిఏమైనా జొన్న వంటి తక్కువ విస్తీర్ణంలో సాగయిన పంటలకయినా మద్దతు ధరకు దగ్గరగా కొనుగోలు చేయగలిగితే రైతులు గట్టెక్కినట్టే. పౌరసరఫరాల శాఖ దీనిపై నిబంధనల ప్రకారం కాకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది.


ఉప్పుటూరు ప్రధాన రోడ్డులో ఉన్న డ్రేనేజీ పరిస్థితి ఇలా

స్వచ్ఛాంధ్రకు తూట్లు

గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం

పర్చూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ఈ నినాదాలు కేవలం ప్రకటనలకే పరిమితమవున్నాయని చెప్పడానికి మండలంలోని ఉప్పుటూరు గ్రామం నిదర్శనం. గ్రామాల్లో పారిశుధ్యం ఎక్కడి వేసిన గొంగళి అక్కడేలా మారింది. మురుగు కాలువల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో అందులో ఫంగస్ పేరుకుపోయి కంపు కొడుతోంది. దీంతో దోమల బెడద పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ చూసినా మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రంగుమారి తీవ్రమైన కంపు కొడుతోంది. అయినా పట్టించుకునేవారులేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ రహదారిగా మట్టిరోడ్డు

- అపరిశుభ్రంతో పాదచారులకు ఇక్కట్లు
- పట్టించుకోని గ్రామ పంచాయతీ

మార్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ పేరుతో ప్రభుత్వం గ్రామాలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేస్తుంటే మంచి రోడ్డుగా ఉన్న మట్టి రోడ్డును డంపింగ్ రోడ్డుగా మారినా పట్టించుకోవడం లేదు. ఇదీ మార్టూరు గ్రామ పంచాయతీ తీరు. మార్టూరు మంచినీటి చెరువు పక్కన సాయిబాబా వాటర్ ప్లాంట్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు ఉన్న మట్టిరోడ్డు ను కొంత మంది పనికి రాని సామాను, పడగొట్టిన ఇంటి వ్యర్థాలు, గ్రానైట్ వ్యర్థాలను పడవేయడానికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. పండుగలకు, ఫంక్షన్లకు వినియోగించిన విస్తరాకులను, ప్లాస్టిక్ గ్లాసులు తదితర వస్తువులను ఈ రోడ్డున పడేస్తున్నారు. దాంతో రోడ్డుపైన నడవాలంటే దుర్గంధంతో పాటు, వ్యర్థాలతో అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. రోజూ ఈ రోడ్డులో చెరువు కట్టపైకి వాకింగ్ కోసం వచ్చే ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు, ఆర్‌జేఏ్ సటీ కాలనీవాసులు, జూనియర్ కాలేజీకి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ నిధులతో రోడ్డుపై ఎ్రమట్టి తోలి చదును కూడా చేశారు. కానీ ప్రస్తుతం ఈ రోడ్డు పై నడవాలంటే అనారోగ్య వాతావరణం కనిపిస్తుంది. ఈ రహదారి ఇంత దారుణంగా కన్పిస్తున్నా పంచాయతీవారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.


చెరువు పక్కన ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లే రోడ్డుపై వేసిన వ్యర్థాలు


గుట్టలుగా పడవేసిన గ్రానైట్ వ్యర్థాలు


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాంప్లెక్స్ హెచ్ఎం గంగాధరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణరెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల : పేదలకు ప్రభుత్వ పాఠశాలల్లో అవకాశాలు మెండని ఎస్ఆర్ అండ్ వీఎం హైస్కూల్ ప్రధానోపధ్యాయుడు వెంకటేశ్వర్లు, సైన్స్ జిల్లా కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

పర్చూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుకు విద్య, పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ పి.దీపాదేవి కోరారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సోమవారం నెహ్రూకాలనీలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివి ఐదేళ్లు నిండిన వారిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో పాఠశాల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమారస్వామి

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌పీవో జి.కుమారస్వామి అన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై మండలం నూతలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తను సేకరించేటప్పుడు విధిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని దీనిపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె.సత్యనారాయణ, సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కేవీ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాభిప్రాయంతో ఎన్నిక మంచి సంప్రదాయం


సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగ సంఘ సభ్యులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం మంచి సంప్రాదాయం సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం అద్దంకిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్ సమావేశం సంఘ కార్యాలయంలో షేక్ మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ఈ నెల 26న గీతామందిర్‌లో అద్దంకి యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని, అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు మండలాల చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అందరు పాల్గొన్నాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో టీ కృష్ణయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కోటేశ్వరరావు, మురళీధరరావు, అంజలీదేవి, అంజయ్య, సత్యనారాయణ, సైదా పాల్గొన్నారు.

వృక్ష సంరక్షణ బాధ్యత అందరిదీ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వృక్ష సంరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో చెట్లకు నీరు పోసే కార్యక్రమం మాజీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ప్రాంగణాల్లో ఉన్న చెట్లకు పాదులు చేసి నీటిని పోశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని చరణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌వో అమర్‌నాథ్, రోటరీ అధ్యక్షుడు వీరయ్య, దేవపాలన, శ్రీనివాసరావు, మురళీసుధాకరరావు, బాబురావు, చంద్రమౌళి, పవన్, లక్ష్మిరెడ్డి, శ్రీను, శివ పాల్గొన్నారు.


మొక్కకు నీళ్లు నింపుతున్న తహసీల్దార్ శ్రీచరణ్, రోటరీ సభ్యులు

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సముచిత స్థానం

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని చవిటిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన ఎన్టీఆర్ పార్కు, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే రూ.30లక్షలతో వేసిన సీసీ రోడ్లు, రూ.78.17లక్షల ఖర్చుతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టి ఉపాధ్యాయ వృత్తిని అవమానించి వారిని మానసిక క్షోభకు గురి చేశారన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీతో 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు అత్యధిక సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. మంత్రి లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, తహసీల్దార్ కే రవిబాబు, ఎంఈవో వీ కోటేశ్వరరావు, ప్రణతి, కోమటినేని శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ సర్పంచి వల్లెపు వీరాంజనేయులు, మాజీ సర్పంచి గూళ్ల ఏడుకొండలు, టీడీపీ గ్రామ నాయకులు గంజి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేవిడ్, డ్రిల్ మాస్టర్ కృష్ణారెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


చవిటిపాలెంలో ఎన్టీఆర్ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఆదివాసీలపై దాడులు అన్యాయం

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో సహజ ఖనిజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలపై జరుగుతున్న దాడులు అన్యాయమని పలు సంఘాల నాయకులు అన్నారు. సోమవారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు మాచర్ల మోహన్‌రావు, వైహెచ్‌వీఎస్ నాయకులు మోహనకుమార ధర్మ, వెంకటేశ్వర్లు, హరిహరరావు, విమలాకర్, గుంటూరు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

తిరగబడ్డ కారు.. ఇద్దరికి గాయాలు


తిరగబడ్డ కారు

పంగులూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలవలపాడు అడ్డ రోడ్డు సమీపంలో కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి బిహార్ వెళ్తున్న కారు ముందు టైరు బరెస్ట్ కావడంతో రోడ్డు మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మెలను ఢీకొని బోల్తా పడింది. సోమవారం అలవలపాడు అడ్డ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ జి.మురళీధరన్ (వేలూరు)తో పాటు అందులో ప్రయాణిస్తున్న శశికళ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్‌కి తరలించారు.


శిక్షణ సర్టిఫికెట్లతో కేజీబీవీ విద్యార్థినులు

కేజీబీవీ విద్యార్థినులకు వృత్తి శిక్షణ సర్టిఫికెట్లు

బల్లికురవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో ఈ ఏడాది వృత్తి శిక్షణ పొందిన విద్యార్థినులకు సోమవారం సమగ్ర శిక్ష ద్వారా వచ్చిన సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ కె.సరళకుమారి అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాలయంలో చదువుతో పాటు బాలికలకు వృత్తి శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామని తెలిపారు. 10, ఇంటర్ విద్యార్థినులు 56 మందికి ఒకేషనల్ ట్రైనర్ శిరీష పర్యవేక్షణలో 80 గంటల పాటు మార్టూరులోని అమరావతి టెక్స్‌టైల్స్‌లో శిక్షణ ఇచ్చామని, వారికి సమగ్ర శిక్షా ద్వారా వచ్చి సర్టిఫికెట్లను అందజేశామని ఆమె తెలిపారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో బాల్య వి వాహాలు జరగకుండా ఆయా శాఖల వారు చూడాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహించి బాల్య వివావాహాల పట్ల నిరోధం పట్ల అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేయకుండా కిశోరబాలికల తల్లిదండ్రులకు మహిళా పోలీస్, అంగన్‌వాడీ, ఏఎన్ఎం ఇతర సభ్యులు అ వగాహన కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

శరవేగంగా కాలువకు మరమ్మతు పనులు

పంగులూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పమిడిపాడు మేజర్‌లో కాలువ మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పమిడిపాడు మేజర్‌తో పాటు ఆ మేజర్‌కు అనుబంధంగా పంగులూరు, అద్దంకి, కొరిశపాడు, ఇంకొల్లు మండలాల విస్తరించి ఉన్న 8 మైనర్లలో ఈ కాలువ మరమ్మతు పనులకు ఎన్ఎస్‌పీ అధికారులు 80 లక్షల వ్యయ అంచనాతో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవ, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో నిధులు కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. పంగులూరు డీసీ ఛైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణలో ఐదు ఎక్స్‌కవేటర్లతో మేజర్‌పై చిల్ల చెట్ల తొలగింపు, పూడిక తీత పనులు వేగంగా జరుగుతున్నాయి. నాలుగు మండలాల పరిధిలో 150 కిలోమీటర్ల విస్తీర్ణంలో పలు ప్రాంతాల్లో ఉన్న మేజర్, మైనర్ కాలువలలో మరమ్మతులు చేస్తున్నట్లు డీసీ ఛైర్మన్ తెలిపారు.


పమిడిపాడు మేజర్‌లో ఎక్స్‌కవేటర్‌తో చేపట్టిన కాలువ మరమ్మతులు



వేటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ముస్లింల ర్యాలీ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింల అభ్యున్నతి అంధకారంలో పడుతుందని వెంటనే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు, మత పెద్దలు అన్నారు. సోమవారం వేటపాలెంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కుతంత్ర ధోరణితోనే చట్టాన్ని అమలులోకి తెస్తున్నట్లు ఆరోపించారు. డీటీ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సామాజిక వర్గం ప్రజలు పాల్గొన్నారు.

బల్లికురవ : కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సోమవారం ముస్లింలు శాంతి ర్యాలీని నిర్వహించారు. మసీద్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, తక్షణమే చట్టాన్ని రద్దు చేయలాని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యామిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

మార్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల మండల స్టాక్ పాయింట్ గదులను సోమవారం జిల్లా సమగ్ర శిక్షా అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లను జాగ్రత్తగా విద్యార్థులకు అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీఎంవో శ్రీనివాసరావు, ఎంఈవోలు వస్రాంనాయక్, కె ప్రేమలత, హెచ్ఎం రూత్ మెర్సీ, సీఆర్పీలు రామారావు, రమేష్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

పంగులూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం ఫ్లైఓవర్‌పై కారు బైకును ఢీకొన్న ఘటనలో గాయపడ్డ జంపు శంకరరావు (55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పంగులూరు గ్రామానికి చెందిన శంకరరావు మార్టూరు కూరగాయల మార్కెట్లో రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 10న పని ముగించుకుని మార్టూరు నుంచి పంగులూరుకు బైక్‌పై వస్తుండగా ముప్పవరం ఫ్లై ఓవర్ వద్ద కారు బైకును ఢీకొట్టింది. తలకు గాయమైన శంకరరావును 108లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సనందిస్తుండగా ఆదివారం మృతి చెందారు. శంకరరావుకు భార్య, వివాహం అయిన కుమార్తె, బీటెక్ చదువుతున్న కుమారుడు సంతానం.

హత్య కేసులో భర్త అరెస్ట్

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భార్య మంగమ్మను గడ్డపారతో హత్య చేసిన భర్త నీలం శ్రీనివాసరావును సోమవారం యద్దనపూడి మండలం యనమదల గ్రామం ప్రధానసెంటర్‌లో అరెస్టు చేసినట్లు ఎస్ఐ టీ రత్నకుమారి తెలిపారు. యద్దనపూడి మండలంలోని యనమదలలో శనివారం అర్ధరాత్రి భార్య మంగమ్మను భర్త శ్రీనివాసరావు గడ్డపారతో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు.మంగళవారం అతనిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా


కారంచేడు వద్ద బోల్తాపడిన శనగ కాయల లోడు ట్రాక్టర్

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు నుంచి పర్చూరు వైపు వస్తున్న వేరు శనగ కాయల లోడుతో వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన సోమవారం వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో చోటుచేసుకుంది. లోడుతో ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా రోడ్డు మార్జిన్‌లో వరిగిపోయి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న వేరుశనగ బస్తాయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై ఉన్న శగన బస్తాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకించారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు


ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉన్న మహిళను వేధిస్తున్న వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గవినివారిపాలెంకు చెందిన నక్కల వెంకటేశ్వర్లు అదే ప్రాంతానికి చెందిన ఒంటరి మహిళను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ పరిధిలోని రైల్వేగేటు పక్కనే గల పొలాలలో సోమవారం వెలుగుచూసింది. స్థానికులు, ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన సమాచారం మేరకు.. రాజుబంగారుపాలెం గ్రామ సమీపంలోని రైల్వేగేటు పక్క పొలాల్లో ఉన్న పూరి గుడిసెలో ఉరేసుకొని కొండలు(30) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కే.గంగిరెడ్డి పొలంలో ఉన్న పూరిగుడిసెలో మూడేళ్లుగా కొండలు ఉంటున్నాడు. గ్రామంలో యాచించుకున్న డబ్బులతో జీవిస్తూ ఉంటాడు. కొద్దిరోజుల కిందట భార్య కుమారినితో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లిన స్థానికులకు పూరిగుడిసె నుంచి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల కిందట చనిపోయినట్లు భావిస్తున్నారు. వీఆర్వో పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఇంకొల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కలిపించాలని కోరుతూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటరత్నంకు విపతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు చిన్నిపూర్ణారావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.





ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.4	28.4
కావలి	37	27
ఆత్మకూరు	39	25
ఉదయగిరి	39	26
కందుకూరు	36	27

పసిడి ధర పైపైకి!

● రోజురోజుకి పెరుగుతున్న బంగారం రేట్లు ● పది గ్రాములు రూ.90వేలు పైమాటే!

ప్రపంచ పరిస్థితులే కారణమంటున్న వ్యాపారులు

బంగారం అనేది ఓ ఆస్తి. దాన్ని పెట్టుబడికి, భవిష్యత్ అవసరాల కోసం వినియోగిస్తారు. అందుకనే సామాన్యుడి నుంచి కోటేశ్వరుల వరకు బంగారంపై పెట్టుబడులు పెడుతుంటారు. అయితే, ఇప్పుడు బంగారం గురించి మాట్లాడడానికి కూడా ధైర్యం చాలడం లేదు. మొన్నటి వరకు 10 గ్రాముల (24 క్యారెట్లు) బంగారం ధర రూ.90వేలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా రూ.లక్షకు ఎగబాకింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు బంగారం ధర 26 శాతం పెరిగింది.



నేడు బంగారం 24 క్యారెట్లు 10గ్రాములు రూ.96,590 ఉండగా, దానికి మూడు శాతం జీఎస్టీ కలిపితే రూ.99,488 అవుతుంది. ఏప్రిల్ 2న 10గ్రాములు 24 క్యారెట్లు ధర రూ.94వేలు, ఏప్రిల్ 9కి తగ్గుతూ వచ్చి రూ.90,960కి చేరింది. ఏప్రిల్ 10 నుంచి నేటి వరకు బంగారు ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

● ప్రపంచ పరిస్థితులే కారణం

వ్యాపార వర్గాల మాటల్లో చెప్పాలంటే ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో ఒడుదొడుకుల కారణంగా బంగారం ధర ఆకాశాన్ని అంటిందన్నారు. చైనా కొన్ని నెలలుగా డాలర్లకు బదులు బంగారం నిల్వలు పెంచుతోంది. అమెరికా వాణిజ్య విధానాలతో పన్నుల మోత కారణంగా అగ్రదేశాలతోపాటు చిన్న చిన్న దేశాలు సైతం ఆర్థిక ఒడుదుడుకులకు గురవు తున్నాయి. బంగారం అవసరంలేని దేశాలు కూడా బంగారాన్ని నిల్వ చేయడంతో డిమాండ్ పెరిగింది. అంతేకాక భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తలు చోటుచేసుకున్న రష్యా, ఉక్రెయిన్, ఇరాన్, ఇరాక్, దేశాల మధ్య యుద్ధాలు కూడా కారణమవుతున్నాయి.

స్టాక్ మార్కెట్‌లో అస్థిరత, అనిశ్చితలు ఏర్పడడంతో పెట్టుబడుదారులు బంగారంపై పెట్టుబడికి ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో 2025 ప్రారంభం నుంచే బంగారం వ్యాపారం డీలా పడింది. ధరలు తేడాలు రావడంతో వ్యాపారాలు తీవ్రనష్టాలకు గురవుతున్నారు. కొంతమంది చిన్న, మధ్య తరగతి బంగారు వ్యాపారులు దుకాణాలే తెరవడంలేదు.

● తగ్గిన కొనుగోళ్లు

ప్రస్తుతం పెళ్ళిళ్ల సీజన్ అయినా ప్రజలు బంగారు నగలు కొనడం తగ్గించేశారు. వధూవరులు బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుని, దానికి బదులు నగదు తీసుకుంటున్నారు. జిల్లాలో రైతుల పంటలకు ధరలు తక్కువగా ఉండడం కూడా బంగారం కొనుగోళ్ల తగ్గుదలకు కారణమయింది. అక్షయ తృతీయ తదితర పండుగలకు కూడా గత నాలుగేళ్లుగా కార్పొరేట్ దుకాణాల లోతప్ప ఇతర బంగారు అంగళ్లలో కొనుగోళ్ళ, తక్కువగా జరుగుతున్నాయి. బంగారం నగలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు గోల్డ్ కవరింగ్, వెండి ఆభరణాల కొనుగోళ్లపై ఆసక్తి కనపరుస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య, (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశా లకు మే 15వతేదీలోగా cse.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈ వో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ప్రస్తుత చిరునామా కోసం తల్లిదండ్రుల ఆధార్, ఓటరు కార్డు, రేషన్‌కార్డు, భూమి హక్కు పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, కరెంట్‌బిల్లు, అద్దె ఒప్పందపత్రంతోపాటు పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. అలాగే సీబీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు 2025 మార్చి 31నాటికి ఐదు సంవత్సరాలు, రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ పాఠశాల్లో ప్రవేశాలకు జూన్ 1 నాటికి ఐదేళ్లు పూర్తయి ఉండాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయా డేటా ఆధారంగా మే 16 నుంచి 20వతేదీ వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తామ న్నారు. లాటరీ ద్వారా తొలి విడత ఫలితాలను మే 21 నుంచి 24వతేదీ మధ్య విడుదల చేస్తామన్నారు. సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న చేసి, ఫలితాలను జూన్ 6న విడుదల చేస్తామని తెలిపారు.

24న కోవూరు షుగర్స్ సమావేశం

కోవూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కోవూరు సహకార చక్కెర కర్మాగారం భూమిని ఏపీఐఐసీకి కేటాయించాన్ని నిరసిస్తూ ఈ నెల 24వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు చెరకు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి గండవరపు శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని సీతా పోలయ్య భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 124 ఎకరాల విస్తీర్ణంలోని చక్కెర కర్మాగార భూమిని హస్తగతం చేసుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఏపీఐఐసీకి ఫ్యాక్టరీ స్థలం కేటాయించడాన్ని నిరసనగా జరిగే ఈ సమావేశానికి చెరకు రైతుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్రన్, రాష్ట్రకమిటీ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. కాబట్టి రైతులు, షేర్‌హోల్డర్లు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మూలి వెంగయ్య, మారుబోయిన సుబ్బారావు, గండవరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

1న సీఎం చంద్రబాబు రాక

ఆత్మకూరులో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి

ఆత్మకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1వ తేదీన ఆత్మకూరుకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో సోమవారం ఆర్డీవో బి పావని, డీఎస్పీ వేణుగోపాల్, సీఐ జి గంగాధర్, మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ తదితరులు ఆత్మకూరులో హెలిప్యాడ్‌ను, నారంపేట వద్ద ఉన్న ఇండస్ట్రీయల్ పార్కు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆత్మకూరు సమీపంలోని నారంపేట వద్ద ఉన్న ఇండస్ట్రీయల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

ఆర్ఐవో శ్రీనివాసులు బదిలీ

చిత్తూరు డీఐఈవోగా పదోన్నతి ● జిల్లా డీఐఈవోగా సుబ్బారావు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఐఓ(ఎఫ్ఏసీ), డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆదూరు శ్రీనివాసులు బదిలీ అయ్యారు. చిత్తూరు డీఐఈఓగా పదోన్నతి కల్పించి కడప ఆర్జేడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. డీకేడబ్ల్యూలో 2021 నుంచి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు 2023 జూన్ 14 నుంచి ఆర్ఐఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి ఇంటర్ విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు చేపట్టడంతోపాటు పరీక్షలను కూడా విజయవంతంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈఓ)ల పోస్టులను మార్పు చేస్తూ నూతనంగా డీఐఈఓగా మార్పు చేస్తూ పలువురికి పదోన్నతులు కల్పించి కొత్త పోస్టింగ్‌లు ఇచ్చారు. పదోన్నతుల్లో భాగంగా జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ)గా వీవీ.సుబ్బారావు నియమితులయ్యారు. బాపట్ల జిల్లా అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జోన్-3 ఆర్జేడీ(ఎఫ్ఏసీ)గా, పరీక్షల నియంత్రణ అధికారి(ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న వీవీ.సుబ్బారావుకు పదోన్నతి కల్పించి, నెల్లూరు డీవీఈఓగా బదిలీ చేశారు. డీఐఈఓగా ఆయన పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తూనే ఇంటర్‌బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో డీవీఈఓ(ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న మధుబాబును తిరిగి ఇనమడుగు ప్రిన్సిపాల్‌గా వెనక్కు పంపించారు. ఆర్ఐఓగా మాత్రం ఎవరినీ నియమించలేదు. పదోన్నతుల పొంది బదిలీ అయిన అధికారులంతా వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జిల్లా నూతన డీఐఈవో సుబ్బారావు

గ్రావెల్ మాఫియాకు చెక్!

● గ్రామస్థుల ఫిర్యాదుతో రంగంలోకి ఎమ్మెల్యే ● నేరుగా తవ్వకాల ప్రాంతానికి కాకర్ల
● వాహనాల సీజ్.. అధికారుల తీరుపై ఆగ్రహం
● ఉదయగిరిని వీడాలని మాఫియాకు హెచ్చరిక

ఆయన ఓ ఎమ్మెల్యే. తమ గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తరలించి కొండను పిండి చేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అంతే, బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఎవరికీ చెప్పకుండా గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలను వెంబడించి అనంతరం అధికారులకు ఫోన్ చేసి సీజ్ చేయించిన ఘటన వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకొంది.

- వివరాలు 8లో..



నల్లగొండలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

పశువులకు కష్టకాలం!

అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బందే ● పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

వేసవి వచ్చిందంటే పాడిపరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులతో పశువులు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. అంతేకాక సరైన ఆహారం, నీరు అందక పశువుల ఆరోగ్యం దెబ్బతింటుంది. అధిక వేడి కారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రతలు పెరగడంతో తీవ్ర అసౌకర్యానికి గురై తద్వారా పాల దిగుబడి తగ్గుతుంది. ఈ సీజన్‌లో దాదాపు 30శాతం మేర పాల దిగుబడులు తగ్గుతున్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే పాల ఉత్పత్తి మెరుగు పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు వాటిని పాటించి పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లాలో 6,46,088 నల్ల పశువులు, 57,774 తెల్ల పశువులు ఉన్నాయి. వీటిలో దాదాపు పాలు ఇచ్చేవి 5,96,393 నల్ల పశువులు, 47,131 తెల్ల పశువులు మాత్రమే. సాధారణ పరిస్థితుల్లో తెల్ల పశువులు సరాసరి 5 నుంచి 7లీటర్ల వరకు, నల్ల పశువుల నుంచి 5 నుంచి 10లీటర్ల వరకు పాల ఉత్పత్తి ఉంటుంది. ఈక్రమంలో జిల్లాలో ఒక్కరోజులో సరాసరి పాల దిగుబడి 25.34 లక్షల లీటర్లని పశుసంవర్ధక శాఖ అంచనా. అయితే వేసవిలో తీవ్రమైన ఎండతోపాటు వడగాల కారణంగా పాలఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కో పశువు అనుకూల వాతావరణంలో ఇచ్చే పాలఉత్పత్తి కంటే లీటరు నుంచి 2లీటర్ల వరకు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. అయితే వేసవిలో సహజంగానే 30 శాతం వరకు పాల ఉత్పత్తి తగ్గుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్క రోజులో వచ్చే పాల దిగుబడితో పోలిస్తే సుమారు 7.6 లక్షల లీటర్ల వరకు ఉత్పత్తి తగ్గుతోంది. ఒక లీటరు పాలు సరాసరిన రూ.60 నుంచి రూ.90 వరకు బహిరంగ మార్కెట్‌లో ధర పలుకుతోంది.

● ఎదకొచ్చే సమయం...

పశువులు ఎక్కువగా వేసవిలోనే ఎదకు వస్తాయి. ఎండ దెబ్బ తగిలితే చూలు నిలవదని జాగ్రత్తగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. అంతేగాక పాల ఉత్పత్తి కూడా తగ్గుతుందని చెబుతున్నారు. అధిక పాల ఉత్పత్తి ఇచ్చే సంకర జాతి పశువులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. దీంతో పాల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ సమయంలో పశువులకు రక్షణ కల్పిస్తూ తగినంత నీరు అందుబాటులో ఉంచాలి. అదేవిధంగా పశుగ్రాసం కొరత లేకుండా చూసుకోవాలని ముఖ్యంగా పచ్చిమేత అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులు తెలియజేశారు.

● పాలు పితికే సమయం

వేసవిలో ఉదయం ఉష్ణోగ్రతలు పెరగక ముందు, సాయంత్రం ఉష్ణోగ్రతలు తగ్గిన తరువాత పాలు పితకడం వల్ల పశువుల నుంచి ఎక్కువ పాల ఉత్పత్తి పొందవచ్చు. అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ఖనిజ లవణ మిశ్రమాన్ని 30 నుంచి 50గ్రాముల దాణాలో ఇవ్వాలి. ఖనిజ లవణ మిశ్రమాల దిమ్మెలను పశువుల కొట్టాల్లో అందుబాటులో ఉంచాలి. గడ్డిని ముక్కలుగా కోసి వేయడం వల్ల త్వరగా జీర్ణమవుతాయి. అదేవిధంగా పశువులకు రాత్రి పూట మేతను వేయడం వల్ల ఎక్కువ తింటాయి. పగలు నెమరు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా పగటి వేడిని తట్టుకోగలవు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)





ముక్కలుగా కత్తిరించిన పచ్చిగడ్డి మేలు

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు పశువులు తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. జీర్ణశక్తి, నీటి వినియోగం మారడం వల్ల సాధారణ కాలం కంటే పాల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకునే అవకాశం ఉంది. ఉదయం 10గంటలలోపు సాయంత్రం 5గంటల తరువాత పశువులను మేతకు వదలడం మంచిది. అదేవిధంగా షెడ్ల చుట్టూ గోనె సంచులు కట్టి చల్లని నీటితో తడుపుతూ ఉండాలి. సంకరజాతి పశువుల షెడ్లలో తప్పనిసరిగా ఫ్యాన్లు ఉంచాలి. షెడ్లలో వాతావరణం చల్లగా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. పశువులకు తగినంత నీరు, నాణ్యమైన పశుగ్రాసం అందించడం ఎంతో ముఖ్యం. వీటివల్ల పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుంది. పశువైద్యులు కూడా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించేలా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- రమేష్ నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ

పగలు పచ్చిగడ్డి, రాత్రి ఎండుగడ్డి



సాధారణ రోజుల్లో పశువులకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరం లేదు. కానీ వేసవిలో మాత్రం పరిస్థితులు చాలా మారిపోతాయి. పగలంతా చెట్ల కింద బాగా గాలి తగిలే ప్రాంతంలో ఉంచుతాను. రాత్రి షెడ్లకు దోమతెరలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తాను. పగలు పచ్చిగడ్డి, రాత్రిపూట ఎండుగడ్డి వేస్తున్నాను. ముక్కలుగా కోసి వేయడం వల్ల పశువులకు త్వరగా జీర్ణమవుతుంది. ప్రతిరోజూ దాణా తప్పనిసరి. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా 10లీటర్లు పాలిచ్చే పశువు నుంచి దాదాపుగా లీటరు నుంచి ఒకటిన్నర లీటరు వరకు తగ్గుతోంది.

- కొప్పోలు దేవదాసు, లేబూరు, ఇందుకూరుపేట

ఎవరేమన్నా మా తీరు మాదే!

● సమస్యల వలయంలో పెద్దాసుపత్రి ● కలెక్టర్ సూచనలు పాటించని అధికారులు
● నాలుగు నెలలైనా ఎక్కడ పనులు అక్కడే.. ● నేడు జీజీహెచ్ అభివృద్ధిపై సమీక్ష

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య వరప్రసాదిని, జిల్లాకే తలమానికమైన నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలను (జీజీహెచ్) సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీటి పరిష్కారానికి కలెక్టర్ పలు సూచనలు చేసి నాలుగు నెలలు పూర్తయినా, నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరగనుంది. ఈసారైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా అని అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది ఆశగా ఎదురుచూస్తున్నారు.

గతేడాది డిసెంబరు 18న జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. 15 రోజుల్లో మార్పు రావాలని కలెక్టర్ ఆనంద్ సూచించినా ఆ మార్పు రాలేదు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ నిధులు రూ. 2 కోట్లు ఆసుపత్రి అభివృద్ధికి వాడుకోవాలన్నా ఇప్పటికీ అతీగతీలేదు. వైద్యులు సమయపాలనపై అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో 750 పడకలు ఉన్నా రోగులకు అందిస్తున్న సేవలపై వైద్యులు, సిబ్బంది తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫిజియోథెరపీ విభాగంలో అవసరమైన పరికరాలు లేనందున రోగులను వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ కాంపొజిట్ రీజనల్ సెంటర్(సీఆర్‌సీ) సెంటర్‌కు పంపించాలన్నారు. ప్రతి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గత సమావేశంలో నిర్ణయించారు. అయితే వాటిని పాటించే విధానంలో ఇంకా నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఆసుపత్రిలో ఏసీలు ఉన్నా సక్రమంగా పనిచేయటం లేదు. ఇక లిఫ్టల పరిస్థితీ అంతే. ఆయా సమస్యల పరిష్కారంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించలేదన్న విమర్శలు లేక పోలేదు. ఈ నేపథ్యంలో మంగళారం జరిగే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకోనున్నారో వేచి చూడాల్సిందే.



పథకాలు అందుతున్నాయా?

● ఇంకా ఏమైనా మార్పు, చేర్పులు చేయాలా!?
● పాడిరైతుల నుంచి వివరాల సేకరణ
● 40 ప్రశ్నలతో ఆన్‌లైన్ సర్వే ప్రారంభం
● పాడిపరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : 'ప్రభుత్వం నుంచి పాడి రైతులు ఏం కోరుకుంటున్నారు? ఏమేరకు వారికి పథకాలు ఉపయోగపడుతున్నాయి.. పథకాల్లో ఏవైనా మార్పులు చేయాల్సి ఉందా!? ఎంతమంది ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు!? వంటి సమచారాన్ని రైతుల నుంచి సేకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆన్‌లైన్ సర్వే ప్రారంభమైంది. ఒక్కో మండలానికి ఐదుగురు ఎన్యుమరేటర్లను నియమించి, సర్వే ఎలా చేయాలో శిక్షణ కూడా వారికి ఇచ్చారు. ఆయా మండలాల పశువైద్యుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 7వేల మంది పాడిరైతులు, పొదుపు మహిళలు, వ్యవసాయ రైతులతో ఎన్యుమరేటర్లు చర్చించనున్నారు. ఒక్కో మండలంలో సుమారు 189 మందిని కలిసి ప్రభుత్వం అందించిన 40 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టనున్నారు. 25వ తేదీ కల్లా సర్వే పూర్తి చేసి, ఆ వివరాలను జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదికను చేరవేయనున్నారు.



కొత్తూరులో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు



లింగసముద్రంలోని బీసీ బాలికల వసతి గృహం

న్యూస్ బాక్స్

గర్భిణుల ఇళ్లకు వెళ్లి పోషకాహారం అందించాలి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని గర్భిణులకు వారి నివాసాలకు వెళ్లి క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవమ్మ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల సంరక్షణ, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని పేర్కొన్నారు. పోషణ ట్రాకర్ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేసుకుని బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి సరైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.మాధవి, ఎం.బేబీరుఖాన్సీ, వై.స్వాతి, డి.అనూష, బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు విధిగా చేయించుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రైతులంతా విధిగా భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా ఎరువులు వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి.రాము కోరారు. మండలంలోని పలుకూరు, మహదేవపురం గ్రామాలలో సోమవారం భూసార పరీక్షలు, వరికి ప్రత్యామ్నాయంగా పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 984 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వేసవిలో బోర్లు ఆధారంగా వరిసాగు చేసే రైతులు లాభసాటిగా ఉంటే తక్కువ కాలం పంటలైన మినుము, పెసర పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బ్రాహ్మణి, షేక్ నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడిక తీయించిన టీడీపీ నేత

కొండాపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలదీవి పంచాయతీలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను గ్రామ టీడీపీ యువ నాయకుడు ఓరుగంటి మార్కండేయులు సోమవారం తన సొంత నిధులతో తీయించారు. ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మురుగు కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోవడంతో నీరు ప్రవహించకుండా నిలిచిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతూ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో సొంత నిధులతో శుభ్రం చేయిస్తున్నానన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కావలి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నంగిదిన్నె పంచాయతీలోని తుమ్మలపెంట రోడ్డులో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు మోర్ల అమరావతి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎమ్పీడీవో శ్రీదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత, స్థానిక టీడీపీ నాయకులు మోర్ల వెంకట్రావు, యాకోబు, వెంకయ్య, శ్రీహరి, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ కమిటీ అధ్యక్షుడిగా బర్నాడ్

బిట్రగుంట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ కమిటీ నూతన అధ్యక్షుడిగా బర్నాడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో జరిగిన సభ్యుల సమావేశంలో అధ్యక్షుడు స్వర్ణన్‌రాజ్, గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కోశాధికారిగా మన్యం శ్రీనివాసులు, కొందరు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వాకర్స్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 8 అర్జీలు

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దగదర్తి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందజేశారని తహసీల్దారు టీ.కృష్ణ తెలిపారు. పలు గ్రామాలకు చెందిన రైతులు చుక్కల భూముల సమస్యలు, వారసత్వంగా వచ్చిన భూములకు పాస్‌పుస్తకాల కోసం వినతులు అందచేసినట్లు ఆయన తెలిపారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ఠ!



బీసీ బాలుర వసతి గృహం గదిలో ఊడిపడుతున్న శ్లాబు పెచ్చులు

లింగసముద్రం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగసముద్రంలోని బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. అన్ని హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్లే విధులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడింది. గత వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక వసతుల గురించి పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహంలోని ప్రతి గదిలో శ్లాబు పెచ్చులూడి కింద పడడంతోపాటు ప్రతి గది వర్షానికి ఉరుస్తోంది. దీనిపై విద్యార్థులు ఆందోళన చెందడంతో ఇటీవల ఈ వసతి గృహాన్ని బీసీ సంక్షేమశాఖ అధికారులు స్థానిక బలిజపాలెంలోని అద్దె భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టారు. అయితే కేవలం సామగ్రిని మాత్రమే మార్చి విద్యార్థులు ఈనెల 23వ తేదీ వరకు పాత భవనంలోనే ఉంటారని, వేసవి శెలవుల అనంతరం జూన్ నెలలో విద్యా సంవత్సరం ఆరంభం నుంచి అద్దె భవనంలో ఉంటారని అధికారులు అంటున్నారు. అలాగే ఎస్సీ బాలుర వసతి గృహంలోనూ సమస్యలకు కొదువే లేదు. ఇక్కడ గదులకు తలుపులు, కిటికీలు లేవు. మరుగుదొడ్లు, బాతురూంలకు గతంలో నీటి వసతి కల్పించ లేదు. విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళుతున్నారు. ఫలితంగా అవి వినియోగించకనే శిథిలావస్థకు చేరాయి. అలాగే కొన్ని గదులు కూడా వర్షానికి ఉరుస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీసీ బాలికల వసతి గృహంలో కూడా సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ వసతి గృహంలోనూ కొన్ని గదులు వర్షం వస్తే ఉరుస్తున్నాయి. కొన్ని గదుల్లో శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. మరుగుదొడ్ల నుంచి నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అయితే ఈ వసతి గృహంలో ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించేందుకు తాత్కాలికంగా మరమ్మతు పనులు చేయిస్తున్నారు.

● మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్లే దిక్కు!

గత కొన్నేళ్ల నుంచి బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాలకు ఇన్‌చార్జి వార్డెన్లే విధులు నిర్వహిస్తున్నారు. బీసీ బాలుర వసతి గృహానికి మండలంలోని పెదపవని బీసీ హాస్టల్ వార్డెన్, బీసీ బాలికల హాస్టల్‌కు కందుకూరులోని బీసీ బాలికల కళాశాల హాస్టల్ మ్యాట్రిన్ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌కు గుడ్లూరులోని ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరు వారానికి ఒకటి రెండు సార్లు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. దీంతో ఆయా హాస్టళ్ల బాలుర, బాలికలపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంలోనైనా రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని విద్యార్థిని, విద్యార్థుల తలిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం బాతురూంలు, మరుగుదొడ్లు

ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతులకు నిధుల మంజూరు

లింగసముద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మరమ్మతులకు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి రూ.8 లక్షలు మంజూరయ్యాయని కందుకూరు ఆర్‌అండ్‌బీ ఏఈ షేక్ మహమ్మద్ బాషా తెలిపారు. ఈ హాస్టల్‌లో చాలా ఏళ్ల నుంచి బాతురూంలు, మరుగుదొడ్లకు నీటి వసతి లేక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. అంతేకాక గదులకు కిటికీ రెక్కలు, తలుపులు లేక పోవడం. మంచినీటి పైపులు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వసతి గృహం ప్రహరీ ఇనుప గేటు విరిగి పోవడంతో వసతి గృహంలోకి పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. వీటన్నింటిని కొత్తవి ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇవి కాక విద్యార్థులు స్నానాలు చేసే చోట కుళాయిల ఏర్పాటు, వర్షానికి తడవకుండా పందిరి ఏర్పాటు, సింటెక్స్ మంచినీటి ట్యాంకులు ఏర్పాటు, చదువుకొనే చోట ప్లాటుఫారం, లైట్లు ఏర్పాటు చేస్తారని, అలాగే అవసరమైన చోట విద్యుత్ వైరింగ్ చేయిస్తామని చెప్పారు. ఈ పనులు రెండు మూడు రోజులలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు గాయత్రీనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ కాలువకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ గణపతి, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, నాయకులు దామా మల్లేశ్వరరావు, గుర్రం మాల్యాద్రి, కంద్రా మాల్యాద్రి, పెంట్రాల సుబ్బారావు, పొడపాటి నాగేశ్వరరావు, గుర్రం మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

● కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో రజని



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రజని

కందుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి సకాలంలో టీకాలు వేయాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బందిపై ఉందని కందుకూరు డివిజన్ ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు రజని సూచించారు. పట్టణంలోని నక్షత్ర ఐటీ జేఈఈ అకాడమీ క్యాంపస్‌లో పట్టణంలోని రెండు పీహెచ్‌సీలు, మాచవరం పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందికి సోమవారం హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం, రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు రమేష్, డాక్టరు రాకేష్, సీహెచ్‌వో శ్రీనివాసులు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల స్వయం ఉపాధికి 26 యూనిట్ల మంజూరు

కావలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకం కింద 2025-26 సంవత్సరానికి కావలి పురపాలక సంఘం పరిధిలో రూ.107.50 లక్షలతో 26 యూనిట్లు మంజూరైనట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావలి పురపాలకసంఘ పరిధిలో ఆసక్తికల షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు మే నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. దీనిపై ఏమైనా సందేహాలు ఉంటే సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బోగస్ మస్టర్లు వేస్తే కఠిన చర్యలు

● ఏపీడీ బాబురావు



వెంగళాపురంలో ఉపాధి హామీ కూలీల మస్టర్ తనిఖీ చేస్తున్న కందుకూరు ఏపీడీ బాబురావు

లింగసముద్రం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు బోగస్ మస్టర్లు వేసి అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ పథకం కందుకూరు అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ జే.బాబురావు హెచ్చరించారు. ఎర్రారెడ్డిపాలెం పంచాయతీలోని వెంగళాపురంలో జరుగుతున్న కాలువ, కుంట పూడికతీత పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరుగుతున్న పనులకు 60 మంది చొప్పున 120 మంది కూలీలు పనులకు హాజరు కాగా వారిలో ఒకరికి బదులు మరొకరు వచ్చిన 20 మందిని గుర్తించి వారిని పనుల నుంచి వెనక్కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఇలా ఒకరికి బదులు మరొకరు పనులకు రాకూడదని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డు లేకపోతే 24 గంటల్లో జాబ్‌కార్డు ఇప్పిస్తామన్నారు. పనులకు రాని వారికి మస్టర్లు వేస్తే పని చేసే కూలీలకు నష్టం కలిగి తక్కువ కూలి వస్తుందని చెప్పారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో విజయవాడలో ఉంటున్న కొందరికి బోగస్ మస్టర్లు వేసి అవినీతికి పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన వారు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవానికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారని, దీంతో ఆమె ఆదేశాల మేరకు పనుల తనిఖీకి వచ్చినట్లు ఆయన చెప్పారు. మంగళవారం కూడా ఎర్రారెడ్డిపాలెంలో పనులను తనిఖీ చేసి నివేదికను పీడీకి పంపిస్తామని తెలిపారు.

బీటెక్ విద్యార్థినికి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు



ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు అందుకుంటున్న విద్యార్థిని సాయిలక్ష్మీప్రియంవద

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ పీ. సాయిలక్ష్మీప్రియంవద ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు అందుకున్నారని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ప్రియంవద ఫైరింగ్, డ్రిల్‌టెస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూలలో విశేష ప్రతిభ కనబరచటం ద్వారా ఈ అవార్డు దక్కించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. 34(ఏ) బెటాలియన్‌లోనే ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికైన ఆమె లెఫ్టినెంట్ కల్నల్ వి.మోహన్, సుబేదార్ మేజర్ పుష్పరాజ్‌ల చేతుల మీదుగా రూ.4500 నగదు బహుమతి కూడా అందుకోవటం కళాశాలకే గర్వకారణమని, ఆమె సాధించిన విజయం మిగిలిన ఎన్‌సీసీ క్యాడెట్లుకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ మీరావలి తదితరులు ఆమెను అభినందించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రామ్‌రతన్‌జీ బాబా మహాస్తూపం

● మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డి



రామ్‌రతన్‌జీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మానుగుంట మహీధరరెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గురు రామ్‌రతన్‌జీ ఆశ్రమంలో నిర్మించిన 108 అడుగుల బాబా స్తూపం భవిష్యత్తులో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి పేర్కొన్నారు. మచిలీపట్నం సమీపంలోని గూడూరు వద్ద ఉన్న ఆశ్రమంలో మహీధరరెడ్డి ఛైర్మన్‌గా ఉన్న మానసాదేవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన రామ్‌రతన్‌జీ బాబా విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొనగా మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెడన ఎమ్మెల్యే కాగితపు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లిన అభిమానులు మహీధరరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వలేటి రాఘవులకు ఘన నివాళి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ వలేటి రాఘవులు 4వ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సోమవారం ఆయన స్తూపం వద్ద నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడుతూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బీ.సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్, మాధవరావు, ఎం.లక్ష్మీనారాయణ, మురళి, డి.ఆదినారాయణ, కోటేశ్వరరావు, బాలబ్రహ్మాచారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల వ్యతిరేక నల్లచట్టాలు రద్దు చేయాలి

● వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన ర్యాలీ ● భారీగా తరలివచ్చిన ముస్లిం మహిళలు



నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కావలిటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ముస్లిం సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మాగుంట పార్వతమ్మ రోడ్డుపై నిర్వహించిన నిరసన ర్యాలీ హోరెత్తింది. నల్ల జెండాలు చేతపట్టి జెండాచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. తమ డిమాండ్లతో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. అనంతరం మత పెద్దలు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుంచి 28 వరకు ప్రతి ఒక్కరికీ మత స్వేచ్ఛ ఉందన్నారు. ముస్లిం హక్కులను కాలరాయడం కోసం బీజేపీ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవం చేవారని, పూర్వం ముస్లింలతో పాటు హిందువులు కూడా మసీదులు, దర్గాలు పీర్ల చావిడిల నిర్వహణకు తమ ఆస్తులను స్వచ్ఛందంగా దానం చేసి మత సామరస్యాన్ని చాటారని చరిత్ర చెబుతుందన్నారు. ముస్లిం హక్కు అయిన వక్ఫ్‌బోర్డులో సభ్యులుగా ముస్లిం వేతరులను నియమించడం దుర్మార్గమన్నారు. తమ మతపరమైన హక్కులు కాపాడుకునేం దుకు పెద్దఎత్తున ఉద్యమిస్తామని, అవసరమైతే ప్రాణాలు వదిలేందుకు సిద్ధమన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలు నోరు విప్పి వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వేరుశనగను ముంచిన వాతావరణం!

● అధిక వర్షపాతంతో తగ్గిన పంట దిగుబడి ● నాణ్యత లేక ధర ధమాల్ ● ఎకరాకు రూ.50 వేలు నష్టపోయిన రైతులు



బస్తాలకు కట్టిన వేరుశనగ కాయలు

ఉలవపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ప్రతి కూల వాతావరణంతో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపో యారు. మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం, టెంకాయచెట్ల పాలెం, బట్టిసోమయ్యపాలెం, చాకిచర్ల తదితర తీరప్రాంత గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. వాతారవణం అనుకూలిస్తే ఎకరాకి 50 నుంచి 60 బస్తాలు పంట దిగుబడి వస్తుంది. ఒక్కో బస్తాకు 36 కేజీల వేరుశనగ కాయలు నింపుతారు. వేరుశనగ పప్పు దిగుబడి 80 శాతం ఉంటే ఆశించిన రేటు రూ.3000 పైనే పలుకుతోంది. అంతకు మించి తగ్గితే రేటు కూడా తగ్గిపోతోంది. దీంతో పెట్టుబడికి, విక్రయానికి మధ్య తేడా నష్టాలను చవిచూసేలా చేస్తోంది. ఈ క్రమంలో గడిచిన ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో ఇసుక నేలల్లో నీటి నిల్వలు పెరిగాయి. దీంతో వాతావరణం అనుకూలించక వేరుశనగ పంట గుబురువేరు విస్తరించక కాయ దిగుబడి తగ్గింది. నీటి ఊట శాతం అధికంగా ఉన్న పొలాల రైతులు రెండు సార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. దీంతో ఎకరాకి రూ.లక్ష పెట్టుబడి పెట్టినా ఆశించినంత దిగుబడి రాక ఎకరాకి గరిష్ఠంగా 30 బస్తాలు పంట చేతికొచ్చిందని రైతులు దిగాలు చెందారు. దిగుబడి తగ్గడంతోపాటు కాయల నాణ్యత శాతం తగ్గడంతో 36 కేజీల బస్తా రూ.2500లకు అమ్ముడుపోతోంది. కౌలు చెల్లింపు, సేద్యం పెట్టుబడి, విత్తనాల రేటు అన్ని కలిపితే ఎకరాకు సుమారు రూ.లక్ష ఖర్చు అవుతోంది. అధిక భాగం రైతుల పంట దిగుబడి 25 బస్తాలకు పరిమితం అయ్యింది. దీంతో ఎకరాకు సుమారు రూ.50 వేలు నష్టం వచ్చినట్లు రైతులు వాపోతున్నారు.

భారీగా నష్టం వచ్చింది



ఈ ఏడాది నా సొంత పొలం 4 ఎకరాలు, కౌలుకు 8 ఎకరాలు తీసుకుని 12 ఎకరాల్లో వేరుశనగ సేద్యం చేశాను. ఒక కారు పంటకు రూ.25000 కౌలుకు తీసుకున్నాను. వర్షాల వల్ల ఇసుక నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో కాయ దిగుబడి, నాణ్యత తగ్గి రేటు పడిపోండంతో భారీగా నష్టం వాటిల్లింది.

- పాదాల మురళీ కృష్ణ, వేరుశనగ రైతు

ప్రతి పథకాన్ని అర్హులకు అందించాలి

● ఆముదాలదిన్నె సచివాలయంలో ఎంపీడీవో శ్రీదేవి తనిఖీ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలిరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అదించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందేలా చూడాలని ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలదిన్నె గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచించే సర్వేను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం ఉద్యోగుల హాజరుతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు.

టీచరు కల..

నెరవేరుతున్న వేళ!

- మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఉత్సాహం
- జిల్లాలో కొలువుల కోలాహలం

డీఎస్సీ ప్రకటన నిరుద్యోగుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపింది. ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ఏళ్లతరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు సంబరాల్లో మునిగిపోయారు. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఈసారి డీఎస్సీలో వయోపరిమితి పెంచడంతోపాటు క్రీడా కోటాలోనూ వెయిటేజీ పెంచారు. ఇవన్నీ నిరుద్యోగులకు కలిసివచ్చే అంశాలు కాగా వయోపరిమితి పెంపుతో ఎంతోమంది అవకాశం కూడా లభించనుంది. నిరుద్యోగులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్‌లలో 673 పోస్టులు భర్తీ చేయనుండటంపై అభ్యర్థులంతా రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నిరుద్యోగ యువతకు ఊపిరి

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏడేళ్ల నుంచి ఎదురు చూపులకు కూటమి ప్రభుత్వం ఊపిరి పోసింది. గత టీడీపీ ప్రభుత్వం 2018లో భర్తీ చేసిన పోస్టులు తర్వాత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను విస్మరించింది. 5 ఏళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరాశతో కాలం గడపాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం మాలాంటి నిరుద్యోగులకు ఊరటనిచ్చినట్లైంది.

- తాళ్లూరి కృష్ణ, ఉలవపాడు



శుభ పరిణామం

గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించలేదు. ఇప్పుడు పోస్టులు పెంచుతూ మెగా డీఎస్సీ ప్రకటించడం శుభ పరిణామం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఈ విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేయాలి.

- షేక్ నాజియ, ఉదయగిరి



అద్భుతం జరిగింది

ప్రభుత్వ ఉపాధ్యాయులవుతామన్న ఆశ వదులుకుని ప్రత్యామ్నాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్న తరుణంలో రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం నిజంగా అద్భుతం. దీంతో మళ్లీ ప్రభుత్వ ఉపాధ్యాయులవుతామన్న ఆశలు చిగురించాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు.

- డీ.మాధవి, కావలి



మాలో జీవం నింపింది

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ 16,347 మంది డీఎస్సీ అభ్యర్థుల జీవితాలకు జీవం పోసింది. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే బంధుమిత్రులు ఫోన్ చేసి విషయం చెబితే నమ్మశక్యం కాలేదు. నిజమని తెలుసుకున్నాక ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మేలు మరవలేం. ఆయనకు రుణపడి ఉంటాం.

- తాటిపర్తి హరికృష్ణ, కావలి



ఎంతో ఆనందకరం

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఎంతోకాలంగా టెట్, డీఎస్సీకి ప్రిపేరై నోటిఫికేషన్‌లు లేకుండా డీలా పడిన మాలాంటి నిరుద్యోగులకు ఈ నోటిఫికేషన్ ఊరటనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- జి.ప్రమీల, కేకేపల్లి, పొదలకూరు



ఎంతోమందికి అవకాశం

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. ఎక్కువ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయం. వయో పరిమితి 42 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచడం ద్వారా ఎంతోమంది యువతకు ఇది ఒక మంచి అవకాశం.

- సింగాల వెంకటేశ్వర్లు, సీతారామపురం



హామీ నిలబెట్టుకున్నారు

నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నోటికేషన్ వరం లాంటిది. ఇందులో ఆప్షన్ల నమోదు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ విషయంలో నూతన విధానాలు తీసుకురావడం ఆనందంగా ఉంది. ఫీజుల చెల్లింపుల విషయంలో క్లారిటీ ఉంది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్.

- కాకులూరు స్వప్న, పొదలకూరు



8 ఏళ్ల నిరీక్షణ ఫలిస్తోంది

2014-15లో బీఈడీ పూర్తి చేశాను. కోర్సు పూర్తి చేసుకున్న మొదట్లో డీఎస్సీ పరీక్షకు అనివార్య కారణాల వల్ల హాజరు కాలేక అవకాశాన్ని వదులుకున్నాను. అప్పటి నుంచి డీఎస్సీ కోసం నిరీక్షిస్తున్నాను. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం యువతకు అవకాశాన్ని కల్పించినందుకు ఆనందంగా ఉంది. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 75 నుంచి 90 రోజుల సమయం ఉండాలి. నిరుద్యోగంతో తిరుగుతున్న తమకు డీఎస్సీ నోటిఫికేషన్ ఊపిరి పోసినట్లయింది.

- నిడిగుంట రాజకిషోర్. అల్లూరు



ఓసీ అభ్యర్థులకు వరం

ఆరేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడం సంతోషంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఈ ఉద్యోగ ప్రకటన కోసం ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్నాను. టీచరు ఉద్యోగం సాధించేందుకు చాలా కష్టపడి చదువుతున్నాను. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. అలాగే ఓసీ అభ్యర్థులకు వయో పరిమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచడంతో వారికి మేలు చేకూరింది.

- నాయుడు శైలజ, లింగసముద్రం

వైసీపీ బొమ్మల పిచ్చి

- ప్రజాధనం వృథా



వైసీపీ పాలనలో జగన్ బొమ్మల పిచ్చితో ప్రజాధనం వృథా అయింది. ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు, రైతుల భూముల పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు వేశారు. చివరకు సచివాలయాల ద్వారా మంజూరుచేసే పలు రకాల సర్టిఫికెట్లపై కూడా నవరత్నాలు లోగో, జగన్ బొమ్మలు వేశారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల ద్వారా మంజూరుచేసే సర్టిఫికెట్లపై బొమ్మలను తొలగించింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా పరిషత్తు కార్యాలయం నుంచి మండల పరిషత్తు కార్యాలయాలకు అందిన హైసెక్యూరిటీ పేపర్లు పనికిరాకుండా పోయాయి. దీంతో ఈ పేపర్ బండిళ్లను సోమవారం మండల పరిషత్తు అధికారులు తిరిగి జడ్పీకి పంపారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

ఆత్మకూరులో ముఖ్యమంత్రి పర్యటన

- త్వరలో అధికారికంగా ఖరారు
- రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1న ఆత్మకూరులో పర్యటించనున్నట్లు, అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి ఆనం అధికారులతో సమావేశం నిర్వహించారు. మే 1వ తేదీన ఆత్మకూరు సమీప గ్రామంలో పింఛన్ల పంపిణీ, నారంపేట వద్ద ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ పార్కు ప్రారంభోత్సవం అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొంటారని ప్రాథమిక సమాచారం అందినట్లు తెలిపారు. అనువైన ప్రాంతాన్ని హెలిప్యాడ్ కోసం ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు, ఎలక్ట్రికల్, మున్సిపల్ శాఖ అధికారులు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భూ సమస్యల పరిష్కారంలో

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



అర్జీదారుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమంవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- పీఎం విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇప్పించాలని కోరుతూ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్య దర్శి తల్లం సురేష్ ఆచారి, కోశాధికారి ఏలూరు బాబు ఆచారి, శ్రీమంతుల రఘునాథ్‌ఆచారి, వేములూరు రఘురామయ్య ఆచారి పాల్గొన్నారు.
- ఇటీవల విడుదలైన బీసీ స్వయం ఉపాధి రుణాల మంజూరులో అవకతవకలపై విచారణ జరిపించాలని ఏపీ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్‌యాదవ్, జేసీకి వినతిపత్రం సమర్పించారు. అవకతవకలకు కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- కనిగిరి రిజర్వాయర్‌లో మత్స్యసంపదను వేలం వేయవద్దని యానాదుల సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, పొట్టేళ్ల నాగరాజు, శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.
- ఊటుకూరు దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అ క్రమ కేసులను ఎత్తివేయాల ని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య కలె క్టర్‌కు వినతిపత్రం సమ ర్పించారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న ప్ర భుత్వ భూములను దళి తులకు, ఇతర పేదలకు పంచాలని కోరారు.
- పిత్రార్జితంగా సంక్రమించిన స్థిరాస్తిని కబ్జా చేసిన వారిపై చర్య లు తీసుకోవాలని పొదల కూరు మండలం మహ మ్మదాపురం గ్రామ కాపుర స్తుడు పల్లిబోయిన వెంకట శేషయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆక్రమణదారుల నుంచి తన భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు
- జిల్లాలోని ఏఎస్‌పేట మండల కేంద్రంలో ఉన్న ఉర్దూ పాఠశాలను ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయవద్దని ఆ పాఠశాల కమిటీ చైర్మన్ పఠాన్ షాన్వాజ్, సభ్యులు పఠాన్ సందానీఖాన్, గండువారిపల్లి బాషా తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలను ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయడం వల్ల ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంతో నష్టపోతారన్నారు. ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న ఏఎస్‌పేటలో ఉర్దూ పాఠశాల ఎంతో అవసరమన్నారు. అధికారులు ఈ విషయంపై స్పందించి ఉర్దూ పాఠశాల విలీనాన్ని ఆపాలని కోరారు.

గ్రావెల్ మాఫియాకు చెక్!

- గ్రామస్థుల ఫిర్యాదుతో అడ్డుకున్న ఎమ్మెల్యే కాకర్ల
- వాహనాల సీజ్.. అధికారుల తీరుపై ఆగ్రహం
- ఉదయగిరిని వీడాలని మాఫియాకు హెచ్చరిక



గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సీజ్ చేసిన వాహనాలు

ఉదయగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మండలం నల్లగొండ ప్రాంతంలో గత కొన్నిరోజులుగా కొందరు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని ఆ గ్రామస్థులు సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన హుటాహుటిన అధికారులకు సమాచారం ఇవ్వకుండా తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న తవ్వకాలను చూసి ఎమ్మెల్యే ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే వెళ్లారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు సైతం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంత భారీ ఎత్తున ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తరలిస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు అబ్దుల్ హమీద్‌ను ఆదేశించారు. గ్రావెల్ తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, రెండు టిప్పర్లు, ఒక హిటాచీ వాహనాలను, గ్రావెల్ డంప్‌ను సీజ్ చేయించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ అధికారులను ఆదేశించారు.

● మాఫియాను వెంటాడతా

అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో సహజ సంపదలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోనన్నారు. మైనింగ్ మాఫియా తన నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలని, లేదంటే వెంటాడతానని హెచ్చరించారు. కొంతమంది పని గట్టుకుని తన పేరు చెప్పి అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటివి అధికారులు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కలిగిరి సీఐ వెంకట నారాయణ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 119 వినతులు

- మండుటెండలోనూ తరలివచ్చిన అర్జీదారులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు తెలుపుకునేందుకు మండుటెండలోనూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తరలివచ్చారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదికకు 119 మంది అర్జీదారులు హాజరై సమస్యలను ఎస్పీ జీ కృష్ణకాంత్‌తో పాటు ఇతర పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఎస్పీతోపాటు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

- రాపూరు ప్రాంతానికి చెందిన వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తెలంగాణ రాష్ట్రంలోని గోదావరిఖని ప్రాంతానికి చెందిన శ్వేత రూ.4.58 లక్షల నగదు తీసుకుంది. ఉద్యోగం ఇప్పించకపోగా, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిందని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.
- నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అతడి వద్ద నగరానికి చెందిన విజయ భాస్కర్‌రెడ్డి రూ.84 వేలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తిరిగి నగదు ఇవ్వలేదని బాధితుడు పేర్కొన్నాడు. న్యాయం చేయాలని కోరాడు.



అర్జీదారుడి సమస్యను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

- తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడకు చెందిన వ్యక్తికి కావలికి చెందిన దేవరకొండ కిషోర్, అతడి అనుచరులు తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించారు. దీంతో అతను వారికి రూ.40.90 లక్షలు ఇచ్చాడు. వారు బంగారు ఇవ్వకపోగా, నగదు అడుగుతుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితుడు పేర్కొన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరాడు.
- తన కుమార్తె నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో అత్తవారి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని, ఆమె బలవన్మరణానికి అల్లుడు, అత్త, మేనమామ కారణమని, ఈ విషయమై దర్యాప్తు చేయాలని ప్రకాశం జిల్లాకి చెందిన వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

కమ్మసాయిపై పీడీయాక్ట్ ఉత్తర్వులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చంద్రమౌళినగర్‌కు చెందిన లక్ష్మిశెట్టి సాయితేజ అలియాస్ కమ్మసాయిపై పీడీయాక్ట్‌కు అనుమతిస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో కమ్మసాయిపై రౌడీషీట్ ఉంది. 2022 మేలో ఆయనపై పోలీసు అధికారులు పీడీయాక్ట్ ప్రయోగించారు. ఏడాదిపాటు కడప జైలులో ఉండి బయటకు వచ్చాడు. అయినా అతడి ప్రవర్తనలో మార్పురాలేదు. బాలాజీ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ హత్య, మూడు హత్యాయత్నాలు, దోపిడీ, దౌర్జన్యం కేసులున్నాయి. దీంతో పోలీసులు పీడీయాక్టు నమోదు చేశారు. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి వేదాయపాలెం పోలీసులు జిల్లా కేంద్రకారాగారం రిమాండ్‌లో ఉన్న కమ్మసాయికి నోటీసులు ఇచ్చి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ మేరకు కలెక్టర్ సోమవారం పీడీయాక్ట్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కపిల్ చిట్స్‌లో కలెక్షన్ స్టాఫ్, అకౌంట్ సెక్షన్ స్టాఫ్ ఉద్యోగాలకు, క్రెడ్‌యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్‌లో ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతలు కలిగి, 20 నుంచి 35ఏళ్లలోపు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు

సర్వేలో వ్యతిరేకతపై కౌన్సెలింగ్

- జాయింట్ కలెక్టర్ కార్తీక్ వెల్లడి

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నిరంతరం నిర్వహిస్తున్న సర్వేలో వ్యతిరేకత వ్యక్తమైన అధికారులు, సిబ్బందికి ఒకటికి రెండుసార్లు కౌన్సెలింగ్ ఇవ్వనున్నామని, అప్పటికీ వ్యతిరేకత వస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని జేసీ కే. కార్తీక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో రీసర్వే పురోగతి, తదితర అంశాలపై వివిధశాఖల అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండోదశ రీసర్వేను గ్రామాల్లో గ్రామసభలు ముగిసిన వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని పాఠశాలల్లోని అన్నీ ఆర్వో ప్లాంట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు సంబంధించి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు జేసీ తెలిపారు. పింఛన్లు పంపిణీ, అన్న క్యాంటీన్లు, రేషన్ పంపిణీ, దీపం గ్యాస్ కనెక్షన్లు, ఆర్టీసీ సేవలు, విద్యుత్ తదితర సేవలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలంతా సంతృప్తి చెందేలా ప్రభుత్వ సేవలను అందించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మనమిత్ర యాప్ గురించి అవగాహన కలిగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈలు విజయన్, వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ పోటీల విజేత శ్యామ్యూల్ స్టీఫెన్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ సంఘం, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర చెస్ పోటీల్లో అనంతపురానికి చెందిన శ్యామ్యూల్ స్టీఫెన్ నోబల్ చాంపియన్‌గా నిలిచాడు. అలాగే హైదరాబాద్‌కి చెందిన ఎం.అక్షయ్‌కుమార్ ద్వితీయస్థానం, నెల్లూరుకి చెందిన పీ.హరిరామ్ సాయికృష్ణ తృతీయ స్థానం సాధించారు. వీరితోపాటు నెల్లూరుకి చెందిన ఎం.రామ్‌లికిత్ నాలుగవస్థానం, తిరుపతి జిల్లా గూడూరుకి చెందిన బీ.గిరిబాబు ఐదుస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్స కార్యక్రమంలో ఫన్‌పార్క్ ఎండీ సాయి పొత్తూరి అతిథిగా పాల్గొని మాట్లాడారు. చదరంగం క్రీడా సాధనతో యువత, విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుందన్నారు. క్రీడాకారులంతా గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వేసవి సెలవుల్లో ఫన్‌పార్క్‌లో ఆలిండియా ఓపెన్ చెస్‌పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్ కల్యాణ మండపం అధినేత పచ్చిపులుసు శ్రీరాములు, ఘుమఘుమల రెస్టారెంట్ యజమాని ఎస్.కళ్యాణ్, రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్, కడపజిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్, శ్రీఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపీనాథ్, కోచ్ డాక్టర్ మధుసూదన్, జేసీస్ జోనల్ వైస్ చైర్మన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులతో పోటీల నిర్వాహకులు